VISALAANDHRA, VIJAYAWADA -4· Phone 376
● ● ● Regd No. H-203

విశాలాంధ్ర
చందా వివరాలు

	ఏజెంటు ద్వారా	పోస్టు ద్వారా
సంవత్సరం	రు 31 00	రు 34 00
ఆరు మాసాలు	15.50	17 00
మూడు మాసాలు	7 75	8 50
ఒక మాసం	2 65	2 90

విశాలాంధ్ర

201913

సంపుటి 14 సంచిక 318] విజయవాడ • 5-2-1965 శుక్రవారం [6 పేజీలు 8 పై.

ఎంతధాన్యం సేకరించేది వెల్లడించడానికి శ్రీ టి. ఎ. పాయ్ నిరాకరణ

అలాచేస్తే, వ్యాపారులూ, ఉత్పత్తిదార్లూ నిల్వచేస్తారని ఆహారకార్పొరేషన్ అధ్యక్షుని వాదన

రైతులకు ఇతోధిక రుణ సౌకర్యాల ను ఏర్పాటు చేస్తామని ప్రకటన

('విశాలాంధ్ర విలేకరి')

విజయవాడ ఫిబ్రవరి 4

ఆహార కార్పొరేషన్ ఎంత ధాన్యం సేకరించి నిల్వచేసేది తాను వెల్లడించననీ అలా చేస్తే ఉత్పత్తిదార్లూ, వ్యాపారులూ ధాన్యం నిల్వ జేసి అధికధర రాబట్టడానికి ప్రయత్నిస్తారనీ కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీ టి ఎ పాయ్ నేడిక్కడ పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ చెప్పారు.

దేశంలో అధికోత్పత్తిని సాధించవలసినదృష్ట్యా, రైతులకు అవసరమైన రుణాలు త్వరగా, సకాలంలో లభ్యమయ్యేటట్లు ఆహార కార్పొరేషన్ అవసరమయిన చర్యలన్నింటినీ తీసుకొంటుందని శ్రీ టి. ఎ. పాయ్ నేడిక్కడ అన్నారు.

అత్యంత అవసరమయిన రుణాలను ఇవ్వటం', లాంఛనాల పేర ప్రస్తుతం చాలా జాప్యం జరుగుతున్నదని అన్నారు.

రైతుకు అప్పుయివ్వవచ్చా లేదా? ఇస్తే తిరిగి వస్తుందా? ఇచ్చిన ఋణాన్ని తిరిగి రాబట్టుకునేది ఎలాగా? అనే మీమాంస ఇప్పుడు రుణాలు మంజూరు చేయటంలో జరుగుతున్నదన్నారు.

అంతే గాకుండా, సాగుచేసే భూమి విస్తీర్ణంతో నిమిత్తం లేకుండా అందరికీ ఒకేరకమైన మొత్తాన్ని ఇవ్వటం జరుగుతున్నదని, ఇది పొరపాటని చెప్పారు సాగుచేసే భూమి విస్తీర్ణాన్నిబట్టి [illegible] అన్నారు.

బ్యాంకులకు ఇతర సహకార సంస్థలకు, రైతుల తరపు ఆహార కార్పొరేషన్ హామీ వుండి, రైతులకు త్వరగా రుణాలు అందేటట్లు ప్రయత్నించనుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేషన్ ఇంకా ప్రత్యక్ష ధాన్య సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించలేదని, అవసరమయిన యంత్రాంగాన్ని కార్పొరేషన్ రాష్ట్రంలో నెలకొల్పిన తర్వాత ధాన్యసేకరణ ప్రారంభిస్తామని అన్నారు.

కార్పొరేషన్ సేకరించిన ధాన్యానికి అక్కడికక్కడే ధరను చెల్లించటం జరుగుతుందని అవసరమైతే పంట నూర్పిడికి ముందే, కార్పొరేషన్ రైతులకు రుణాలు ఇస్తుందనిచెప్పారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలు రైతులకు లభించకపోయినట్లయితే అటువంటి సందర్భాలలో రైతులకు నిర్ణయించిన ధరలు లభ్యమయ్యేటట్లు చూస్తుందని తెలిపారు.

కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సి. నరసింహంకూడా పత్రికాగోష్ఠిలో పాల్గొన్నారు.

మిల్లర్లతో చర్చలు

విజయవాడ, ఫిబ్రవరి 4

ఆహారధాన్యాల వ్యాపారం విషయంలో మిల్లర్ల సహకారం కోరేందుకు ఆహార కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీ టి. ఎ పాయ్ స్థానిక రైస్‌మిల్లర్ల అసోసియేషన్ హాలులో [illegible] మిల్లర్లతో నేడు చర్చలు జరిపారు

మిల్లర్లంటే కార్పొరేషన్‌కు విశ్వాసం వుందని వారి సహకారం తీసుకోవాలని కార్పొరేషన్ హృదయపూర్వకంగా కోరుతున్నదనిఆయన అన్నారు. అయితే మిల్లర్ల ధోరణి "కాలుకువేస్తే మెడకు మెడకువేస్తే కాలుకి" అనే విధంగా ఉంది

శ్రీ టి. ఎ. పాయ్‌తోపాటు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టరు శ్రీ సి. నరసింహం, రీజనల్ మేనేజరు శ్రీ కె. వి. నటరాజన్ కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు

మైసూరు, కేరళ తదితర రాష్ట్రాలలో నూకల వాడకం బాగా వుందనీ, అందువల్ల ఆ రాష్ట్రాలకు కార్పొరేషన్ నూకలు సప్లయి చేయాలని అనుకుంటున్నదనీ, అందువల్ల సరసమయిన ధరకు ఆంధ్రప్రదేశ్‌లోని మిలర్లు నూకలు సప్లయి చేయాలని కార్పొరేషన్ తరపున శ్రీ సి. నరసింహం కోరారు. ఫిబ్రవరి మార్చినెలల్లో ఎన్నిటన్నుల నూకలు సప్లయి చేయగలరని కూడా అడిగారు.

ఈ రెండు నెలల్లో అచ్చిరంగా 30 వేల

(మిగతా 2 వ పేజీలో)

5 వ ఉక్కు ఫ్యాక్టరీ స్థల సూచనకై నిపుణుల పరిశీలన

న్యూఢిల్లీ ఫిబ్రవరి 3

అయిదవ ఉక్కు కర్మాగారానికి స్థల నిర్ణయం సూచించవలసిందిగా భారత ప్రభుత్వం కోరిన బ్రిటిష్ - అమెరికన్ కన్సార్టియం (సంయుక్త సంస్థ) ప్రతినిధి గార్డన్ కాక్స్ ఇక్కడ నేడు మాట్లాడుతూ మూడు-నాలుగు నెలల్లో మంచి ప్రదేశాలను తమ సంస్థ నిపుణులు సూచించగలుగుతారన్నారు

బొగ్గు - ఇనుము ముడివస్తువుల రవాణా విద్యుదుత్పత్తి విషయాలలో నిపుణులయిన వారు వేర్వేరు గ్రూపులుగా బయలుదేరి సేలం - నైవెల్లి, - బరిసిల - విశాఖపట్టణం, గోవా - హాస్పేటలకు వెళ్ళి ఆ ప్రాంతాలను ప్రత్యక్షంగా చూస్తారనీ, కర్మాగార ప్రదేశాన్ని నిర్ణయించడంలో ముడివస్తువనరుల్నీ, రవాణా సౌకర్యాలనూ ఆ ప్రదేశ స్వభావాన్నీ కూడ పరిశీలనలోకి తీసుకొంటారనీ అన్నారు.

భారతప్రభుత్వం స్థలనిర్ణయంచేశాక అప్పుడు ప్రాజెక్టు నివేదికను ఇస్తామనీ, అటుతర్వాత ధనం ఇవ్వడం గురించి ఒప్పందం జరుగుతుందనీ కాక్స్ అన్నారు.

స్థల నిర్ణయంలోనూ, ప్రాజెక్టు నివేదికను తయారు చెయ్యడంలోనూ భారతీయ ఇంజనీర్ల సహకారం కూడా తీసుకొంటామని కాక్స్ అన్నారు

ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ స్థల నిర్ణయ పరీక్షకనీ, ప్రాజెక్టు రిపోర్టు కనీ ప్రభుత్వం కన్సార్టియముకు 80 లక్షల రూపాయలివ్వాలనీ, దానిలో 80 శాతాన్నివిదేశీద్రవ్యంలో ఇవ్వటానికి ఒప్పందం కుదిరిందని అన్నారు.

ఓటర్లుకాగోరినందుకు 1600 మంది అరెస్టు

అమెరికా నీగ్రోల దురవస్థ

సెల్మా ఫిబ్రవరి 3

అలబామా రాష్ట్రంలోని సెల్మాలో వోటర్లుగా చేరేటందుకై నీగ్రోలు ప్రారంభించిన ఉద్యమం సందర్భంగా నేడు సెల్మాలోనూ, అక్కడకు 30 మైళ్ళలోవున్న మారియన్‌లోనూ పెద్దఎత్తున అరెస్టులుజరిగాయి

సెల్మాలో రమారమి 300 మందినీ, మారియన్‌లో 400 మందినీ అరెస్టుచేశారు వోటర్లుగా చేరేటందుకై నీగ్రోలు ప్రారంభించిన వుద్యమానికి సెల్మా కేంద్రం ఈ వుద్యమం ఆరంభమయి 18 రోజులయింది. ఈ పదహారు రోజులలో 16 వందల మంది అరెస్టయ్యారు.

కొచ్చిన్ నౌకా కేంద్ర నిర్మాణానికి ప్రారంభోత్సవం

ఎర్నాకుళం ఫిబ్రవరి 3

కొచ్చిన్‌లో ద్వితీయ నౌకానిర్మాణ కేంద్రం ఏర్పాటుకు రేపు కేంద్ర రవాణాశాఖ మంత్రి శ్రీ రాజ్‌బహదూర్ ప్రారంభోత్సవం చేస్తారు ఈ ప్రారంభోత్సవానికి కేంద్ర రక్షణ పరికరాల ఉత్పత్తిశాఖ మంత్రి శ్రీ ఎ. యం. థామస్ అధ్యక్షత వహిస్తారు.

కొచ్చిన్ నౌకాకేంద్ర నిర్మాణానికి సన్నాహక చర్యలను పూర్తిచేసేందుకు రేపు జపాన్ నౌకానిర్మాణ బృందం ఎర్నాకుళం చేరుతోందని భావించబడుతున్నది.

కొచ్చిన్ నౌకా నిర్మాణ కేంద్రాన్ని నిర్మించే విషయంపై గత సోమవారం భారత ప్రభుత్వం జపాన్‌లమధ్య అంగీకారం కుదిరింది.

క్యూబాపై విప్లవప్రతీఘాతుక మూక నావ దాడి

మియామి, ఫిబ్రవరి 4

క్యూబా దక్షిణ తీరంలోని నూనె టాంకు ఆవరణపై 'విప్లవ ప్రతీఘాతుక' మూక నౌక ఒకటి గతరాత్రి కాల్పులు జరిపినదని, అయితే పెద్దగా నష్టం జరగలేదని క్యూబా రేడియో ప్రకటించింది.

శివాజీ వాషింగ్ సోడాకు
డీలర్లు కావలయును
మీకు నచ్చేది మీరు మెచ్చేది
"శివాజీ"
వాషింగ్ సోడా
పూర్తి వివరములకు దయచేసి వ్రాయండి:
శివాజీ వాషింగ్ సోడా కంపెనీ,
సి - 88, పోస్టు స్టేషన్ రోడ్డు తిల్లై నగర్, తిరుచురాపల్లి-3
గమనిక: ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో మాత్రమే
Paramount

నాడు - నేడు



బ్రిటన్‌లో అధికారంలోఉన్న పార్టీ మారినా అణ్వస్త్రవిధానం మార్పులేదు.

అన్ని బ్యాంకులకు ప్రతి రాష్ట్రంలో సర్కిల్

డా. రాజబహదూర్ గౌడ్ సూచన

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్ ఫిబ్రవరి 4

దేశంలో ఉన్నరాష్ట్రాలను దృష్టిలో పెట్టుకొని, బ్యాంకులన్నీ తగువిధంగా సర్కిల్‌ను ఏర్పాటు చేసుకోవాలి ఈ దృష్టిలోనే బ్యాంకులు పరిపాలనా వ్యవస్థలను రూపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌బహదూర్ గౌడ్ అన్నారు

స్టేట్ బ్యాంకు ఉద్యోగుల జనరల్‌బాడీ సమావేశంలో నిన్న సాయంత్రం శ్రీ గౌడ్ ప్రసంగిస్తూ దేశంలో ప్రధానమయిన ఆర్థిక సహాయ సంస్థలు బ్యాంకులు అయినందున అవి మన ప్రణాళిక లక్ష్యాల కనుగుణంగా పెట్టుబడులు పెట్టాలన్నారు ప్రాంతీయ అనుమానతల నివారణకు కూడా బ్యాంకులు ప్రయత్నించాలని సూచించారు.

ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ పాత్ర వహించవలసి వుంటుందనీ, బ్యాంకు అప్పులకు వివిధ సంస్థల తరపున ప్రభుత్వం హామీలు ఉండేటప్పుడు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలనీ చెప్పారు.

"ప్రతి బ్యాంకుకు రాష్ట్రానికి ఒక సర్కిల్ వుండాలి. ఈ సమస్యలన్నింటినీ సర్కిల్ కేంద్ర కార్యాలయం చూడాలి, తద్వారారాష్ట్ర ప్రభుత్వానికి పనిసులభమవుతుంది. అందువల్ల చిత్తూరు నెల్లూరు బ్రాంచీలను ఆంధ్రా సర్కిల్‌లో చేర్చాలంటున్నాం. ఇలా అనటం సంకుచిత భాషాతత్వంకాదు ఇది ఒక శాస్త్రీయ వైఖరి' అని గౌడ్ అన్నారు.

రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌లోని రిజర్వు బ్యాంకు కార్యకలాపాలను విస్తరింపచేయాలి హైదరాబాద్‌లో వున్న రిజర్వు బ్యాంకు కార్యాలయంలో విదేశమారకం కంట్రోలు విభాగంలేదు ఫలితంగా విదేశమారకం అవసరమున్న వ్యక్తులూ, వ్యాపార సంస్థలవారు మద్రాసు వెళ్ళవలసి వస్తున్నది ఇది అనవసర శ్రమా, అసౌకర్యమూ మాత్రమే కాదు ఇబ్బందికూడా" అన్నారు.

ఈ విషయాలన్నింటినీ రాష్ట్ర ఆర్థికమంత్రి దృష్టికి తాను తీసుకువద్దామనీ, ఈ విషయంలో ఇకనయినా రాష్ట్ర ప్రభుత్వం చురుగ్గా ముందుకు కదులుతుందని ఆశిస్తున్నాననీ అన్నారు.

బ్రిటిష్ ప్రధాని విల్సన్ ప్రకటనకు ప్రధాని శాస్త్రి సాచివేత సమాధానం

భారతదేశం అణుచ్ఛత్రాన్ని కోరిందన్న విషయంపై

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3

అణుబాంబుల దాడి జరిగే పరిస్థితులలో అణు రాజ్యాలు తమకు తగు రక్షణ కల్పించాలని భారతదేశం కూడా కోరిందని బ్రిటిష్‌ప్రధాని విల్సన్ చేసిన ప్రకటనపై అభిప్రాయం చెప్పవలసిందిగా నేడు కేరళ నుండి తిరిగి వచ్చిన ప్రధాని శాస్త్రిని విలేకరులు అడిగారు శ్రీ శాస్త్రి ఈ ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పకుండా, సాచివేత వైఖరి అవలంబించారు

"విల్సన్ ప్రకటనను నేను చూడనూలేదు, ఈ విషయమై విల్సన్ నుండి నాకు ఎట్టి వర్తమానమూ అందలేదు అనిశ్రీ శాస్త్రి అన్నారు

శ్రీ శాస్త్రి లోగడ బ్రిటిష్ నూతన ప్రధాని విల్సన్‌తో సంభాషణలకు లండన్ వెళ్ళినప్పుడు, భారతదేశం అణుచ్ఛత్ర రక్షణను కోరిందని పత్రికలలోవార్తలువెలువడిన విషయమూ తాను అటువంటి రక్షణను కోరలేదని శ్రీ శాస్త్రి చెప్పిన విషయమూ, పాఠకులకు విదితమే.

అణుబాంబును తయారు చేయడానికి నిరంతరం కృషి జరుపవలసిందిగా ఇండొనేసియా ప్రభుత్వం తమ శాస్త్రజ్ఞులకు యిచ్చిన ఉత్తర్వు గురించి అడుగగా శ్రీ శాస్త్రి ఎట్టి వ్యాఖ్యానమూ చేయలేదు.

సింహళ స్వాతంత్ర్యదినోత్సవం

సోవియట్ నాయకుల సందేశాలు

కొలంబో ఫిబ్రవరి 4

సింహళం నేడు 17 వ స్వాతంత్ర్య వార్షికోత్సవం జరుపుకొన్నది.

ఈ సందర్భంలో సోవియట్ ప్రధాని కోసిగిన్ సింహళ ప్రధాని శ్రీమతి సిరిమావోకు శుభాకాంక్ష సందేశం పంపారు.

సోవియట్ అధ్యక్షుడు మికోయాన్ సింహళ గవర్నరు జనరల్ విలియమ్‌గోపల్లవకు సందేశం పంపారని టాస్ వార్తాసంస్థ ప్రకటించింది

బొంబాయిలోని సింహళ దేశస్థులు నేడు తమ స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకొన్నారు.

"కాంబోడియా ఐరాస నుండి నిష్క్రమించదు"

జకార్తా, ఫిబ్రవరి 2

ఇండొనేసియా అడుగుజాడలలో కాంబోడియాకూడా పయనించి ఐరాసనుంచి నిష్క్రమిస్తుందంటూ బయలుదేరిన వదంతులలో నిజంలేదని కాంబోడియా ప్రతినిధి పంచావ్ నేడిక్కడ ఖండించారు.

చిన్న సంచిలో పట్టే స్కూటర్ రష్యాలో తయారీ

న్యూఢిల్లీ ఫిబ్రవరి 4

సోవియట్ యూనియన్ కొత్తరకం స్కూటర్‌ను తయారుచేసింది. ఈ స్కూటర్‌ను మడిచి చిన్న సంచిలో పెట్టి, అవసరమైతే వీపుమీద మోసుకుపోవడానికి వీలుంటుంది. దీని బరువు 22 కిలోగ్రాములని 'టాస్' ప్రకటన తెలుపుతున్నది.

ఈ స్కూటర్ గంటకు 35 కిలోమీటర వేగం పోగలదు దీనిలో ఒకసారి పెట్రోల్ 1 5 లీటర్ మాత్రమే నింపితే 100 కిలోమీటర్లదూరం ప్రయాణంచేయడానికి అది సరిపోతుంది.

ఈ స్కూటర్ పొడవు 120 సెంటీమీటర్లు ఎత్తు 75 సెంటీమీటర్లు.

విదేశీ పెట్టుబడులకు టి. టి. కె. స్వాగతం

కొరివితో తల గోక్కోవటమేనని కృష్ణమీనన్ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4

భారతదేశంలో విదేశీ ప్రయివేట్ పెట్టుబడులకు అపారమైన అవకాశాలు కలవని, విదేశీ పెట్టుబడులకు తాము సర్వ సౌకర్యాలు కల్పించగలమని కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ కృష్ణమాచారి నిన్న ఇక్కడ అమెరికా వాణిజ్య ప్రతినిధివర్గానికి హామీ యిచ్చారు.

అమెరికా వాణిజ్య ప్రతినిధివర్గ సభ్యులు వేసిన అనేక ప్రశ్నలకు శ్రీ కృష్ణమాచారి సమాధానమిస్తూ ఇలా పేర్కొన్నారు:

"భారత దేశంలోమార్కెట్టు నానాటికి విస్తరిల్లుతున్నది. పెట్టుబడి రేటు కూడా తగినంత వేగంగా పెరుగుతున్నది భారత దేశంలో అమెరికా పెట్టుబడులు క్రమేణాభివృద్ధి చెందుతున్నవి

"1961 లో భారత దేశంలోని విదేశీ పెట్టుబడుల మొత్తం రు 681 కోట్లు అందులో బ్రిటిష్ పెట్టుబడులు రు 447 కోట్లు

భారత దేశంలోకి ఏటేటా ప్రవేశిస్తున్న విదేశీ పెట్టుబడులు ఎక్కువ అవుతున్నాయి. 1962 లో రు 29 కోట్లు విదేశీ పెట్టుబడులు దేశంలోకి ప్రవేశించగా 1963 లో రు 34 కోట్లు విదేశీ పెట్టుబడులు దేశంలోకి వచ్చాయి.

భారత దేశంలో కొత్త పెట్టుబడిదారీ వర్గం ఒకటి తల ఎత్తుతున్నది. ఆ వర్గంతో విదేశీ పెట్టుబడిదారులు చేతులు కలిపెట్టు చూడాలని

(మిగతా 5 వ పేజీలో)

తలసరి ఆదాయంలో ఆంధ్ర బడుగుస్థితి

న్యూఢిల్లీ ఫిబ్రవరి 4

తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ చాలా వెనుకబడి వున్నదని "నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసెర్చ్' అంచనాలనుబట్టి తేలుతున్నది.

భారతదేశంలో తలసరి జాతీయ సగటు ఆదాయం రు. 334 50 లు కాగా, వివిధ రాష్ట్రాలలో తలసరి సగటు ఆదాయం ఈ క్రింది విధంగా వుంది.

ఢిల్లీరు 871.61లు, మహారాష్ట్ర రు468.54 పశ్చిమబెంగాల్ రు 464 62 లు, పంజాబు 451.31; గుజరాత్ రు. 373 లు. మద్రాసు రు. 334 09 లు, అస్సాం రు 333 34 లు. త్రిపుర రు 329 86 లు; హిమాచల్ ప్రదేశ్ రు. [illegible] కేరళ రు 314 [illegible] లు. మైసూరు రు 304 71 లు. ఉత్తరప్రదేశ్ రు. 297 35 జమ్ము కాశ్మీరు రు. 289 02 లు. ఆంధ్రప్రదేశ్ రు. 287 01 లు మధ్య ప్రదేశ్ రు. 285 35 లు. ఒరిస్సా రు 278 42 లు. రాజస్థాన్ రు 267.43 బీహార్ రు 220 69లు.

ఇప్పటి ధరల ప్రాతిపదికపై 1960-61 సంవత్సరంలో మొత్తం జాతీయాదాయం రు. 14,603 కోట్లుగా అంచనా వేశారు.

మేలైన వర్జీనియా
పొగాకులతో
మంచి సిగరెట్
పనామా
ఎంతో మంచి సిగరెట్
Panama
20
CIGARETTES
Specially blended for a cool and pleasant smoke from selected Virginia Tobacco leaves
GOLDEN TOBACCO COMPANY PRIVATE LTD

ప్రత్యేకతతో చేయువారు:
గోల్డెన్ టొబాకో కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్,
బొంబాయి 56
భారతదేశమందు ఇట్టి పరిశ్రమల్లో పెద్ద స్వదేశీయ సంస్థ
GT (P) 63 TL
Greens Advtg.

విశాలాంధ్ర

అఖిలభారత పోటీ పరీక్షలు

అఖిలభారత సర్వీసులకై జరిగే పోటీ పరీక్షలలో ఇంగ్లీషుతో పాటు, హిందీని కూడా ప్రత్యామ్నాయ భాషగా చేసే ఉద్దేశాన్ని ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నామని, ప్రధాని శాస్త్రి చేసిన ప్రకటన సముచితం

అంతేకాదు అసలీ పోటీ పరీక్షలను అన్ని ప్రాంతీయభాషలలోనూ వ్రాసే అవకాశం కల్పించాలి అలా కల్పించినప్పుడే కేంద్ర ఉద్యోగాలలో ప్రాంతీయ అసమానతలు తొలగటం సాధ్యం.

హిందీకి వ్యతిరేకంగా మద్రాసులో హెచ్చుగానూ ఆంధ్ర, మైసూరు తదితర రాష్ట్రాలలో కొంతవరకూ విద్యార్థులలో తీవ్రమైన అలజడి ఏర్పడటానికి ఒక అపోహ మూలకారణం. అఖిల భారత పోటీ పరీక్షలలో ఇక ముందు హిందీ ప్రాంతాలవారికే ప్రాధాన్యం లభిస్తుందనీ, తాము వెనుకబడి పోతామనేదే ఆ అనుమానం ఈ భయాందోళనలు కేవలం నిరాధారంకావు.

కేంద్ర ప్రభుత్వంలోని కొందరు హిందీ దురభిమానులు తీసుకొన్న చర్యలు ఇందుకు తోడ్పడ్డాయి.

కేంద్ర విద్యాశాఖ ఉపమంత్రి శ్రీ భక్తదర్శన్ గతవారం ఢిల్లీలో ఒక హిందీ ప్రాంతీయుల సభలో మాట్లాడుతూ 1965 సెప్టెంబరు నుండి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలలో హిందీ ప్రత్యామ్నాయ భాషగా ప్రవేశపెట్టబడుతుందని ప్రకటించారు

ఇలా ప్రకటించే అధికారం ఆయనకులేదు. హద్దుమీరిన హిందీ దురభిమాన ధోరణికిది తార్కాణం

వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సమస్యపై నిర్ణయం చేయవలసి ఉంది ఈ నెలాఖరులో ముఖ్యమంత్రుల సమావేశం జరుగనున్నది ముఖ్యమంత్రులు నిర్ణయం చేయకముందే ఈ మార్పు జరిగిపోయినట్లు ప్రకటించే హక్కు కేంద్ర విద్యాశాఖ ఉపమంత్రికి లేదనేది స్పష్టం

ఇప్పుడు ప్రధాని శాస్త్రి చేసిన ప్రకటన ననుసరించి పై మార్పు ఈ ఏటికి అమలు జరుగదు

మరొక తొందరపాటు చర్య కూడా కేంద్రంలో జరిగింది

కేంద్ర ప్రభుత్వం ఫైళ్ళపై ఇక ముందు హిందీలో మాత్రమే రిమార్కులు వ్రాస్తూఉండాలని, జనవరి 26 న, రేడియో సమాచార శాఖ ఒక సర్క్యులర్ జారీ చేసింది ఇట్టి సర్క్యులరు జారీ చేయడం తొందరపాటు చర్య అని తీవ్ర విమర్శలు రావటంతో ఆ సర్క్యులర్‌ను వారు ఉపసంహరించుకున్నట్లు కేంద్ర హోం మంత్రి నందా ఢిల్లీలో కాంగ్రెసు పార్టీ సభ్యులతో జరిపిన గోష్ఠి ద్వారా వెల్లడౌతున్నది

కాని ఈ స్వల్ప చర్యలద్వారా, హిందీయేతర ప్రాంతాలలో అఖిల భారత ఉద్యోగాల విషయమై ఏర్పడిన భయాందోళనలు తొలగిపోవు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు ఇంతవరకు ఇంగ్లీషులో జరుగుతున్నాయి ఆంగ్లభాషా నైపుణ్యం హెచ్చుగా గలవారు, ఆ పరీక్షలలో ఉత్తీర్ణులౌతున్నారు.

వివిధ రాష్ట్రాలలో విద్యా స్థాయిల్లోనూ, ముఖ్యంగా ఇంగ్లీషు భాషాధ్యయనంలోనూ, గల వ్యత్యాసాల దృష్ట్యా అన్ని ప్రాంతాలవారికి ఈ పోటీపరీక్షలలో సమానమైన న్యాయం జరగటంలేదు

ఇంగ్లీషుతోపాటు పోటీ పరీక్షల్లో హిందీనికూడా ప్రత్యామ్నాయభాషగా ప్రవేశపెట్టాలనేది కేంద్రం ఆలోచన ఈఉద్దేశం ప్రస్తుతానికివాయిదాపడినా, అసలు విరమించబడలేదు

కాని, హిందీ ఒక్కటే ప్రత్యామ్నాయ భాషగా ఎందుకుండవలెనో బోధపడదు నిజానికి భారతదేశంలోని 14 ప్రాంతీయ భాషలకు ప్రత్యామ్నాయ భాషలుగా ఉపయోగపడే అర్హతా ఉంది అవసరమూ ఉంది

పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలలో విద్యార్థుల భాషా పరిజ్ఞానంకాక, సాధారణ విద్యా సాంస్కృతిక పరిజ్ఞానం పరీక్షించబడుతుంది కనుక విద్యార్థులు ఏ భాషలో తమ భావాలను స్పష్టంగా వెలిబుచ్చగలుగుతారో ఆ భాషలలోనే ఈ పోటీపరీక్షలను నిర్వహించటం సమంజసమూ, న్యాయంకూడా

కనుక హిందీని మాత్రమే ప్రత్యామ్నాయభాషగా ఏర్పరచటంసరికాదు

ఈ సమస్యను ప్రస్తుతానికి వాయిదా వేసినా లేక మాడరేషన్ బోర్డును ఏర్పరచినా సమస్య సమగ్రంగా పరిష్కారంకాదు ప్రాంతీయ అసమానతలు తొలగవు కేంద్ర సర్వీసులలో ఏదో ఒకప్రాంతంవారికే అధికతర ప్రాధాన్యం లభిస్తున్నదనే అపోహ విద్యాధికులైన మధ్యతరగతి ప్రజలలోనూ, విద్యార్థులలోనూ కొనసాగుతూనే ఉంటుంది

కనుక అఖిల భారత పోటీ పరీక్షలను ఏ భాషలో నిర్వహించాలనే విషయమై కేంద్రం తన వైఖరిని సమూలంగా మార్చుకోవాలని భారత రాజ్యాంగ ఎనిమిదవ షెడ్యూలులో పేర్కొనబడిన అన్ని ప్రాంతీయ భాషలలోనూ పరీక్షలకు సమాధానాలిచ్చే అవకాశం పోటీదారులకు కల్పించాలని కోరుతున్నాము

అపరాలకు కనీస ధర?

హైదరాబాద్, ఫిబ్రవరి 3

అపరాలకు, పప్పులకు కనీస ధరలను నిర్ణయించి మార్కెట్లలో ధరలు పెరుగుట విరుగుట లను నివారించాలని రాష్ట్రప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు ఆహార మంత్రి శ్రీ ఏ. బలరామిరెడ్డి నేడిక్కడ ప్రకటించారు

పట్టణాలలో కూరగాయల ధరలు పెరుగుదలను అరికట్టడానికి, రాష్ట్ర ప్రభుత్వం 20 వేల జనాభా మించిన ప్రతి పట్టణంలోను కూరగాయల పెంపక పథకం అమలు జరపడానికి నిశ్చయించినదని ఆయన వివరించారు. ప్రస్తుతం ఈ పథకం కొన్ని జంటనగరాలలో ప్రభుత్వం అమలు జరుపుతున్నది.

కూరగాయల పెంపకానికి ఆర్థిక సహాయం చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరినట్టు ఆయన అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనలో తోటల ఫలసాయ ప్రదర్శనకు అధ్యక్షత వహిస్తూ పేర్కొన్నారు.

అపరాలు, పప్పుల ధరలు బాగా పెరిగిపోవడం, తిరిగి విపరీతంగా పడిపోవటం సంభవిస్తున్నదని ఉదాహరణకు క్వింటాల్ కందులు ధర పక్షంరోజుల క్రితం రు 130 వుండగా, ఇప్పుడు దానిధర రు 55 లకు పడిపోయినదని ఆయన వివరించారు ఇలా ధరలు 'పెరుగుట విరుగుట' వల్ల రైతులు దెబ్బ తింటారని, కనుక కనీస ధరలు నిర్ణయించవలసిన ఆగత్యం కలదని ఆయన అన్నారు.

భారత - సోవియట్ దేశాల సన్నిహిత సహకారం

చాగ్లా అభినందన

న్యూఢిల్లీ ఫిబ్రవరి 3

'ఇండియా - సోవియటుల మధ్య సర్వతోముఖ సహకారం" ఆరంభమై పదేళ్ళు విజయవంతంగా ముగిసిన దృష్ట్యా భారత విద్యామంత్రి శ్రీ ఎం. సి చాగ్లా సోవియటు ప్రజలను అభినందిస్తూ ఒక సందేశం పంపించారు

ఇండియా సోవియటులమధ్య సాంస్కృతిక, విజ్ఞాన, సాంకేతిక రంగాలలో పరస్పర సహకారం వృద్ధిపొందుతూ విద్యా సాంస్కృతిక ప్రపంచంలో మన రెండుదేశాల ప్రజలను సన్నిహితపరుస్తూంది అన్నారు.

రష్యను భాషాధ్యయన కేంద్రం ఒకటి లో టెంపరేచర్ ఫిజిక్సులో ఉన్నతాధ్యయన కేంద్రం ఒకటి, ప్రాంతీయ సాంకేతిక కళాశాల ఒకటి, పోస్టలు తరగతుల నారంభించడమూ, తదితరములూ ఈ రెండు దేశాల ప్రజలమధ్య నున్న స్నేహ సంబంధాలను దృఢతరం చేస్తాయని ఆయన అన్నారు.

ఆటస్థలాలూ, పార్కులూ, ఖాళీజాగాలు అట్టేపెట్టేటందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేయాలని సలహా ఇస్తూ మద్రాసు ప్రభుత్వం ఆ విషయమై చేసిన చట్టాన్ని ఆయన అభినందించారు. మిగిలిన రాష్ట్రాలు త్వరగా మేల్కొనకుంటే ఖాళీ స్థలాలన్నీ ఇళ్ళ స్థలాలుగా వెళ్లబడి అయిపోతాయన్నారు.

ఆయూబ్ బెదిరింపు దురదృష్టకరం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2

నిన్న ఆయూబ్‌ఖాన్ రేడియోలో చేసిన ఉపన్యాసం దురదృష్టకరమనీ, భారత - పాకిస్తాన్ సంబంధాల సదిస్థితి ఏమాత్రం చక్కబరచదనీ నేడిక్కడ అధికారవర్గాలు అభిప్రాయం ప్రకటించాయి

భారత రాజ్యాంగంలోని కొన్ని అంశాలను జమ్మూ - కాశ్మీర్‌కు అనువర్తింపచేయడాన్ని విమర్శిస్తూ "జమ్మూకాశ్మీర్ ప్రజలూ పాకిస్తాన్ ప్రజలూ కోరుతున్న విధంగా కాశ్మీర్ సమస్యకు శాంతియుత పరిష్కారం కుదరకపోతే 'ఇండియా బాగా నష్టపడే విధంగా' అది పరిష్కారం అవుతుందని ఆయూబ్ బెదిరించారు.

ఆయూబ్‌ఖాన్ ప్రకటన ఇక్కడ ఆశ్చర్యం కలిగించలేదుగాని అది ఇటీవల ఇండియాను గూర్చి పాకిస్తాన్ నాయకులు చేస్తున్న ప్రకటనల ధోరణిలోనే వుందన్నారు.

దుర్గాపూర్ కాంగ్రెసుసభకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం

సదాచారసమితి ఈ అంశాన్ని పరిశీలించవలసిన ఆవశ్యకత

దుర్గాపూర్ కాంగ్రెసు మహాసభలో ఒక రోజు మధ్యాహ్నం విషయ నిర్ణయసభ జరుగుతుండగా పశ్చిమ బెంగాలీ కాంగ్రెసు నాయకుడు శ్రీ అతుల్యఘోష్ చాల ఖరీదయిన 'పంజాబీ' దుస్తులలో వేదికమీదికి వచ్చారు. ఆ దుస్తుల ఖరీదు వేయి రూపాయలకు మించుతుందనే సంగతి ఆయన ఎరుగరు, ఏమంటే అది ఆయన కొన్నదికాదు డార్జిలింగ్‌లో చలికి తట్టుకొనేటందుకు తగిన దుస్తులేవని శ్రీ ఘోష్ అనుకోవడం ఒక ధనికుడైన కాంగ్రెసు అభిమాని విన్నాడు. వెంటనే కలకత్తాలో పేరుపొందిన టెయిలర్‌ను ఫోన్‌లో పిలిచి మేలురకం బట్టలతో "పంజాబీ" దుస్తులు కుట్టవలసిందని కొలతలూ అవీ చెప్పేడు.

అడిగేవారంగా దుర్గాపూర్ కాంగ్రెసుకు ఏమేం వలసి వుంటాయో అనేక మంది గుర్తించుకోవి కావచ్చును ధనం ఇవ్వాని మహాసభకు వచ్చే ప్రతినిధుల ఆహారం, వసతి రాకపోకలు అపరిమితంగా అయింది దానికి కావలసిన లక్షల రూపాయలు మాట వరసగా చెన్ను వసూలు చేసేసరికి వచ్చిపడిపోయాయి దుర్గాపూర్ మహాసభను ఆహ్వానించిన పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ కమిటీ పరిశోధనద్వారా 14 లక్షల రూపాయలు వసూలు చేసింది దానిలో చాలభాగం సామాన్య ప్రజల నుండే వసూలయిందన్నారు. సాధారణ ప్రజలే కాంగ్రెసుకు కావలసిన ధనం యిస్తున్నారని చెప్పడానికై సాక్ష్యంగా శ్రీ అతుల్యఘోష్ ఒక జిల్లా కాంగ్రెసువాది చేతులనుంచి 20 వేల రూపాయల చెక్కును అందుకొంటున్నట్లు పత్రికలలో ఒక ఫోటో ప్రకటించింది. జిల్లాలోని సాధారణ ప్రజానీకంనుంచి వసూలుచేసిన ధనంలో మొదటి కంతు - అటూ ఆ చిత్రం క్రింద వ్రాశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి శాసనసభలో అందరితోపాటు తానుకూడా దుర్గాపూర్ మహాసభకు ఒక పాతిక రూపాయలు విరాళం ఇచ్చానన్నారు.

ప్రజలను నష్టపరచి దుర్గాపూర్ సభకు ధనం పోగుచేసిన కుటిల పద్ధతులను ఈ ప్రచారం దాచిపెట్టలేదు ఎగ్జిబిషన్ ప్రదేశాన్ని ఒక్కమారు తిరిగిచూస్తే పారిశ్రామికప్రదర్శనశాలలోని దుకాణాలూ, శాలలూ అద్దెకివ్వడం ద్వారా పదిలక్షలకు తక్కువ గాకుండా వసూలు చేసి వుంటారని తెలిసిపోతుంది. అదిగాకమరో రెండు ప్రదర్శనలు - వ్యవసాయ ప్రదర్శన ఒకటి ఖాదీ-గ్రామోద్యోగ ప్రదర్శన ఒకటి ఏర్పాటు చేశారు దీనికి ప్రభుత్వ సంస్థలు మహా ధారాళంగా డబ్బు కుమ్మరించాయి

ఈ ప్రదర్శనలను ఏర్పాటుచేసిన స్థలం ప్రభుత్వ సంస్థ అయిన దుర్గాపూర్ ప్రాజెక్ట్సు లిమిటెడ్‌వారిది. దానిని కాంగ్రెసుకు అద్దెకిచ్చారు ఆ అద్దె ఎంతో ఈ క్షణంవరకు నిర్ణయం కాలేదు నామమాత్రంగానే వుంటుందని ఆ సంస్థ అధికారి ఒకరు ఈ పత్రికా విలేకరితో చెప్పేరు. బహుశా రెండువేల రూపాయలకు మించకపోవచ్చు. కాని ప్రభుత్వంయొక్క స్థలంమీద కాంగ్రెసు ఎంతధనం సంపాదించిందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఒకటి రెండు వుదాహరణలు ఇక్కడ ఇస్తాను.

హిందుస్తాన్ స్టీల్, హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ల ప్రదర్శన శాలలనుండి కాంగ్రెసుకు కనీసం లక్షరూపాయలు ఆదాయంవచ్చి వుంటుంది ఒరిస్సా ప్రభుత్వ ప్రదర్శనశాల అద్దె 50 వేల రూపాయలు ప్రదర్శనశాలలన్నింటిలోకిపశ్చిమ బెంగాల్ ప్రభుత్వశాల బాగా పెద్దది. దానికి అద్దె లక్షరూపాయలుంటుంది. అయితే ప్రదర్శనశాలల నిర్మాణానికి అలంకరణకూ ఎంతో డబ్బు వెచ్చించి వుంటుంది. వాని నిర్మాణంలో వుపయోగించిన సరుకులందీ వానిలో ప్రదర్శించిన వానుంచీ, కాంగ్రెసుకు లాభం ఏమి వచ్చివుండదు ఎవరన్నా పరిచయం వున్నకంట్రాక్టరుబిల్లులో కొంతతగించేదేమోగాని ఆ ధనం అంతా కంట్రాక్టర్లకే వ్యయమయింది. ప్రదర్శన ఆవరణకు వెలుపల ఫలహారశాలలూ, తీర్థాలలోమాదిరి అనేక చిల్లర వస్తువులమ్మే దుకాణాలూ ఎన్నో వెలిశాయి 50 అ. పొడుగు అంతే వెడల్పుగల శాలకు అక్కడ అద్దె వేయి - పన్నెండువందల రూపాయలు, పెద్దవానికింకా హెచ్చు అద్దె ప్రదర్శన ఎదురుగాకాక కొంచెం వెనకగావున్న దానికైతే సగం అద్దె ప్రదర్శన ప్రదేశానికి వెలుపల ఇటువంటి దుకాణాలకు శాలలు ఒక ఏభయివరకు వున్నాయి వీనినిబట్టి ప్రభుత్వ భూమినుంచి కాంగ్రెసు అద్దెరూపంలో ఎంత ధనం వసూలుచేసిందో అర్థం చేసుకోవచ్చు

సదాచారసమితివిచారించాలి

ప్రభుత్వకోశాన్ని నష్టపరచికాంగ్రెసు ఇకా అనేక విధాలుగా లాభాలు సంపాదించింది ప్రతినిధుల బసలలో వుండడానికి వీలులేని పత్రికా విలేకరులకూ ఇతరులకూ బసలిచ్చారు. దుర్గాపూర్‌ప్రాజెక్టువారి దిన రెండేసి గదుల వాటాలను కాంగ్రెస్ వుపయోగంకోసం జూన్ నుంచీ ఖాళీగా వుంచారు, ఒక్కొక్కవాటా అద్దె 20రూ లు కూడ లేదట, కాని వారంలోపు కాలానికే ఒక్కొక్క వాటాకు 200 రూ॥లు వసూలు చేశారు అంటే ఒక్కొక్కదానిమీద 180 రూ లాభం-తీరాదన్నమాట ఈ ఇళ్ళనుంచి విషయనిర్ణయసభ ప్రదేశానికి వెళ్ళే అడ్డదారిలో కాలవలూ,గోతులూ ఎన్నో వున్నాయి సరిమీద చివరికోజుల్లో చెక్కతడికా పడెయ్యలేదు దారిన హడావిడిగా వెళ్ళడంలో పత్రికా విలేకరులు చాలామంది కాళ్ళు విరుచుకున్నారు పడి దెబ్బలు తిన్నారు. పి. టి. ఐ; యు ఎస్ ఐ వార్తాసంస్థలు అంత అద్దె ఇవ్వడం ఇష్టం లేక కలకత్తా పార్క్‌స్ట్రీట్‌లోని ఒక హోటలుదారు భోజనశాల వెనుకభాగంలో టిన్ రేకులతో షెడ్డులువేసుకొన్నారు ఆ హోటలులో చేపలకూర, పప్పు అన్నమూగల విస్తరి రు 4-50 లకు అమ్మేడు.

దుర్గాపూర్ స్టేషనుకు కూతవేటు దూరంలో కాంగ్రెసు సభకోసం డా. రాయ్ పేరున ఒక చిన్న స్టేషను నిర్మించారు. దీనిని చూస్తే ప్రభుత్వ సంస్థలనూ, శాఖలనూ కాంగ్రెసు పార్టీ ప్రయోజనాలకై ఏ విధంగా దుర్వినియోగం చేశారో అర్థం అవుతుంది దుర్గాపూర్ మహాసభ అనంతరం ఈ స్టేషను ఉపయోగం శూన్యం ఇది కేవలం కాంగ్రెసు మహాసభ కోసమే నిర్మించారు 8 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ స్టేషను మహాసభకు ఒక్క వారంముందు రైల్వేమంత్రి ప్రారంభించారు

ప్రభుత్వ ధనం ఇకా అనేక విధాలుగా అదుపులేకుండా కాంగ్రెసు మహాసభ స్థలానికి రోడ్లు వేయడానికి బాగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం పదిలక్షలు వ్యయపరచింది పోస్టు టెలిగ్రాఫ్ వగైరా సౌకర్యాలు కలిగించడానికి పోస్టలుశాఖ 6 లక్షలు ఖర్చు చేసింది చిన్న తరహా పరిశ్రమలవారికి ఇచ్చే తక్కువరేటుకు మహాసభకు విద్యుత్సరఫరా జరిగింది అక్కడ పోలీసు ఏర్పాట్లకే 2 లక్షలయిందని ఒక కలకత్తా పత్రిక లెక్కకట్టింది

సావనీర్ ప్రచురించి దాని పేరున డబ్బు వసూలు చేశారు, ధర్మసంస్థలూ, రాజకీయ సంస్థలూ ఈ పని చేస్తాయి సావనీర్ ఇంగ్లీషు సంచికలో ప్రచురణల ద్వారానే 80 వేల రూపాయలు పార్టీనిధులకు అదనంగా వసూలుచేసే బెడదనుంచి తప్పించుకోగానికిపేజీ రేటుకన్న ఎక్కువే ఇచ్చి ప్రకటనలు చేసినట్లు తెలుస్తూంది.

ఇక పార్టీనిధికి పరానరి ఎంత వసూలు చేశారన్నది సదాచార సమితి పరిశీలించి తేల్చవలసిన అంశం.

[ఎకనమిక్ వీక్లీ, జనవరి 28]

ఐరాస ఫిబ్రవరి 4

కాంగో ప్రభుత్వం లియోపాల్డ్‌విల్లీలో అరెస్టు చేసిన 'ఇజ్వెస్తియా' విలేకరిని విడుదల చేయించడానికి చర్యలు తీసుకోవలసిందిగా ఐరాస ప్రధాన కార్యదర్శి యుథాంట్‌కు ఐరాసలోని సోవియట్ ప్రతినిధి ఫెడరెంకో విన్నపం చేశారు

కేరళలో ప్రజాసోషలిస్టుపార్టీ ఎన్నికల విధానం

పోటీపార్టీ, కాంగ్రెస్‌లతో సంబంధం లేని ప్రజాతంత్ర వాదులను బలపరుస్తామని ప్రకటన

త్రివేండ్రం ఫిబ్రవరి 3

త్రివేండ్రం జిల్లాకు చెందిన సుమారు ఏభయిమంది సంయుక్త సోషలిస్టుపార్టీ కార్యకర్తలు (వీరంతా గతంలో ప్రజా సోషలిస్టుపార్టీకి చెందినవారు) నేడిక్కడ సదస్సు జరిపి, రాష్ట్రంలో ప్రజా సోషలిస్టు పార్టీని పునర్నిర్మించేటందుకు నిర్ణయించారు.

త్రివేండ్రం కార్పొరేషన్ మేయరు, శ్రీ పి. కె. మురారి అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది వారణాసిలో జరిగిన సంయుక్త సోషలిస్టుపార్టీ ప్రారంభ సమావేశంలో ప్రజా సోషలిస్టుసభ్యులు తమ పార్టీని పునర్నిర్మించేటందుకు తీసుకొన్న నిర్ణయాన్ని ఈ సదస్సు ప్రశంసించింది. శ్రీ ఎన్.జి. గోరే అధ్యక్షతన ఏర్పడిన కొత్త పార్టీని పూర్తిగా బలపరచడానికై నిశ్చయించింది.

సంయుక్త సోషలిస్టుపార్టీ నాయకులు జరగనున్న ఎన్నికల కోసం పోటీపార్టీ వారితో అనధికారంగా ఒప్పందం చేసుకొన్నందుకు సదస్సు తీవ్రంగా నిరసించింది.

పార్టీని పునర్నిర్మించే కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయిలలో మూడు కమిటీలను ఎన్నుకొన్నారు వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో పార్టీ అనుసరించదగు విధానాన్ని రూపొందించే అధికారం రాష్ట్ర స్థాయి కమిటీకి వప్పచెప్పబడింది.

సదస్సు ముగిసిన తర్వాత రాష్ట్రస్థాయి కమిటీ సమావేశమయి - తమ పార్టీ సంబంధాన్ని విడిచి పెట్టుకొనకపోతే సంయుక్త సోషలిస్టుపార్టీ అభ్యర్థులకు పోటీగా ప్ర. సో. పార్టీ అభ్యర్థులను నిలబెట్టడానికై నిర్ణయించింది.

సం. సో. పార్టీ మొత్తం ముప్పయ్యేడు స్థానాలకు పోటీచేయ నిర్ణయించింది ఇంతవరకు ఇరవయ్యారుమందిపేర్లు ప్రకటించింది.

ప్ర. సో. పా. అభ్యర్థులను పెట్టని నియోజక వర్గాలలో అటు కాంగ్రెసుతోగాని, పోటీ కమ్యూనిస్టులతోగాని సంబంధంలేని ప్రజాతంత్ర వాదులయిన ఇండిపెండెంట్లను బలపరచాలని కమిటీ నిర్ణయించింది.

జిల్లా కమిటీ సభ్యులు పదముగ్గురిలో పదకొండు మంది, కార్పొరేషనులో సం. సో పార్టీకౌన్సిలర్లు 14 మందిలో పదకొండుమంది సం. సో పార్టీకి చెందిన నగర మేయరు శ్రీ మురారితోసహా సదస్సులో పాల్గొన్నారు పాల్గొనడానికి ముందు వీరంతా తమ సం సో పార్టీ సభ్యత్వాలకు రాజీనామాలు ఇచ్చారు.

శ్రీ పాయ్ నిరాకరణ

(1 వ పేజీ తరువాయి)

టన్నుల వరకూ నూకలు ఇవ్వగలమని మిల్లర్లు చెప్పారు

ధర విషయం వచ్చేటప్పటికి అంగీకారం కుదరలేదు

మొదటిరకం నూకలు క్వింటాల్ (బస్తా) 50రూ॥లు అయితే ఇస్తామని మిల్లర్లుచెప్పారు. రెండవరకం అయితే 40-45 రూ॥లు ఉంటుందని అన్నారు ఈ ధర ఎక్కువగా వుందని. అయినా రాష్ట్ర ప్రభుత్వాలతో తామింకా సంప్రదించవలసి వుందని కార్పొరేషన్ అధికారి అన్నారు.

కార్పొరేషన్ రైతులనుండి ధాన్యంకొని, ఆడించడానికి యిస్తే ఎంతశాతంవరకూ బియ్యం ఇవ్వగలరని అడిగిన ప్రశ్నకు ముడిబియ్యం అయితే 75 శాతం వరకూ ఇస్తామన్నారు.

శ్రీ నరసింహం మాట్లాడుతూ ఇంతవరకు ఏ రాష్ట్రమూ తమకు నూకలు కావాలని అడగలేదనీ ఆంధ్ర ప్రభుత్వం కూడా ఇస్తానని చెప్పలేదని. అయితే ఇక్కడ నూకలు లభ్యం అవుతున్నందునా కేరళ మైసూరు రాష్ట్రాలలో ప్రజలు వాటిని వాడుతున్నందున, ఇక్కడనుంచి నూకలు సప్లయి చేయాలనే ఆలోచన కార్పొరేషన్‌కు కలిగిందని అన్నారు

ఇక్కడనుండి పంపే నూకలు తినడానికి వీలయినవిగా వుండాలనీ అటువంటి వాటినే కార్పొరేషన్ కొంటుందని అన్నారు

మిల్లర్ల ప్రతినిధులు మాట్లాడుతూ నూకల్ని రకాలుగా విడదీయటం అసంభవమనీ మంచి నూకల్ని కార్పొరేషన్‌కొంటే, తినడానికి పనికిరాని నూకల్ని తాము ఏమి చేయాలని అడిగారు ఇతరరాష్ట్రాలలోని నూకలమిల్లులవారు తినడానికి పనికిరాని నూకల్ని గంజికోసం కొంటారని అందువల్ల అవి తమకు నేరుగా సరకు ఎగుమతికి అవకాశం ఇవ్వాలని అన్నారు.

కమిషన్ ప్రాతిపదికపైన, కార్పొరేషన్ ఇక్కడనిండి మిగతా రాష్ట్రాలకు రవాణాచేస్తే ఎంత కమిషన్ ఇస్తారని పాయ్ అడిగారు

ఇతర రాష్ట్రాలకు ఇక్కడనుండి ఎగుమతి అయ్యే బియ్యంకానీ నూకలుగాని బాగుండాలని, అటువంటప్పుడే ఆంధ్రమిల్లర్లకు మంచి వ్యాపారం వుంటుందని పాయ్ అన్నారు.

నాణ్యమయిన సరకుకు ఎక్కువ ధర ఇవ్వడానికి కార్పొరేషన్ వెనకాడదనిచెప్పారు

శ్రీ నారాయణమూర్తి (మిల్లర్ల ప్రతినిధి) మాట్లాడుతూ కార్పొరేషన్ మిల్లర్లపట్ల విశ్వాసం వుండాలని కోరారు

కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ నరసింహం సమావేశాన్నిముగిస్తూ కార్పొరేషన్‌కు బియ్యాన్ని నూకల్ని సప్లయిచేసే మిల్లులకు రుణాలు యిస్తామని అన్నారు.

ఇందుకు ముందుగా అగ్రిమెంటు కుదుర్చుకుంటామని అనుకున్న ప్రకారం సప్లయి చేయకపోతే 5 శాతం పెనాల్టీలు వసూలు చేస్తామని చెప్పారు

ధాన్యంలోవుండే బెడ్డలు, దుమ్ము వగైరా బియ్యంలోకి రాకుండా నివారించేందుకు అవసరమయిన సాంకేతిక సహాయాన్ని మిల్లర్లకివ్వడానికి కార్పొరేషన్ ప్రయత్నిస్తుందని చెప్పారు. వివిధ స్థాయిలలో కార్పొరేషన్ కొన్ని సలహా బోర్డులను కూడా ఏర్పాటు చేస్తుందన్నారు

పోటీపార్టీ విపరీత కోర్కెలు

ఫలితంగా తిరుచూరుజిల్లాలో ఎన్నికల సర్దుబాటు వైఫల్యం

తిరుచూరు, ఫిబ్రవరి 4

రానున్న జనరల్ ఎన్నికలలో తిరుచూర్ జిల్లాలో కమ్యూనిస్టుపార్టీ, పోటీపార్టీతో ఎన్నికల సర్దుబాటుకోసంచేసిన ప్రయత్నాలు విఫలమైనాయి

పోటీపార్టీవారు గొంతెమ్మ కోర్కెలు కోరుతూ ఎన్నికల సర్దుబాటుకు అవకాశాలు లేకుండా చేశారని జిల్లా కమ్యూనిస్టు సమితి ప్రకటన చేసింది.

ఈ జిల్లాలో మొత్తం 13 స్థానాలున్నాయి. కమ్యూనిస్టుపార్టీ, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీలు కలిసి ఇప్పటికి 8 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించాయి పోటీపార్టీ 4 స్థానాలకు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది.

కందుకూరు తాలూకా కమ్యూనిస్టుపార్టీ సమితి నిర్ణయాలు

కందుకూరు, ఫిబ్రవరి 3

కందుకూరు తాలూకా కమ్యూనిస్టు సమితి సమావేశం శ్రీ కోట నరసింహం అధ్యక్షతన నిన్నదిక్కడ జరిగింది శ్రీ జి. ఎల్లమందారెడ్డి ఎం పి సమావేశంలో ఏడవ పార్టీ మహాసభ నిర్ణయాలపై నివేదికనిచ్చారు తాలూకాలో 4 వేల రూపాయలు పార్టీ నిధి వసూలు చేయడానికి రెండువేలమంది రైతు సంఘ సభ్యుల్నివ్యవసాయకార్మికసంఘసభ్యులను చేర్పించడానికి నిర్ణయాలు తీసుకున్నారు.

సూడాన్‌లో మార్చి 31 న జరగవలసిన జనరల్ఎన్నికలను ఏప్రిల్ 21కివాయిదావేశారు.

రైల్వే మార్గాల విద్యుదీకరణ

కలకత్తా, ఫిబ్రవరి 2

చతుర్థ ప్రణాళికా కాలంలో 25 వందల రూట్ కిలోమీటర్లను 7 వేల ట్రాక్ కిలోమీటర్లను విద్యుదీకరణచేయాలని రైల్వే విద్యుదీకరణసంఘం ఉద్దేశపడుతుందని రైల్వే విద్యుదీకరణ జనరల్ మేనేజర్, చీఫ్ ఇంజనీర్ హెచ్. జి. అవస్థి యిక్కడ పత్రికా విలేకరులతో అన్నారు.

1957 నుండి ఇంతవరకు 1878 రూట్ కి మీ. 4761 ట్రాక్ కి మీటర్లు విద్యుదీకరణ చేశారని దానికి ఖర్చు వంద కోట్ల రూపాయలు అయినదని తెలియజేశారు మూడవ ప్రణాళికా పూర్తి కాలం నాటికి మొత్తం విద్యుదీకరణ 3231 రూట్ కి మీ 8323 ట్రాక్ కి. మీ వరకు వుంటుందని ఆయన చెప్పారు.

హుండీలద్వారాగుప్త ధనం చలామణీ

బొంబాయి సోదాలలో లభించిన పత్రాల సాక్ష్యం

బొంబాయి ఫిబ్రవరి 3

బొంబాయిలో ఆదాయపుపన్ను అధికారులు గుప్తధనాన్ని వెలికి లాగేటందుకై ప్రారంభించిన దాడులూ, సోదాలూ ఇప్పటి మట్టుకు ముగిశాయి.

బినామీహుండీ అప్పుల పేరున చలామణీ అవుతున్న గుప్తధనం గురించిన పత్రాలు చాలా లభించాయని తెలుస్తూంది.

రెండునెలల ఈమధ్య ఇంత పెద్దఎత్తున దాడులుజరపడం ఇది రెండోమారు చాలా కోట్ల సొమ్ము దొరికిందంటున్నారేగాని ఖచ్చితమైన లెక్క తేలలేదు నిన్నటి దాడిలో వ్యాపారస్థలాలూ, వ్యాపారస్థుల నివాసాలూ 80 కి పైగా సోదా చేశారు.

నేటి సోదాలో మరి 15 బ్యాంకులాకర్లను సీలువేశారు. పరిశీలనకోసం ఖాతా పుస్తకాలు స్వాధీనపరచుకొన్నారు.

హుండీ మారకాలలో తమపేర్లు వాడుకోనిచ్చేమేగాని ఆ సొమ్ముతోగాని, మారకంతోగాని తమ కేమీ సంబంధం లేదని హుండీ బ్యాంకర్లు అధికారుల ముందు చెప్పినట్లు తెలుస్తూంది.

హుండీ రుణపత్రాలు బినామీగా తయారుచేసి, వాని ద్వారా గుప్తధనాన్ని ప్రచారంలో పెడుతున్నట్లు తెలుస్తూంది.

ఈ హుండీ మారకాలలో రమారమి నూరుకోట్లు గుప్తధనం నడుస్తున్నట్లుగా అంచనా బయటపడింది

విల్సన్ ఉత్తర అమెరికా పర్యటన వాయిదా

లండన్, ఫిబ్రవరి 4

బ్రిటిష్ ప్రధాని విల్సన్ తన ఉత్తర అమెరికా పర్యటనను వాయిదా వేసుకున్నారని తెలుస్తున్నది

అసలు ఆయన ఫిబ్రవరి 9 నుండి 11 వరకు కెనడా, అమెరికా దేశాలను సందర్శించాలని లోగడ అనుకొన్నారు. ఆ పర్యటన కార్యక్రమాన్ని యిప్పుడు కాలనిర్ణయంలేకుండా వాయిదా వేసుకొన్నారు.

వ్యాఖ్యలు-విమర్శలు

ఆంధ్ర బ్యాంకు ఉద్యోగుల వివాదం

ప్రభుత్వ రంగ లోనూ, ప్రయివేటు రంగంలోనూ పనిచేస్తున్న ఉద్యోగులూ, కార్మికులూ అతి సామాన్యమైన కోర్కెలకోసం కూడాగడా, రాద్ధాంతమూ చేయవలసిన పరిస్థితి ఏర్పడడం కొత్తకాదు

ఆంధ్రబ్యాంకు ఉద్యోగులకు, యజమానులకు ఏర్పడిన వివాదం సమరసంగా, సంప్రతింపులద్వారా పరిష్కారం కావడానికి వీలు లేనిది అంటే కాదు బ్యాంకు జనరల్‌మేనేజర్ అంటున్నట్లు ఉద్యోగులు మెరపుసమ్మె'కు పూనుకున్నారా అంటే అదీలేదు

బ్యాంకుఆఫీసర్ల అసోసియేషన్ గతసెప్టెంబర్ నుండి మేనేజిమెంటుకు మా ఇబ్బందు లివి' అని విన్నవించుకొంటూనే వుంది. 'వయః పరిమితి పూర్తికాకుండానే, యజమానుల యిష్టానుసారం ఆఫీసర్లను నిర్బంధంగా రిటైర్ చేయడం న్యాయంకాదు; ధరలు మండిపోతున్నప్పుడు మాకు కరువుభత్యం హెచ్చించడం ధర్మం. ఒక క్రమమూ పద్ధతీలేకుండా మాతో చాకిరీ చేయించుకోవడం సరికాదు, షాప్ అండ్ ఎంప్లాయీస్ చట్టం ప్రకారం పనిగంటల నిబంధన మాకూ వర్తింపచేయాలి" ఇదీ వారి విజ్ఞాపన ఇది తప్పనిసరి వరాలేమీకావు పోనీ బ్యాంకు నష్టంపై నడుస్తున్నది కాబట్టి కరువుభత్యం హెచ్చింపు అసాధ్యమందామంటే ఏటా బ్యాంకు లక్షలాది లాభం గడిస్తున్న విషయం అందరికీ తెలుసు

కుదరక తమ ఉద్యోగుల వినతి పత్రానికి సమాధానమిచ్చే కనీస మర్యాదనైనా యజమానులు పాటించనప్పుడు ఉద్యోగులు ఏమి చేయాలి?

కాబట్టి మార్గాంతరం లేకనే బ్యాంకిలోని ఆఫీసర్లు పనిబంద్ చేశారు. వారి సంఘకార్యదర్శి నిరశనవ్రతం ప్రారంభించారు, ఇతర ఉద్యోగులు నిబంధనల ప్రకారం ఎంత పని చేయాలో అంతకుమించి పనిచేయడానికి నిరాకరించారు

ఇప్పటికైనా తమ ఇబ్బందులను గురించి ఎప్పటికప్పుడు చర్చించి పరిష్కారం చేసుకొనేందుకు తగిన సంప్రతింపుల యంత్రాంగాన్ని ఏర్పాటుచేస్తే తాము ఆఫీసులో బైఠాయింపు సమ్మె' చేయవలసిన అవసరం లేదని బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి ప్రకటించడంగా, అతి న్యాయమైన ఆ కోర్కెను కూడా అంగీకరించ నిరాకరించడమేకాక, వీరినందరినీ ఉద్యోగంనుండి తొలగించడానికీ కొత్తవారిని నియమించడానికి పూనుకొనే యజమానిని ఏమనాలి?

బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీ ఆర్.టి భగత్ పత్రికా ప్రకటన చూస్తే ఆయన భౌతికంగా 20వ శతాబ్దంలోవున్నప్పటికీ మానసికంగా 19వ శతాబ్దం నుండి బయటపడలేదనిపిస్తుంది

ఆఫీసర్ల అసోసియేషన్ ట్రేడ్‌యూనియన్ హక్కులు వదులుకోవాలనేది ఆయన మొదటి షరతు. రెండవది తమ కోర్కెలను సాధించుకొనేందుకు ఉద్యోగులు "సమ్మె" ను ఒక సాధనంగా వినియోగించ రాదట.

ఇప్పుడు బ్యాంకు ఆఫీసర్లు చేస్తున్నది సమ్మె అవునా కాదా అనేది వేరే విషయం (వాస్తవంలో వారంతా ఆఫీసులకు వెడుతూనే వున్నారు.) ప్రభుత్వ రంగంలోని ఉద్యోగులకే ట్రేడ్ యూనియన్ హక్కులున్నప్పుడు ప్రైవేటు రంగంలోని పనివారికి ఈ హక్కు ఉండరాదని చెప్పే హక్కు జనరల్ మేనేజరుకుందా అనేదేప్రశ్న.

రెండవది, ఇంచుమించు అన్ని ముఖ్య కేంద్రాల్లో పనినిల్చిపోయి బ్యాంకు ఖాతాదార్లు ఇబ్బంది పడుతుండగా అంతా సక్రమంగా సాగిపోతున్నట్లు పత్రికా ప్రకటన లివ్వడంద్వారా తాను నవ్వులపాలు కావడమేకాక బ్యాంకుకు తీరనినష్టం కలిగిస్తున్నానని ఆయనకు బోధపడకపోవడం ఆశ్చర్యకరం.

పోలెండ్‌లో అవినీతికి పాల్పడ్డ వ్యక్తికి మరణశిక్ష

వార్సా ఫిబ్రవరి 4

పోలిష్ ప్రభుత్వ మాంసవ్యాపార సంస్థ డైరెక్టరుకు మరణశిక్ష విధించారు. ఆ సంస్థలో పనిచేసే మరొక నలుగురు అధికారులకు యావజ్జీవ జైలు శిక్షను విధించారు. మరొక 5 గురికి 12 సంవత్సరాలు మొదలు 9 సంవత్సరాలవరకు కఠిన వరకం విధించారు.

వీరంతా కలిసి మాంసాహారాన్ని తప్పుడు తూకాలద్వారానూ, కల్తీ చేయడంద్వారాను అక్రమ వ్యాపారం ద్వారాను లక్షన్నరపౌనుల ధనం ఆర్జించారన్న ఆరోపణపై, న్యాయస్థానంలో వీరికి ఈ శిక్షలు విధించబడ్డాయి

మరొక 80 మందిని ఈ కేసు సందర్భంలో యింకా విచారిస్తున్నారు.

భారత బి. సి. జి సప్తమ సమావేశం

అహమ్మదాబాద్ ఫిబ్రవరి 2

భారత బి సి జి సప్తమసమావేశం రెండు రోజులపాటు జరిగింది గ్రామీణ ప్రాంతాలలో 20 సంవత్సరాల లోపువారికి యూ బి. సి. జి. టీకాలు వేయడం నేరుగా ప్రవేశ పెట్టాలని నిర్ణయించిది ఆరోగ్యాభివృద్ధిని గురించి చేసే ప్రచారంలో యూ బి. సి. జి కార్యక్రమం జాతీయ క్షయ నిరోధక కార్యక్రమంమీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరింది.

1965 లోనే జాన్సన్ మాస్కో సందర్శన

వాషింగ్టన్ ఫిబ్రవరి 4

ఈ సంవత్సరం అంతంలోగా తాను మాస్కో నగరం సందర్శించగల నన్న ఆశాభావాన్ని అమెరికా అధ్యక్షుడు జాన్సన్ నేడు వ్యక్తం చేశారు

సోవియట్ నాయకత్వం తనకు స్వాగతం చెప్పగలరని నమ్మడానికి తగిన ఆధారం వున్నదని ఆయన వివరించారు.

అలాగే సోవియట్ నాయకులు కూడా ఈ సంవత్సరంలోనే అమెరికాను సందర్శించగలరని తాను ఆశిస్తున్నట్టు జాన్సన్ పేర్కొన్నారు

ఉభయదేశాల నాయకులు ఇలా పరస్పరం పర్యటన కార్యక్రమాలను ఏర్పాటు చేసుకొనే విషయం ఇప్పుడు పరిశీలనలో వున్నదని ఆయన వెల్లడించారు

అధ్యక్షుడుజాన్సన్ నేడిక్కడ ఒక సభలో ప్రసంగిస్తూ పై విషయాలు పేర్కొన్నారు

మంగోలియాకు సోషలిస్టు దేశాల ఇతోధిక సహాయం

ప్రాగ్, ఫిబ్రవరి 4

మంగోలియాకు ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని ఇతోధికం చేయాలని సోషలిస్టు దేశాలు నిర్ణయించాయి

గత మంగళవారంనాడు ఇక్కడ సమాప్తమైన "కామ్‌కాన్" (సోషలిస్టుదేశాల ఆర్థిక సహకార సంస్థ) సమావేశంలో ఈ నిర్ణయం జరిగినదని 'కామ్‌కాన్' సమితి కార్యదర్శి నికొలాయ్ ఫెడయేవ్ గతరాత్రి ఇక్కడ ప్రకటించారు

మంగోలియాలో వ్యవసాయాభివృద్ధిని సాధించడానికి భూగర్భనిధులను వెలికితీయడానికి ఉపయుక్తమైన ఆర్థిక సాంకేతిక సహాయాన్ని సోషలిస్టు దేశాలు అందివ్వగలవని. అలాగే ఆ దేశంలో శాస్త్రపరిశోధన కృషికి తోడ్పడగలవని ఆయన వివరించారు.

రష్యాలో ప్రభుత్వ న్యాయవాదికి ఉద్వాసన

పాత్రికేయునిపై అక్రమంగా కేసు బనాయించినందుకు

మాస్కో, ఫిబ్రవరి 4

ఉత్తర కాకసస్ ప్రాంతంలోని ఒక పట్టణంలో పనిచేస్తున్న పాత్రికేయుడు అంటోనోవ్ గన్నోవ్ స్థానిక అధికారులను విమర్శిస్తూ తన పత్రికలో వ్యాసం ప్రచురించిన దుకు వగబట్టిన అధికారులు ఆ పాత్రికేయునిపై కేసు బనాయించి శిక్ష విధించారు

అనంతరం ఆ పాత్రికేయుణ్ణి నిర్దోషిగా పరిగణించి విడుదల చేయడం ఆయన అరెస్టుకు కారకులైన ప్రభుత్వన్యాయ వాదినీ మరొక ఇద్దరు అధికారులను బర్తరఫ్ చేయడం జరిగినదని 'ప్రావ్దా' ప్రకటించింది.

బర్మా ప్రభుత్వాధినేత జనరల్ నెవిన్ త్వరలో భారతదేశంలో పర్యటించనున్నారు.

ఉత్తరవియత్నాంలో అమెరికా రహస్య చర్చలు?

ఫ్రాన్స్‌లో శాంతి, అమెరికాలో ఖండన

పారిస్, ఫిబ్రవరి 3

దక్షిణవియత్నామ్ సమస్యపై అమెరికా, ఉత్తరకొరియా ప్రతినిధుల మధ్య రహస్య చర్చలు జరుగుతున్నట్లు పారిస్‌లో వదంతి బయలుదేరింది

దక్షిణ, ఉత్తర వియత్నామ్ ప్రతినిధుల మధ్య రహస్య సమాలోచనలు సాగుతున్నవని ఈ సమాలోచనలను గురించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అమెరికా విదేశాంగ శాఖకు పంపుతున్నారని మరొక వదంతి ప్రచారంలో వున్నది.

అయితే ఈ వదంతులు నిజంకావని వాషింగ్టన్‌లో అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి ఖండించారు దీనికి సంబంధించిన సమాచారమేదీ తనకు తెలియదని ఆయన వివరించారు

సైగాన్‌లో బుండీ

ఇది ఇలా వుండగా అమెరికా అధ్యక్షుడు జాన్సన్ విదేశ వ్యవహారాల ఉన్నత సలహాదారు మెక్ జార్జి బుండీ సైగాన్ చేరారు

సోవియట్ ప్రధాని కొసిగిన్ ఉత్తర కొరియా సందర్శించబోతున్న దృష్ట్యా తాను దక్షిణ వియత్నామ్‌ను సందర్శిస్తున్నట్లు చెప్పడం సరికాదని, తన పర్యటన కార్యక్రమం చాలా రోజులక్రితమే నిర్ణయమైనదని ఆయన పత్రికా విలేకరులకు తెలిపారు.

దక్షిణ వియత్నామ్‌లోని తాజా పరిస్థితిపై వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు.

దక్షిణ వియత్నామ్ ప్రజలలోకలిని కమ్యూనిజాన్ని ఓడించాలన్న అమెరికా విధానంలో ఎట్టి మార్పు వుండబోదని మెక్ జార్జి బుండీ అన్నారు.

లావోస్‌లో మితవాద తిరుగుబాటు విఫలమవుతున్న సూచన

వాషింగ్టన్ ఫిబ్రవరి 4

లావోస్‌లో తిరుగుబాటు సాగిస్తున్న మితవాద సైనికపుటా 'పదుం' విరిగిపోయినట్లేనని వియంటియాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయంనుంచి ఇక్కడకు చేరిన సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది

అయితే,వియంటియాన్‌లో పరిస్థితి యింకా ప్రమాదకరంగానే వున్నదట,

అధికారంకోసం మితవాద ముఠా సైనిక శాఖలలో గుద్దులాటే దీనికి కారణమని దాని పర్యవసానమే ఈ తిరుగుబాటు అని అమెరికా వర్గాలవారు వ్యాఖ్యానిస్తున్నారు.

తిరుగుబాటు సైనిక శాఖలలో కొందరు ఇప్పటికే లావోస్‌ప్రభుత్వంపక్షానచేరినట్లు తెలుస్తున్నది

తిరుగుబాటు సైనికాధికారులకు నచ్చచెప్పి రాజీ సాధించాలన్న ప్రయత్నంలో అమెరికా రాయబారి కార్యాలయాధికారులు వున్నట్లు తెలుస్తున్నది.

రేడియో

శనివారం, ఫిబ్రవరి 6
శక 1886 ★ మాఘ 17

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: వందేమాతరం 6-30 శుభోదయం, ప్రసారవిశేషాలు 6-40 అం.వా: 6-45 భక్తిరంజని - శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమ్ 6-55 సూక్తిముక్తావళి, 7-00 తె. వా: 7-15 సంగీత శిక్షణ 7-30 వాద్య బృందం. 8 00 అం. వార్తలు: 8-15 ప్రాంజలి, 8-30 ఎమ్ బాలమురళీకృష్ణ, 9-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం 12-30 కార్మికులకు - హై రిలే 1-00 హై రిలే: 1-30 వార్తలు - వ్యాఖ్యలు. 1-40 హిం వా: 1-50 తె. వా: 2-00 బొమ్మరిల్లు: 3-00 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాం వా 6-15 ప్రస్తుతాంశం: 6-20 గ్రామస్థులకు 7-00 తె వా. 7-15 గ్రామస్థులకు, 7-30 అవధాన విద్వాన్ తిరుపతి వెంకట కవులు ప్రసంగం: 7-40 ఎల్లెపాట: 7-45 నాటిక - హై రిలే 8-00 శ్రోతలు కోరిన పాటలు: 8-30 రేడియో న్యూస్ రీల్ 8-45 లలిత సంగీతం 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా. 9-15 ఆంగ్లమున: 9-25 విరామ సంగీతం: 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం: 11-00 అం. వా: 11-05 ప్రసార సమాప్తి - జన గణ మన.

హైదరాబాద్ - ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 వందేమాతరం: సుప్రభాతం, కార్యక్రమవివరణ: 6-40 అం వా: 6-45 భక్తిరంజని: 6-55 సూక్తి ముక్తావళి: 7-00 తె. వా: 7-15 సంకీర్తన: 7-30 వాద్య ధ్వని 7-45 ఖవ్వాలి. వాట్: 8-00 అం. వా: 8-15 విజయవాడ వలె: 8 30 విజయవాడ వలె, 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 11-45 ఉద్యమిక పాఠశాలలకు - ఉర్దూ, 12 15 హై. బి. వలె, 12-30 కార్మికుల - అ విశేష జట్టు - ఏక పాత్రాభినయం: 1 00 రేడియోకళాకారం 1330 స్వర ఎల్లలు: 1-40 హిం వా: 1-50 తె. వా. 2-00 మగం సంగీత్ 2-10 ఉ. వా: 2-20 బహెల్ వహెల్: 2-55 శ్రోతల పుత్తరాలకు జవాబులు - ఉర్దూ, 3-00 కన్నడశ్రోతలకు 3-15 మరాఠీశ్రోతలకు, 3-30 బాలానందం: 4-00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు. 6-05 ప్రాం. వా: 6-15 ప్రస్తుతాంశము 6-20 హై. బి వలె, 7-00 తె. వా. 7-15 హై బి వలె: 7-30 చిత్రసీమ: 7-40 'పునర్జీవనం' నాటిక 8-00 హై. బి. వలె 8-20 ప్రసంగం (ఉర్దూ), 8-30 రేడియో న్యూస్ రీల్: 8 40 తుమాసపు పాట 8-50 విరామ సంగీతం, 8-55 ప్రస్తుతాంశం 9-00 అం. వా: 9-15 ఉ. వా. 9-30 అఖిలభారత సంగీత కార్యక్రమం. 11-00 అం. వా: 11-05 వాతావరణ సూచన. సమాప్తి- జన గణ మన.

హైదరాబాద్ - బి

కడప

285 5 మీ (1130 కిలోసై)

విశాఖపట్నం

322 6 మీ (930 కిలోసై)
సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

---

89 42 మీ (3355 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)
ఉదయం: 6-30 హై.ఎ.వలె: 7-45 సమాప్తి.
60 12 మీ (4990 కిలోసై.)
8-00 హై. ఎ. వలె: 9-00 సమాప్తి:
42 02 మీ (7140 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

మధ్యాహ్నం: 11-45 ఏ. పూర్ణచంద్రరావు: 12-30 హై. ఎ. వలె: 2-01 వేణువు: 3-10 లలితసంగీతం: 2-30 పద్మా గోపాలకృష్ణన్: 2-30 హై. ఎ. వలె: 4-00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-00 హై. ఎ. వలె: 6-20 గ్రామస్థులకు 7-00 తె. వా: 7-15 గ్రామస్థులకు: 7-30 హై. ఎ. వలె: 8-00 ఏ. పూర్ణచంద్రరావు. 8-55 హై ఎ వలె: 9-15 జానపద గేయాలు: 9-30 హై. ఎ. వలె 51-05 వాతావరణ సూచన ప్రసారసమాప్తి- జన గణ మన.

మద్రాస్ - బి

211.3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 అం. వా: 6-45 మంగళగానం: 7-00 తె. వా: 7-15 సుప్రభాతం, 7-30 శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం: 8-00 అం.వార్తలు: 8-15 ప్రసార సమాప్తి.

211 3 మీ (1420 కిలోసై)
41 90 మీ (7160 కిలోసై)

మధ్యాహ్నం: 1-00 మ. ఎ. వలె: 1-30 అం. వా: 1-40 గీతమంజరి: 1-50 తె. వా: 2-00 ప్రసార సమాప్తి.

3-30 పిల్లలకు (తమిళం) 4 30 చిన్న పిల్లలకు: 5-00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం: 6-00 అం. వా 6-05 మ.ఎ.వలె 6-20 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు వాణిజ్య వార్తలు (ఆంగ్లం), 6-30 కార్యక్రమ వివరణ: (తమిళం) 6-35 వేణువు: 7-00 తె.వా: 7-15 సంగీతమాల, 7-30 నాటిక (తమిళం) 8-55 ప్రస్తుతాంశం, 9-00 అం. వా 9-15 ఆంగ్లమున: 9-30 ఆంగ్ల ప్రసంగం: 9-40 విరామ సంగీతం: 9-45 పాశ్చాత్య సంగీతం: 11-00 అం. వా: 11-05 ప్రసార సమాప్తి - జన గణ మన.

చిత్తూరు జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నిధికి రు5,000 వసూలుకు నిర్ణయం

'విశాలాంధ్ర' ప్రతులు వంద పెంచటానికి కూడా సమితి నిర్ణయం

తిరుపతి ఫిబ్రవరి 3

చిత్తూరుజిల్లాలో ఈ సంవత్సరం కమ్యూనిస్టు పార్టీకి కనీసం రు 5,000 లు అవసరమనీ ఆ మొత్తాన్ని ఫిబ్రవరి, మార్చి నెలల్లో వసూలు చేయవలెననీ చిత్తూరుజిల్లా కమ్యూనిస్టు సమితి తీర్మానించింది

చిత్తూరుజిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశం, సత్యవీడు తాలూకా వరదయ్యపాళె గ్రామంలో, జనవరినెల 30 31 తేదీలలో జరిగింది పానగం పంచాయతీబోర్డు అధ్యక్షులు శ్రీ బి రఘునాదరెడ్డి అధ్యక్షతవహించారు

ప్రముఖ సంఘ సంస్కర్త శ్రీ దర్శి చెంచయ్య మృతికి గాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ తొలుత తీర్మానించారు

ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ గజ్జల మల్లారెడ్డిగారు సమావేశంలో పాల్గొన్నారు. బొంబాయి మహాసభ నిర్ణయాలను ఆయన వివరించారు.

ప్రత్యేక ఆహ్వానంపై హాజరైన మద్రాసు కమ్యూనిస్టు నాయకులు శ్రీ బాలదండాయుధం తమిళ రాష్ట్రంలో జరుగుతున్న హిందీ వ్యతిరేక అల్లరుల వెనుకవున్న అభివృద్ధి నిరోధక కుట్రలను గురించి తెలియజేశారు.

గత నవంబరులో జిల్లాపార్టీ మహాసభ జరిగిన తరువాత జిల్లాలో జరిగిన పార్టీ కార్యకలాపాలపైన జిల్లాసమితి కార్యదర్శి శ్రీ కె. కృష్ణారెడ్డి నివేదించారు దానిపై 11 మంది సభ్యులు చర్చలలో పాల్గొన్నారు.

జిల్లాలోపార్టీ శక్తినిబట్టి యే యే రంగాలలో కేంద్రీకరించవలెనో సూచిస్తూ శ్రీ మల్లారెడ్డి గారు మాట్లాడారు.

ఉపసంఘాలు

తాలూకాల పరిధి విస్తృత తరువాత, యీ దిగువ ఉపసంఘాలను సమితి ఏర్పరచింది.

1. రైతుసంఘ (ఉపసంఘం) శ్రీయుతులు బి రాజారెడ్డి (కన్వీనరు), జి. గోవిందస్వామి. బి. రామలింగారెడ్డి, పి రామకృష్ణనాయుడు, ఆర్. రామనాధరెడ్డి, యం. వాసుదేవరెడ్డి, యల్ రమణారెడ్డి.

ట్రేడ్‌యూనియన్ ఉపసంఘం, శ్రీయుతులు కె. కృష్ణారెడ్డి (కన్వీనర్), జి శివయ్య, పి. ధర్మారావు టి జగన్నాథం పి. రాధాకృష్ణయ్య శెట్టి, జి రఘునాధరెడ్డి.

చేనేతకార్మిక ఉపసంఘం, శ్రీయుతులు సవణి వేణుగోపాల్ (కన్వీనర్) ఏ వి. చంద్రప్ప, బి బాలయ్య, కె బాలకృష్ణయ్య.

వ్యవసాయ కూలీ సంఘ ఉపసంఘం: శ్రీయుతులు వి. శంకరయ్య (కన్వీనర్) యం వాసుదేవరెడ్డి (మిగిలిన పేర్లు మరో సమావేశంలో నిర్ణయించ బడును.)

యువజనరంగం అపెనై ఆర్.పి.రామకృష్ణ, సమావేశంలో విరాళాలకు విజ్ఞప్తిచేయగా, సభ్యులు యీ దిగువ వాగ్దానములనిచ్చారు.

శ్రీ జి. శివయ్య	రు. 500
శ్రీ పి. రామకృష్ణనాయుడు	200
శ్రీ బి సుబ్రహ్మణ్యం రెడ్డి	200
శ్రీ బి. రాజారెడ్డి	200
శ్రీ పి. ధర్మారావు	120
శ్రీ పి. వేణుగోపాల్	100
శ్రీ జి. రఘునాధరెడ్డి	60
శ్రీ ఏ. కోదండరెడ్డి	60
శ్రీ యల్. రమణారెడ్డి	60
శ్రీ పి. రామకృష్ణ	50
శ్రీ కె జయరామిరెడ్డి	20
శ్రీ యం. వాసుదేవరెడ్డి	20
మొత్తం రు	1590

కాళహస్తి పట్టణంలో పార్టీ ఆఫీసుకుగాను ఒక రూము కట్టి యివ్వగలనని శ్రీ ధర్మారావు గారు వాగ్దానం చేశారు. అందాక పార్టీఆఫీసుకు బాడుగను భరించగలనని తెలియజేశారు.

ప్రస్తుతం జిల్లా మొత్తంమీద వచ్చే విశాలాంధ్ర ప్రతులు 125. ఇవిగాక అదనంగా మార్చి నెలలోపల 100 కాపీలు పెంచవలెనని నిర్ణయించుకొన్నారు.

జిల్లా సమితికి ముచ్చేలి పంచాయతీ అధ్యక్షుడు శ్రీ యల్. రమణారెడ్డిగారిని ఏకగ్రీవంగా కోశాధ్యక్షుని చేసుకొన్నారు.

జిల్లా కార్యవర్గానికి శ్రీ వి. శంకరయ్య (జ్యోతిశ్రీ)ని ఏకగ్రీవంగా యెన్నుకొన్నారు.

జిల్లాసమితి శ్రీ జి. శివయ్య శ్రీ జి. రామిరెడ్డి, శ్రీ కె కృష్ణారెడ్డిగార్లు గల కార్యదర్శి వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

తీర్మానాలు

పోటీపార్టీ నాయకుల అరెస్టుకు నిరసనను తెలియజేస్తూ, వారిని వెంటనే విడుదల చేయమని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

రైతుల వద్ద ప్రభుత్వమే ధాన్యాన్ని కొని నిల్వ చేసి, భవిష్యత్‌లో, ఆహార ధాన్యముల సప్లయిలో లోటు లేకుండా, తగు చర్యలు తీసుకొనవలెనని ప్రభుత్వాన్ని కోరారు

చిత్తూరు జిల్లాలో సర్వే సెటిల్‌మెంటు చేయవలసిన గ్రామములు యింకనూ వున్నవి ప్రభుత్వం స్వాధీనం కాని గ్రామములు యింకా వున్నవి. అందువలన సర్వే, సెటిల్‌మెంటుపై ఆక్షేపణలు తెలియజేయుటకు, ఒక్కసంవత్సరమైనా అదనంగా గడువు యివ్వవలెనని ప్రభుత్వాన్ని అర్థించుతూ తీర్మానించారు

సికిందరాబాద్ రైల్వే మండలంలో గుంతకల్లు వాల్తేరు రైల్వే డివిజన్లను చేర్చవలెనని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

స్టేట్‌బ్యాంకు హైదరాబాద్‌శాఖలో చిత్తూరు, నెల్లూరు జిల్లాలను చేర్చ గోరారు.

రేణిగుంట తిరుపతి రైల్వే లైనును బ్రాడ్‌గేజిగా మార్చవలసిందిగా తీర్మానించారు

జనవరి 30 వ తేదీరాత్రి వరదయ్యపాళెంలో బహిరంగసభ జరిగింది. శ్రీ గజ్జల మల్లారెడ్డి ఎర్రజెండాను ఎగురవేశారు. శ్రీ కె కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు జిల్లాకమ్యూనిస్టు నాయకులు శ్రీ జి. శివయ్య మద్రాసు కమ్యూనిస్టు నాయకులు శ్రీ బాలదండాయుధం తదితరులు ఉపన్యసించారు. శ్రీ ధర్మారావు గారు శ్రీ బాలదండాయుధంగారి ఉపన్యాసాన్ని తెలుగులోనికి తర్జుమా చేశారు. దాదాపు 2000 మంది ప్రజలు హాజరైన యీ బహిరంగసభ వరదయ్యపాళె గ్రామంలో ముఖ్యమైన రాజకీయ సంఘటన.

నర్సరావుపేట తాలూకాలో రు 7625 లు

పార్టీనిధికి వసూలుచేయాలని తాలూకా సమితి నిర్ణయం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 3

గుంటూరుజిల్లా నర్సరావుపేట తాలూకా కమ్యూనిస్టు సమితి సమావేశం చిలకలూరిపేటలో ఇటీవల జరిగింది. సమావేశానికి శ్రీ కందిమళ్ల రామయ్య అధ్యక్షత వహించారు

తాలూకా సమితి కార్యదర్శి శ్రీ బ్రహ్మానందం జిల్లాసమితి నిర్ణయాలను వివరించారు.

నర్సరావుపేట తాలూకాలో పార్టీ సభ్యత్వం 456 కు పెంచుటకు పార్టీ సభ్యులు 13 దళాలుగా ఏర్పడి, రైతుసంఘంలో 600 సభ్యులను, వ్యవసాయ కార్మిక సంఘంలో 750 మందిని, యువజన సంఘంలో 750 మందిని, విశాలాంధ్ర కు 31 కొత్త చందాదారులను చేర్పించుటకు పార్టీ ఫండు రు. 7625 లు వసూలు చేయుటకు నిర్ణయాలు తీసుకోబడ్డవి

పోటీపార్టీ సిద్ధాంత రాజకీయాలతో తీవ్ర విభేదాభిప్రాయాలున్నప్పటికి పోటీపార్టీ నాయకుల అరెస్టు ప్రజల ప్రజాతంత్ర హక్కులకు భంగం కలిగిస్తుందని, నేరారోపణ లేకుండా పోటీ పార్టీ వారిని అరెస్టు చేసినందుకు నిరసిస్తూ తక్షణమే వారిని విడుదల చేయవలసినదిగా సమితి డిమాండు చేసింది.

శ్రీ కందిమళ్ళ రాఘవయ్య అండ్ రామమూర్తి కంపెనీలో అక్రమంగా తొలగించబడిన ముగ్గురు ముఠా కార్మికులను యిద్దరు మేస్త్రీ కార్మికులను వెంటనే పనిలోనికి తీసికోవలసినదిగా తీర్మానించారు.

బాపట్ల తాలూకాలో రు 5000 లు

చీరాల, ఫిబ్రవరి 3

గుంటూరుజిల్లా బాపట్ల తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యవర్గ సమావేశం జనవరి 31న చీరాలలో జరిగినది సమావేశానికి జిల్లా పార్టీ నాయకులు శ్రీ పి. శ్రీరాములు హాజరయినారు

పార్టీ నిధికి రు 5 వేలు వసూలు చేయాలని గ్రామాలవారీగా కోటాలు తీసుకొన్నారు. ఈ సందర్భంలోనే ప్రజా సంఘాల సభ్యత్వం పార్టీ సభ్యత్వం చేర్పించాలని నిర్ణయించుకున్నారు.

తాలూకా కమిటీలో యింకా కొందరిని చేర్చుకోవాలన్న తాలూకా సభ నిర్ణయానుసారంగా శ్రీ షేక్ ఫరీద్ శ్రీ మెట్లా వెంకట సుబ్బారావుగార్లను కమిటీలోకి తీసుకొంటూ శ్రీ మెట్లా వెంకట సుబ్బారావుగారిని సెక్రటేరియట్ సభ్యులుగా కూడ తీసుకొన్నారు.

అనంతపురం తా॥లో రు. 276 నగదు వసూలు

అనంతపురం, ఫిబ్రవరి 3

అనంతపురం తాలూకా పూలకుంట గ్రామంలో తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఆర్, హనుమంతప్ప జిల్లాకార్యవర్గ సభ్యులైన శ్రీ డి. నాగిరెడ్డిగార్ల నాయకత్వాన పార్టీనిధి వసూళ్ళ కార్యక్రమము ప్రారంభమయినది. ఈ గ్రామము, తాలూకా జనరల్‌బాడీకొ తీసుకొన్న కోటా రు 300 లు

మొత్తం 40 మంది సభ్యులు ఇల్లిల్లు తిరిగి వసూళ్లు చేశారు ఇంకా కొంతమందిని వసులు ముమ్మరము వలన చూడలేకపోయారు. ఈ ప్రాంతంలో వరిపంట తప్ప, మెట్టపంట పూర్తిగా దెబ్బతిన్నది.

వసూళ్ల వివరాలు శ్రీయుతులు లక్ష్మిరెడ్డి (ఒకమూట వడ్లు) రు 40 డి నాగిరెడ్డి 30 ఎస్, చిన్నూరప్ప 25. వి చిన్నరామిరెడ్డి 10 ఎల్ నాగిరెడ్డి 10, వి అక్కులప్ప 10 ఎం. రామేశ్వర రెడ్డి 10 ఒ సి నారాయణశెట్టి 25, ఎం. నారాయణ 5, ఏ. ఓబశేటు 5, వి లింగప్ప. గ్ హెచ్ ఎ. వల్లార్ 5, ఎస్ పక్కీరప్ప 5. ఓ వెంకటశెట్టి 5 కొనప్ప 5, చిన్నవెంకటరెడ్డి 6, అదినారాయణ రెడ్డి 10, వల్లా రామప్ప 5, పాదూరు అక్కులప్ప 10, కె నాగప్ప 3, వి వెంకటరాయుడు 3 కె సంజప్ప 3 శ్రీమతి కె తిప్పమ్మ 3, చిల్లర వసూళ్ళు 23, మొత్తం రు 276 లు

పై మొత్తము గాక కూలిచేసి జీవించే ఒక అమ్మాయి ఒక రోజుకూలి 2 సేర్ల వడ్లు ఒక కమ్మరి 9 సేర్లు వడ్లు యిచ్చారు.

మధిర తాలూకా కమ్యూనిస్టు కమిటీ నిర్ణయాలు

ఖమ్మం, ఫిబ్రవరి 3

ఖమ్మంజిల్లా, మధిర తాలూకా కమ్యూనిస్టు సమితి సమావేశం జనవరి 30 వ తేదీన గొల్లెనపాడు గ్రామంలో శ్రీ అమరనేని వెంకటేశ్వరరావుగారి అధ్యక్షతన జరిగినది. సమావేశంలో జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ చుండూరి నరసింహారావుగారు బొంబాయి మహాసభను గురించి వివరించారు

కార్యదర్శి శ్రీ తూము ప్రకాశరావుగారు పార్టీ, ప్రజాసంఘాల సభ్యత్వాన్ని మార్చి నెలాఖరువరకు పూర్తిచేయాలని, నిర్మాణ సమస్యలపై మాట్లాడుతూ తెలియజేశారు.

జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ తమ్మినేని గోవిందుగారు నిర్మాణ సమస్యలు, ప్రజాసంఘాల సభ్యత్వం పార్టీ సభ్యత్వం, పార్టీనిధిని మాట్లాడారు

తాలూకా కమ్యూనిస్టు సమితిలోనికి శ్రీయుతులు నల్లమోతు సిద్దయ్య, చుండూరి నరసింహారావు, అమర్నేని వెంకటేశ్వరరావు పాదినేని వీరభద్రం, కొంగర అప్పయ్యగార్లను కోఆప్టు చేసుకొన్నారు. పోటీ కమ్యూనిస్టు పార్టీనాయకులను డిటెన్షన్‌నుండి విడుదలచేయాలని, రక్షణ చట్టాన్ని రద్దుచేయాలని, బంజరు భూములకు పట్టాలు ఇచ్చివేయాలని రిపబ్లికన్ పార్టీ సత్యాగ్రహులను వెంటనే విడుదల చేయాలని తీర్మానించారు.

భీమునిపట్నం తా॥ కమ్యూనిస్టు సమావేశం

చిట్టివలస ఫిబ్రవరి 3

విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం జనవరి 28న జరిగింది విశాఖజిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ వై. విజయకుమార్, కార్యవర్గ సభ్యులు శ్రీ జె వి. కె వల్లభరావుగారు హాజరయ్యారు కార్యదర్శి శ్రీ గుజ్జు రాము నాయుడుగారు బొంబాయి మహాసభ నిర్ణయాలను వివరించారు తాలూకా రాజకీయ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని ప్రజా సంఘాల నిర్మాణం చేయాలని వివరించారు. మధ్యాహ్నం శ్రీ వై విజయకుమార్ అధ్యక్షతను పార్టీ జనరల్‌బాడీ సమావేశం జరిగింది. బొంబాయి మహాసభ నిర్ణయాలు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సమావేశాల నిర్ణయాలు వివరించబడ్డాయి ప్రజా సంఘాల నిర్మాణానికి పార్టీని రాజకీయంగా పటిష్టం చేయటానికి తీర్మానించబడింది

అకస్మాత్తుగా పోటీ కమ్యూనిస్టు పార్టీ నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసినందుకు తమ నిరసనను తెలియజేస్తూ, ఆ పార్టీ నాయకులమీద నేరాలుంటే కోర్టులో రుజువు చేయాలనీ లేదా వెంటనే అందరినీ విడుదల చేయాలనీ, అత్యవసర పరిస్థితిని రద్దు చేయాలనీ కోరుతూ ఒక తీర్మానం చేశారు

సంగారెడ్డి తాలూకాలో కమ్యూనిస్టుపార్టీ నిర్మాణం

సంగారెడ్డి, ఫిబ్రవరి 2

మెదక్‌జిల్లా సంగారెడ్డిలో జనవరి 28 వ తేదీన తాలూకాలోని కమ్యూనిస్టుపార్టీ సభ్యులు సమావేశమయి 21 మందితో తాలూకా కమిటీని ఎన్నుకొన్నారు. ఈ సమావేశంలో 30 గ్రామాలనుండి 80 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీ కె నారాయణరెడ్డి కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు కిసాన్‌సభ, వ్యవసాయ కార్మిక, యువజన ఉపసంఘాలను సమావేశంలో ఏర్పరచారు. ఫిబ్రవరి 28 లోపున 3 వేల కిసాన్‌సభ సభ్యత్వం వేయి యువజన సభ్యత్వం వేయి వ్యవసాయ కార్మిక సభ్యత్వంచేర్పించడానికి నిర్ణయాలుతీసుకున్నారు

కొత్తగూడెం కమ్యూనిస్టు సమావేశం

కొత్తగూడెం ఫిబ్రవరి 3

ఇటీవల మేదర బస్తీ కమ్యూనిస్టుశాఖ సమావేశం శ్రీ చందిక్క రాజయ్యగారి అధ్యక్షతను జరిగింది. సమావేశంలో ఖమ్మంజిల్లా సమితికార్యదర్శి శ్రీ టి వి. విఠల్‌రావుగారు బొంబాయి మహాసభ విశేషాలను వివరించారు

తదుపరి ప్రభుత్వం పోటీపార్టీ నాయకులను విడుదలచేయాలనికోరుతూ సమావేశం తీర్మానించింది.

మొర్సుమల్లి శాఖ

కృష్ణాజిల్లా మొర్సుమల్లి కమ్యూనిసుపార్టీ శాఖ శ్రీ బొజ్జ గోపాలరావుగారి అధ్యక్షతన సమావేశమై శ్రీయుతులు బొజ్జ గోపాలరావు (కార్యదర్శి) బోయపాటిరామయ్య, జవ్వాది వెంకట్రామయ్య యేడిది బ్రహ్మం. పిల్లి ఏసులతో కమిటీని ఎన్నుకొన్నారు.

పోటీపార్టీ నాయకుల అరెస్టులను ఖండించుచూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

పెద్దాపురంలో లజపతిరాయ్ జయంతి

పెద్దాపురం, జనవరి 31

స్వాతంత్ర్య సమర పోరాటంలో ప్రముఖ పాత్రవహించిన లాలా లజపతిరాయ్ శతజయంతి ఈనెల 28 వ తేదీ సాయంత్రం స్థానిక విజ్ఞాన సమితి కార్యాలయంలో శ్రీ అల్లంరాజు లక్ష్మీపతి అధ్యక్షతను జరిగింది. శ్రీయుతులు ఎ. వి. సీతారామారావు మారెళ్ళ వీరభద్రరావు, మూర్తిశ్రీ, శ్రుతి సుఖానందగు ప్రభృతులు ప్రసంగించారు కార్యదర్శి శ్రీ దొంకాడ సత్యనారాయణమూర్తి వందన సమర్పణ చేశారు.

చిత్తూరుజిల్లా బొమ్మ సముద్రంలో జనవరి 30 వ తేదీన క్షయనిరోధక దినోత్సవం జరిగింది. బడిపిల్లలతో పూరేగింపు జరిపారు. బహిరంగసభ జరిగింది.

ప్రింటింగ్ పరిశ్రమపట్ల ఆంధ్రప్రభుత్వ బాధ్యత

ఆంధ్రప్రదేశ్ ప్రజల వైజ్ఞానిక సాంస్కృతిక జీవిత పురోభివృద్ధి కోసం ప్రెస్ పరిశ్రమ వహిస్తున్న కీలకపాత్ర గణనీయమైంది. ఈ పరిశ్రమలో సుమారు 10 వేల మంది కార్మికులు పని చేయుచున్నారు

శ్రీ కొట్టాపు లక్ష్మణస్వామి

సంయుక్త కార్యదర్శి, ప్రెస్‌వర్కర్సు యూనియన్ రాజమండ్రి

చాలీ చాలని జీతాలు ఒకవైపు అధిక ధరలు మరొక వైపు, ప్రెస్ కార్మికుల్ని పిప్పి పిప్పి చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పని చేయు ప్రెస్ కార్మికులకు క్రమపద్ధతిలో జీతాలు లేవు కోస్తా జిల్లాలలో ఒక విధంగాను, రాయలసీమ జిల్లాలలో మరో మోస్తరుగాను, తెలంగాణా జిల్లాలలో ఇంకోమాదిరిగాను ఉంటున్నవి ఇటువంటి వ్యత్యాసములు లేకుండా ప్రదేశ్ మొత్తంగా ప్రెస్ కార్మికులకు ఒకే పద్ధతిలో జీతాలుండాలి. ఈరోజున ప్రెస్ కార్మికుల ఆర్థిక పరిస్థితి హీనాతిహీనంగా వున్నది. సీనియారిటీ, నైపుణ్యం గలిగిన ప్రెస్ కార్మికుల జీతాలు 60-70 రూపాయలకు మించి లేవు అలాగే పీస్ వర్కు' చేసే కార్మికులకు కూడా సరియైన రేట్లను యజమానులు యివ్వడం లేదు విపరీతంగా పెరిగిపోయిన జీవనవ్యయ భారంతో పోల్చిచూస్తే ఈజీతాలతో ప్రెస్‌కార్మికులు తమ భార్యాబిడ్డలతో ఎలా జీవిస్తున్నారో ఆపరమాత్మునికే తెలియాలి ప్రస్తుతమున్న జీతాలవ్యత్యాసమును మార్పుజేసి. ప్రెస్ కార్మికులకు జీవన భృతికి సరిపోయే విధంగా జీతాలను నూటికి 25 శాతం పెంచేటట్లు ప్రెస్ యజమానులపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకు రావలసియున్నది.

ఈనాడు ప్రెస్ పరిశ్రమ అనేక క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తోంది. దేశంలో తయారవుతున్న కాగితం కొరత వల్లనూ మార్కెట్‌లో నిలవయున్న పేపరు ధరలు విపరీతంగా పెరిగిపోయి నందువల్లను, ప్రచురణకర్తలు నూతన సాహిత్యాన్ని ముద్రణకు తీసుకురాలేకపోతున్నారు. ముఖ్యంగా ప్రెస్ పరిశ్రమకు సంబంధించిన మిషనరీ. మెటల్, ప్రింటింగ్ ఇంకులు, వర్నిచర్స్ మొదలైనవాటి ధరలుకూడా అందుబాటులో లేకుండా పోవుచున్నవి, అందుచేత ప్రెస్ పరిశ్రమ రోజు రోజుకు అనేక యిబ్బందులకు గురిఅవుచున్నది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రెస్ పరిశ్రమకు కావలసిన "మెటీరియల్స్"ను తక్కువ ధరలకు సప్లయిచేయించే బాధ్యతను తీసుకోవాల్సివుంది

గైడ్స్‌వల్ల విద్యార్థులు పరీక్షలలో సులభయోగ్యంగా ప్యాసుఅవుతున్నారనే కారణంగా- ప్రభుత్వంవారు ప్రయివేట్ పబ్లిషర్సుగైడ్సును ప్రచురించరాదని తాకీదు యిచ్చారు ఈ గైడ్సు ప్రచురణవలన కొన్ని ప్రెస్‌లకు పని కలుగుచున్నది. గైడ్సు ప్రచురణ నిలిపివేస్తే ప్రెస్‌లకు పని లేకుండా పోయి, ప్రెస్ కార్మికులు నిరుద్యోగానికి గురి అవుతారు ప్రభుత్వం పాఠ్య గ్రంథాల ప్రచురణను అన్ని ప్రెస్‌లకు యిచ్చి కార్మికులు నిరుద్యోగానికి గురికాకుండా చూడవలసి యున్నది

1958 - 59 వ సంవత్సరాల్లో ప్రభుత్వం పాఠ్యగ్రంథాలను జాతీయం చేసినప్పుడు ప్రెస్ కార్మికులు అందుకు పూర్తితోడ్పాటు యిచ్చారు దాన్ని ఆసరాగా తీసుకొని కొంతమంది ప్రెస్ యజమానులు కార్మికులను తొలగించడానికి పూనుకొన్నప్పుడు ఆంధ్రరాష్ట్రప్రెస్‌వర్కర్సు యూనియన్ నాయకులు ఆనాటి విద్యా శాఖ మంత్రి శ్రీ ఎస్ బి పి. పట్టాభిరామారావుగారిని కార్మికశాఖామంత్రి శ్రీ డి సంజీవయ్యగారిని కలుసుకొని. రాష్ట్రంలో అనేకచోట్ల ప్రెస్ కార్మికులను తొలగిస్తున్నారని ఒక మెమోరాండాన్ని సమర్పించారు. మెమోరాండంలోని అంశములన్నీ పరిశీలించి, 'ఇక పెద్దఎత్తున ప్రెస్‌లలో పనిచేస్తున్న కార్మికుల్ని తొలగించడం జరగదు ఒకవేళ తప్పనిసరై ఎవరినైనా తొలగిస్తే వారికి రావలసిన రిట్రెంచ్‌మెంట్, కాంపెన్సేషన్ వగైరాలు విధిగా యివ్వాలని ఆ విధంగా ఏ యజమానియైనా నిరాకరించిన తగుచర్యలు తీసుకుంటా" మని ప్రతినిధివర్గానికి హామీ యిచ్చారు.

గైడ్సు ప్రచురణను ప్రభుత్వం నిలిపివేసినా ప్రెస్ కార్మికులు నిరుద్యోగానికి గురికాకుండా చూడవలసిన కర్తవ్యం ప్రభుత్వంపై యున్నది. అంతే గాకుండా ప్రభుత్వంయొక్క ప్రింటింగు పనులన్నియు జిల్లాల వారీగా యున్నటువంటి ప్రెస్‌లకు యిచ్చి వాటి రక్షణకు తోడ్పడాలి ప్రెస్ కార్మికుల పరిస్థితులను మెరుగు పర్చడానికిగాను ఒక త్రైపాక్షిక కమిటీని నియమించి పరిశ్రమాభివృద్ధికి, కార్మికాభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా కొన్నిచోట్ల పెద్ద ప్రెస్‌లలో ఇన్సూరెన్సు - మెడికల్ - ప్రావిడెంట్ ఫండ్ - మొదలైన స్కీములు అమలు జరుగుచున్నాయి చిన్న ప్రెస్‌లకుకూడా ఈ స్కీములు వర్తింపజేసి అమలు జరిగేటట్లు ప్రభుత్వం చూడవలసి యున్నది.

ఈనాడు ఇతర రాష్ట్రాలతో పోల్చి చూసుకుంటే మన ఆంధ్ర ప్రదేశ్‌లో పరిశ్రమలు బహుస్వల్పం. ముఖ్యంగా ప్రెస్ పరిశ్రమ పరిస్థితి ఏమీ బాగుండలేదు ముద్రణారంగంలో మద్రాసు-బొంబాయి కలకత్తా మొదలగు పెద్ద పట్టణములు ముందడుగు వేస్తున్నవి. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే ప్రెస్ పరిశ్రమ వహించే పాత్ర గణనీయం

ఈ పరిశ్రమలో పనిచేయు కార్మికులు నిపుణత గల్గినవారు అనేకులు గలరు. వారికి తగిన టెక్నికల్ పరిశోధనలు చేయడానికి సౌకర్యములు కలుగుట లేదు ఇతర రాష్ట్రాల వలె మన రాష్ట్రంలో కూడా ప్రెస్ పరిశ్రమ అభివృద్ధి చెందాలన్నా, కార్మికులు నిపుణులుగా తయారు కావాలన్నా ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ముఖ్య కేంద్రాలలో 'ప్రింటింగ్ టెక్నికల్ స్కూల్స్'ను తెరవడం ఎంతైనా అవసరం. వీటికి ప్రభుత్వం పూనుకొన్నప్పుడే - ఇతర రాష్ట్రాల్లో సాధించిన ప్రింటింగ్ నిపుణతను మనం సాధించుకోగలం. ప్రెస్‌పరిశ్రమ అభివృద్ధికిగాను 'ఆంధ్రరాష్ట్ర ప్రెస్ వర్కర్సు యూనియన్ 'గతంలో' చేసిన నిర్ణయాత్మకమైన సూచనలను ప్రభుత్వం పరిశీలించి ప్రెస్ పరిశ్రమాభివృద్ధికి పూనుకుంటుందని ఆశిస్తున్నాను.

ఏలూరుఅల్యూమినియం వర్కర్సు యూనియన్

ఏలూరు ఫిబ్రవరి 3

ఏలూరు అల్యూమినియం రేకు వర్కర్సు యూనియన్ ప్రథమవార్షికోత్సవం గాంధీనగరం శ్రీ రామమందిరంలో జరిగింది.

సభా స్థలాన్ని చక్కగా అలంకరించారు ఉదయం వృద్ధకార్మికుడు శ్రీ మజ్జి నరసింహం జండా ప్రతిష్ఠాపన చేశారు

ఆహ్వాన సంఘ అధ్యక్షుడు శ్రీ బోను సూర్యనారాయణ ప్రతినిధులకు స్వాగతం చెప్పారు. ఏలూరు ట్రేడ్ యూనియన్ సహాయ కార్యదర్శి శ్రీ బోను సీతారామయ్య, ఇత్తడి కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ కోరాడ రమణరావుగార్లు సభలో పాల్గొని సందేశాలనిచ్చారు

ఇతర పట్టణాల నుంచి ప్రత్యేకించి బందరు నుండి అధిక సంఖ్యలో [illegible] ప్రతినిధులు పాల్గొన్నారు

కార్యదర్శి శ్రీ బవుగోతు కృష్ణమూర్తి సంఘ కార్య కలాపాలను నివేదించారు సంఘాధ్యక్షుడు శ్రీ మడక అప్పలస్వామి కార్మికుల కోర్కెలను వివరించుతూ, యజమానులతో జరిపిన సంప్రదింపులను తెలియజేశారు. ప్రతినిధుల సమావేశాన్ని శ్రీ చిట్టూరి ప్రభాకర చౌదరి ప్రారంభించుతూ యంత్రయుగంలో చేతి వృత్తుల వారు తమ వృత్తిని కొనసాగించుటకు కాలానుగుణంగా మార్పు చెందుతూ నైపుణ్యాన్ని పెంచుకోవాల్సి వుందన్నారు. ఉమ్మడి కార్యక్రమం చేపట్టి కార్మికులు తమహక్కులను సాధించుకొనుటతో పాటు, ఉత్పత్తిని కూడా సాధించాలన్నారు

మాజీకార్మికుడు శ్రీ రాజాబత్తిమ్మినాయుడు సంఘానికి రూ 5 లను యిచ్చి ఆశీర్వదించారు

తర్వాత నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి

శ్రీయుతులు బోను సీతారామయ్య మడక అప్పలస్వామిగార్లను గౌరవాధ్యక్షులుగాను అధ్యక్షులు శ్రీ రౌతు సింహాచలం కార్యదర్శి శ్రీ శేషపు అప్పలస్వామి గార్లను ఎన్నుకొన్నారు. మిగతా కార్యవర్గ సభ్యులను ఎన్నుకొనుటకు అధ్యక్షునికి అధికారమిచ్చారు

ఆ రాత్రి జరిగిన బహిరంగ సభకు శ్రీ మడక అప్పలస్వామి అధ్యక్షత వహించారు. శాసనసభ్యులు శ్రీ అత్తులూరి సర్వేశ్వరరావు శ్రీ చిట్టూరి ప్రభాకర చౌదరి శ్రీ శిరివిల్లి సత్యనారాయణగార్లు ప్రసంగించారు.

ఏలూరులో రైల్వే క్రాసింగ్ ఓవర్‌బ్రిడ్జి డ్రైనేజి స్కీము, మంచినీటి సరఫరా పథకము జరుగుటకు మరొక రిజర్వాయరును సత్వరము నిర్మించవలసిందిగా కోరుతూ తీర్మానించారు.

సభానంతరం 'దానికేమి' హాస్యనాటికను నవ్యకళా నాట్యమండలి వారు ప్రదర్శించారు

యార్లగడ్డ యువజనసంఘం

యార్లగడ్డ జనవరి 29

కృష్ణాజిల్లా యార్లగడ్డ గ్రామ యువజన సంఘ సమావేశం శ్రీ వి పాపారావుగారి అధ్యక్షతను నిన్న ఉదయం జరిగింది సమావేశానికి కృష్ణాజిల్లా యువజనసంఘ ఉపాధ్యక్షులు శ్రీ కొల్లి నాగేశ్వరరావు తాలూకా యువజన నాయకులు శ్రీ చంద్రప్రసాద్ హాజరయ్యారు.

సమావేశ ప్రారంభంలో శ్రీ నాగేశ్వరరావు గారు జాతీయ పునర్నిర్మాణానికి యువజన సంఘాలు ఎలాంటి ప్రముఖమైన బాధ్యత నిర్వహించాలో తెలిపారు

గ్రామంలో ఒక యూత్‌క్లబ్ స్థాపించి గ్రామంలోని యువకులందరితో యూత్‌క్లబ్ కార్యకలాపాలద్వారా ఐక్యఉద్యమాన్ని నిర్మించాలని నిర్ణయించారు.

ఫిబ్రవరి 7, 8 తేదీలలో యార్లగడ్డ ప్రాంతీయ గ్రామాల ఆటలు వైజ్ఞానికపోటీలు ఉత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు

ఫిబ్రవరి 8 వ తేదీన దివి తాలూకా యువజన సంఘ కార్యకర్తల సమావేశం ఈ గ్రామంలో జరిపేందుకు ఆహ్వానించబడింది

శ్రీ వి పాపారావుగారు అధ్యక్షులుగా, శ్రీ వై. నాగేశ్వరరావు కార్యదర్శిగా మరి 5 గురు సభ్యులతో ఒక కమిటీ ఎన్నుకోబడింది.

లేగుంటపాడులో పార్టీనిధికి వరికోత

లేగుంటపాడు ఫిబ్రవరి 1

నెల్లూరుజిల్లా కోవూరు తాలూకా లేగుంటపాడులో జనవరి 27 న కమ్యూనిస్టుపార్టీనిధికి వరికోత కోసినారు. ఆ రోజు పదిమంది శ్రమజీవులు ఎర్రజెండాలతో నినాదాలు చేస్తూ రోజంతా వరి కోశారు వచ్చిన కూలిని కమ్యూనిస్టుపార్టీ నిధికి సమర్పించారు. విడిగాకూడ చందాలు వసూలు చేయబడుచున్నవి.

నెల్లూరుజిల్లా కావలి తాలూకా బోగోలు గ్రామంలో ముస్లిములకు కుటుంబానికి 1 కిలో గోధుమలు 1 కిలో మైదా పిండిని పంపకం చేయించారు



లేఖలు

స్టాంపు వెండర్లు

మహాశయా,

ప్రభుత్వంవారు "స్టాంపువెండర్ల"కు లోగడ నెలసరి కమీషన్ 150 రూపాయలుగా నిర్ణయించారు. పబ్లిక్ శలవులలోను, కొన్ని వ్యాపారాది అన్ సీజనులలోను వివిధ రకములుగల స్టాంపులు అమ్మకం పూర్తిగా స్తంభించిపోవును. పెద్ద పెట్టుబడిగల స్టాంపు ఎల్లప్పుడు సిద్ధముగా ఉంచవలసిన వ్యాపార మగుటచేత పెట్టుబడికి వడ్డీ అధికరించుటచే పెరిగిన కుటుంబఖర్చుల వల్ల అమ్మకపు సీజనులో వచ్చిన కమీషన్ ఏమాత్రం చాలక బాధపడుచున్నారు

దయయుంచి ప్రభుత్వంవారు లోగడ నిర్ణయించిన కమీషను రు '50 ల నుండి 250 ల వరకు పెంచుతూ నెలసరికాక సంవత్సరంలో ఎప్పుడైనను తీసుకొనుటకు అవకాశము కల్పించగలందులకున్నూ ఆ విధంగా కమిషను రేట్లు సవరించుటకున్నూ క్రయదారులకి స్టాంపు వెండర్లకు గల లోగడ యిచ్చిన అమ్మక విలువ రు 1000 ల నుండి రు 1500 లకు పెంచుతూ ఆ విధంగా రు 500 ల విలువ గల స్టాంపులకు కూడా కమిషను రేటు నిర్ణయించి అమ్మించుటద్వారా వారి ఆర్థికపరిస్థితులు చక్కపరచగలందులకు ప్రార్థించుచున్నాను. ఇట్లు.

ఆటూరి సత్యనారాయణ,
స్టాంపు వెండరు. గుంటూరు

పంచాయతీల సెస్సులు

మహాశయా:

ల్యాండుసెస్సు, రాళ్ళు, గులక, మట్టి వగైరాల సీనరేజి సెస్సులు గ్రామ పంచాయతీల నిధులకు జమ కట్టి చుటలేదు ముఖ్యముగా ల్యాండుసెస్సు అడ్జస్టుమెంటు చేయించుకొనలేదని పంచాయతీల ఆడిట్ రిపోర్టులలో రిమార్కులు వ్రాయడం జరుగుచున్నది కనుక ప్రభుత్వమువారు శ్రద్ధవహించి. "సెస్సులు పంచాయతీల నిధులకు జమ కట్టించు యేర్పాట్లు వెంటనే చేయించవలె" నని కోరుచున్నాను.

సర్పంచ్,
మన్నె సీతారామయ్య,
మేదరమెట్ల పంచాయతీ

ప్రకాశంగారి జన్మదినం

మహాశయా,

ఆంధ్రకేసరి కంచు విగ్రహమును యిటీవల నేను రాజమహేంద్రవరం వెళ్ళినప్పుడు చూచుట తటస్థించినది వారి విగ్రహంక్రింద జననం 1876 సంవత్సరమని ఉన్నది.

ప్రకాశంపంతులుగారు జీవించియుండగనే వారి కంచు విగ్రహం ప్రతిష్ఠాపన మాచే విజయవాడలో జరుపబడినది వారి జననము 23-8-1872 అయి యున్నది కావున రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనరు ఆ విగ్రహం క్రిందనున్న వారి జననం తెలిపే తారీఖును సరిచేసి వారి మరణం కూడా చెక్కించారని ఆశిస్తున్నాను. ఇట్లు

డా. కంభంమెట్టు విశ్వవర్ధనరావు.
విజయవాడ-2

మాచర్ల వరదబాధితులకు రక్షణ సైన్యంవారి సహాయం

మాచర్ల, ఫిబ్రవరి 1

పల్నాడు తాలూకా మాచర్లలో జనవరి 26 27 28 తేదీలలో లోగడ వరదకు గురియైన 825 కుటుంబాలకు "రక్షణ సైన్యం" (సాల్వేషన్ ఆర్మీ) సంస్థవారు బెన్నీక పెసీ నల్ల దుప్పట్లు 825 ఉచితముగా పంచి పెట్టారు.

మాచర్ల లూథరన్ చర్చివద్ద శ్రీ జి. ఏబెల్ పదావాలిగారి అధ్యక్షతన ఈ వస్త్ర ప్రదానసభ జరిగినది రక్షణ సైన్యమువారి సేవను కొనియాడుచు, శ్రీ కుమారరాజా శ్రీ టి ఆర్ వి రావు శ్రీ టి. రామాంజనేయులు, జె ఎం. లూకస్ పాస్టర్‌గారలు ప్రసంగించారు. శ్రీ వి. ఏలియా వందన సమర్పణతో సభ ముగిసినది (వి. వి)

సభలు-సమావేశాలు

దక్షిణ నెల్లూరుజిల్లా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం తేది 6-2 65 ఉదయం 10 గంటలకు నెల్లూరులో జరుగుతుంది

* * *

నెల్లూరుజిల్లా మోటారు లేబరుయూనియన్ (రిజిష్టరు నెం 1740 జనరల్‌బాడీ సమావేశం నెల్లూరు పర్మనెంటుషెండు ఆఫీసులో 13-2 65 సాయంత్రం 6-30 గం కు జరుగుతుంది సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు శ్రీ మగ్దుం మొహిద్దీన్ ఆహ్వానింపబడివున్నారు

* * *

నెల్లూరు పట్టణ కమ్యూనిస్టుకమిటీ సమావేశం నెల్లూరులో జిల్లా కమ్యూనిస్టు సమితి ఆఫీసులో ఫిబ్రవరి 7 వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు జరుగుతుంది.

* * *

వరంగల్ జిల్లా మహబూబాబాద్ తాలూకా కమ్యూనిస్టు సమితి సమావేశం యీ నెల 1-10 తేదీలలో చెట్లముప్పారంలో జరుగుతుంది జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ కొండపల్లి గోపాలరావు, శ్రీ తోకల రాజరెడ్డి గారలు హాజరౌతారు సమావేశం 9 వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది.

* * *

గుంటూరుజిల్లా "భారత్ - సోవియట్" సాంస్కృతిక మహాసభలు ఫిబ్రవరి 6, 7 తేదీలలో జరుగుతవని అందరికీ తెలుపబడింది కాని అనివార్యమైన యిబ్బందులనుబట్టి 14 వ తేదీకి సమావేశం మార్చినట్లు శ్రీ వడ్లమూడి సీతారామరావుగారు తెలుపుచున్నారు.

ఏలూరులో కవిసమ్మేళనం

ఏలూరు, జనవరి 31

ఏలూరులోని సంస్కృతీ సమాఖ్య ఆధ్వర్యాన రిపబ్లిక్ దినోత్సవ సందర్భాన థియొసాఫికల్ లాడ్జిలో కవి సమ్మేళనం జరిగింది. శ్రీ బొడ్డు బాపిరాజు అధ్యక్షత వహించారు.

పట్టణంలోని సాహితీపరులు పురప్రముఖు లనేకమంది సమ్మేళనానికి హాజరయ్యారు.

శ్రీయుతులు అద్దేపల్లి నాగగోపాలరావు, కొనకళ్ళ వెంకటరత్నం, శంకర శ్రీ రామారావు పెల్సేరు నారాయణరావు పోలా ప్రగడ సత్యనారాయణ మూర్తి, కొండముది శ్రీరామచంద్రమూర్తి ముత్తేవి లక్ష్మణదాసు ఇంకా కొందరు యువరచయితలు స్వీయ కవితలను చదివారు.

కార్యదర్శి శ్రీ జి. సత్యనారాయణ వందన సమర్పణ చేశారు. (వి. వి.)

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ, ఫిబ్రవరి 4

విజయవాడ రీజనల్ అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టరు 2-1-65న అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలు చేయబడిన టోకు ధరలు (ఒక క్వింటాల్ 100 కిలోగ్రాములు, లేక 220½ పౌనులు)

ధాన్యం

		75 కి.	100 కి.
నంబర్లు:	విజయవాడ	రు. 33-75	45 00
"	కాకినాడ	30 00	40 00
"	చిత్తూరు	30 00	40 00
అక్కుల్లు:	విజయవాడ	29 25	39 00
"	తాడేపల్లిగూడెం	29 25	39 00
"	కాకినాడ	29 25	39 00
"	అముదాలవలస	29 25	39 00
సన్నకృష్ణకాటుకలు:			
	తాడేపల్లిగూడెం	30 75	41 00
సన్నాలు:	అముదాలవలస	30 75	41 00
మొలకొలుకులు:	నెల్లూరు	33 75	45 00

మిల్లు బియ్యం

నంబర్లు:	విజయవాడ	రు 74 06
"	కాకినాడ	74 06
అక్కుల్లు:	విజయవాడ	63 00
"	తాడేపల్లిగూడెం	63 00
"	కాకినాడ	63 00
"	అముదాలవలస	63 00
సన్నకృష్ణ కాటుకలు:		
"	తాడేపల్లిగూడెం	67 76
నంబర్లు:	చిత్తూరు	79 67
సన్నాలు:	అముదాలవలస	67 76
మొలకొలుకులు:	నెల్లూరు	74 06

వేరుశనగ

కాయలు	విజయవాడ	73 25
"	నంద్యాల	85 00
"	ఆదోని	87 50
"	విజయనగరం	70 00
పప్పు	విజయవాడ	112 00
"	నంద్యాల	112 50
"	ఆదోని	110 00
"	విజయనగరం	120 00
నూనె	విజయవాడ	215 00
"	నంద్యాల	215 00
"	ఆదోని	206 50
"	విజయనగరం	227 77

అపరాలు

కందులు	విజయవాడ	రు. 70 00
"	గుంటూరు	100 00
"	అముదాలవలస	—
మినుములు	విజయవాడ	65 00
"	గుంటూరు	75 00
"	అముదాలవలస	70 47
పెసలు:	విజయవాడ	85 00
"	గుంటూరు	92 00
"	అముదాలవలస	86 77
శనగలు	విజయవాడ	141 37

జొన్నలు

అనంతపురం	తెల్లవి	58 00
నంద్యాల	పచ్చవి	56 50

బెల్లం

అనకాపల్లి	మొదటిరకం	57 20
"	మూడవరకం	40 50
చిత్తూరు	మొదటిరకం	58 00
"	మూడవరకం	42 00

జీడిపప్పు

వేటపాలెం	అమెరికన్‌రకం	రు 690 90
"	దేశవాళీ	654 50
"	బద్దలు	590 90
"	ముక్కలు	381 80

మిర్చి

ఒకటవ రకం	గుంటూరు	215 00
రెండు 2వ రకం	"	205 00
2 దర్జ రకం		

నెయ్యి

	పల్నాడు	దేశవాళీ
గుంటూరులో	720 00	739 00

కొబ్బరికాయలు

వెయ్యి టికి ధరలు)	కొత్తవి	పాతవి
విజయవాడ	200 00	275 00
రాజమండ్రి	200 00	250 00
పాలకొల్లు	170 00	240 00

పసుపు

దుగ్గిరాలలో	కొమ్ములు	రు. 152 00
"	కొమ్మారు	168 00
"	దుంపలు	115 00
కడపలో	కొమ్ములు	140 00
"	దుంపలు	124 00

జనపనార

విజయనగరం	మొదటిరకం	85 74
	రెండవరకం	80 88
	మూడవరకం	75 00
అముదాలవలసలో	మొదటిరకం	81 33
	రెండవ రకం	77 33
	మూడవ రకం	73 38

ఎంతమంది బ్లాక్ మార్కెటీర్లపై రక్షణచట్టం ప్రయోగించారు?

స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాల విస్మరణపై తాపేశ్వరంసభలో తూర్పుగోదావరిజిల్లా కమ్యూనిస్టునాయకుల సూటిప్రశ్న

రాజమండ్రి, ఫిబ్రవరి 2

దేశ రక్షణ మూల స్తంభాలయిన ప్రజలను, విపరీతంగా ధరలు పెంచి, పీడిస్తున్న బ్లాక్ మార్కెటీర్లలో ఎంతమందిపై ప్రభుత్వం దేశ రక్షణ చట్టం ప్రయోగించిందని తూర్పు గోదావరిజిల్లా కమ్యూనిస్టు నాయకులు తాపేశ్వరం సభలో ప్రశ్నించారు. సుమారు మూడుకోట్ల ద్రవ్యంతో నిర్మాణమై, మూడు వందలకోట్ల ద్రవ్యాన్ని ఆదాయంగా తెచ్చిన ధవళేశ్వరం ఆనకట్టపై, రోడ్డుబ్రిడ్జి నిర్మాణానికి తిరిగి రైతులే ధనం చెల్లించాలంటున్న ప్రభుత్వ వైఖరిని వారు నిశితంగా ఖండించారు స్వాతంత్రోద్యమ లక్ష్యం, జమీందారులంతా మంత్రిత్వాల- నలంకరించడం కాదని నిరసించారు

తూర్పు గోదావరిజిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశం రామచంద్రపురం తాలూకా తాపేశ్వరంలో సమావేశమైన సందర్భంలో తాపేశ్వరం కమ్యూనిస్టుశాఖ అధ్వర్యాన జనవరి 28 న రాత్రి శాసనసభ్యులు శ్రీ పాలచర్ల పనసరామన్న అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది. శ్రీ పీలి వెంకటరమణ స్వాగతము చెప్పారు

సభ్యులకు భోజనాది సదుపాయాలు వగైరా ఏర్పాట్లకు సహకరించి ఆదరించిన వారికి శ్రీ పతేడ అప్పారావు కృతజ్ఞత తెలియచేశారు.

అనంతరం శ్రీ లజపతిరాయ్‌ని సంస్మరిస్తూ సామ్రాజ్యవాదం పూర్తిగా నాశనం అయేవరకూ కృషి చేస్తామన్న తీర్మానాన్ని సభలో ఆమోదించారు.

జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీ ముళ్ళపూడి సూర్యానారాయణ మాట్లాడుతూ ఇలా అన్నారు:

"పంజాబ్ సింహం లాలాలజపతిరాయ్, భగత్‌సింగ్, చంద్రశేఖర ఆజాద్, బులుసు సాంబమూర్తి, ఆంధ్రకేసరిప్రకాశం మొదలైన దేశభక్తులు అపారత్యాగాలు చేసింది భావిభారత పౌరుల సౌఖ్యంకోసమన్న విషయాన్ని మనం మరిచిపోరాదు. అంతా సౌఖ్యంగా వుండాలనే అన్ని పార్టీలూ చెపుతున్నాయి. ఆ నాడు స్వాతంత్ర్య పోరాటం జరిపింది. బొబ్బిలి, తుని,కపిలేశ్వపురం రాజాలని పెత్తచేయమని కాదు. జాతీయోద్యమంనాడు ప్రజలకు అన్ని సౌకర్యాలూ చేకూడుస్తామని చేసిన వాగ్దానాలు ఈనాడు పరిపూర్తి చేస్తున్నారా అన్నది పరిశీలించాలి. తమ నిరంకుశ పరిపాలన ఇక శాశ్వతంగా వుంటుందనీ, కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది కాబట్టి ఇక కాంగ్రెసును ఏమీ చేయలేదనీ వారు అనుకుంటున్నారు.

పైగా పార్టీనుండి విడిపోయిన వారిని ప్రభుత్వం అరెస్టులు చేస్తోంది. చాలా ప్రమాదకరమైన చర్యలకు వారు పూనుకుంటున్నారని ఆ అరెస్టులకు సాకులు చెపుతోంది. నిజంగా ప్రభుత్వంవద్ద అలాంటి సమాచారం వుంటే కోర్టులలోపెట్టి వారిని విచారించవచ్చుకదా! గతంలో 1950 వరకూ వేలాదిమందిని ప్రభుత్వం కాల్చి చంపింది. అనాడు ఏదో పెద్దప్రమాదం తెచ్చిపెట్టబోతున్నారని ప్రభుత్వం ప్రచారంచేసింది. కాని ఏసాక్ష్యమూ చూపలేదు. ఈనాడూ అలాగే చెపుతోంది. దేశంలో ధనికుల అసరా తీసుకొని ప్రభుత్వం ఈ నిర్బంధాలు సాగిస్తోంది.

ధరలు విపరీతంగా పెరిగాయి ధరలను విపరీతంగా పెంచే వేలాది బ్లాక్ మార్కెటీర్లలో ఎంతమందిని ఈ ప్రభుత్వం అరెస్టు చేసింది? దేశ రక్షణ, క్షేమం ప్రమాదంలో పడితే దేశ రక్షణకు మూల స్తంభాలైన ప్రజలను పీడించే తిండి దొంగలను, దొంగ నిల్వదారులను ఎందుకు అరెస్టు చేయలేదు. చీలిపోయిన పార్టీవారిని చైనా అనుకూలురని అరెస్టు చేశామంటున్నారు. మరి రాజగోపాలాచారి, జయప్రకాశ్ నారాయణ్‌లు కాశ్మీరులో సగం పాకిస్తాన్‌కి ఇచ్చివేయమంటున్నారు ఇది దేశ ద్రోహం కాదా? మరి దేశ రక్షణ దృష్టితో వారిని ఎందుకు అరెస్టు చేయలేదు

కాంగ్రెసుకు ఆ దమ్ములు లేవు కాని చైనా బూచిని చూపి పోటీ పార్టీవారి అరెస్టులకు పూనుకుంది. పట్టపగలు గాంధీజీని కాల్చి చంపిన హంతకుణ్ణి బహిరంగ విచారణ చేశారే అలాంటపుడు ఈ అరెస్టుకాబడిన వారిని ఎందుకు విచారించరు?

పార్టీలో చీలికలు విచారకరం

కమ్యూనిస్టుపార్టీలో చీలికలు రావడం విచారకరమే? పార్టీలో 1952 నుండీ విభేదాలున్నాయి శ్రీ సుందరయ్య ప్రభృతులు మనకు స్వాతంత్ర్యం రాలేదన్నారు.

దేశంలో ఏదో ఒక మేరకు అభివృద్ధి జరుగుతుందా లేదా? ఈ ప్రభుత్వాన్ని ఎలా చూడాలి? అన్నదాని పైభేదాలు వున్నాయి దేశ సేవకు, క్షేమానికి ఏది దగర మార్గమనే దానిపై విభేదాలువచ్చాయి 40సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీ ప్రజల సేవ చేస్తోంది కాబట్టే నేడు దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా వుంది.

ప్రభుత్వంమాత్రం చీలికలను మరి తపెంచి, విభజించి పరిపాలించే పద్దతిని అవలంబిస్తోంది. 1962 లో పార్టీ అంతా కలిసి వున్నప్పుడు మాకు ఎన్నికల గుర్తుగా కత్తిసుత్తిని అడిగాం. కాని జండామీద గుర్తుల ఏ పార్టీకీ ఇవ్వనని ప్రభుత్వం నిరాకరించింది. కాని ఈనాడు పార్టీలో చీలికలు వచ్చాక పోటీపార్టీ వీరికి కత్తిసుత్తిని ఎన్నికల గుర్తుగా ఇచ్చారు ఈ చర్య కేవలం జనంలో గందరగోళం చీలిక రేకెత్తించడానికి ఉద్దేశించినదికాదా?

ఏ అభిప్రాయ భేదాలున్నా పార్టీ లోపల పరిష్కరించుకోవాలన్నది మరిచిపోయి బయటికి పోయి తామే విప్లవకారులమని, నిజమైన కమ్యూనిస్టుపార్టీ తామేనని విడిపోయిన వారంటున్నారు. ప్రజలను సమీకరించకుండా, ఏమీ జరగకుండా అరెస్టులు జరిగితే విప్లవకారులౌతారా? ఎవరు పెద్ద పార్టీమో చరిత్ర తేల్చివేసింది. పార్టీ లోపల మెజారిటీని ఒప్పించలేక వారి [illegible] బయటికి పోయారు. ప్రజలందరకు మాత్రం తమది కమ్యూనిస్టుపార్టీ అని చెప్పుకుంటూ ప్రభుత్వానికి మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ అని వ్రాసుకొని ఎన్నికల గుర్తును సంపాదించారు ఇపుడు నిజమైన కమ్యూనిస్టుపార్టీ ఏదో తేలిపోయింది.

ఇంక కమ్యూనిస్టులు ఏమీ చేయలేరని అసలు కమ్యూనిజంరాదని కొందరంటున్నారు. కాని కమ్యూనిస్టు రష్యా భారత దేశానికి చేస్తున్న సహకారంతోనే తన కాళ్ళపై తాను నిలబడగలిగింది అన్ని రంగాలలోను అమెరికా కన్న రష్యా అధిక్యతను సంపాదించి, ధీమా కలిగించిన తరువాతనే శ్రీ నెహ్రూ రష్యాతో సహకరించారనేది మరచిపోకూడదు. మన దేశంలో వివిధ పరిశ్రమల నిర్మాణానికి సామ్రాజ్యవాదులు ఆదిలో తిరస్కరించారు. ఆ తరువాతనే రష్యా రాజకీయ షరతులు లేకుండా అన్ని రంగాలలోనూ మన కాళ్ళమీద మనం నిలబడాలని సహకరిస్తోంది

తమ దేశంలోని పెట్టుబడిదారులకు, భూస్వాములకు, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడి సోషలిజం నిర్మించిన దేశాన్నుండి ఈ సహకారమంతా వచ్చిన సంగతి మరచిపోరాదు

కాబట్టి ఏ మార్గం అవలంబిస్తే పెట్టుబడిదారీ, భూస్వాముల విధానం పోతుందో ఆమార్గం అవలంబించాలని కమ్యూనిస్టుపార్టీ చెపుతోంది. మనం ఒక నిర్దిష్ట కార్యక్రమంతో ముందుకు పెళ్ళిననాడే దేశానికి క్షేమం కలుగుతుంది. అందుకుబ్యాంకులను జాతీయంచేయాలి ఆహార ధాన్యాల టోకు వ్యాపారాన్ని ప్రభుత్వం చేపట్టాలి. వాటి లాభాలద్వారా ప్రజా అవసరాలు తీర్చే కార్యక్రమాన్ని నిర్వహించాలి. కులమత తత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలి పై కార్యక్రమం ఆదేశ హితాన్ని కోరే అందరూ సమైక్య కృషి చేసిననాడే సాధ్యమౌతుంది.

శ్రీ వెంకట్రామరాజు ప్రసంగం

జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ వెంకట్రామరాజుగారు ఇలా అన్నారు:

"110 ఏండ్లక్రితం మూడుకోట్లతో నిర్మించబడిన ధవళేశ్వరం ఆనకట్టవల్ల ప్రభుత్వానికి రైతాంగంనుండి ఇంతవరకూ పన్నులరూపంలో వచ్చిన ఆదాయం దరిదాపు మూడువందలకోట్ల రూపాయలు, పైగా ఇటీవల భూమిశిస్తును రెట్టింపు వసూలు చేస్తున్నారు. ఇంక వేరే డబ్బు బ్యారేజి నిర్మాణానికి రైతాంగం అదనంగా చెల్లించనక్కరలేదు. ఈ విషయాన్నే రైతాంగం నుండి ప్రభుత్వానికి తెలియచేయబడింది. బ్యారేజి నిర్మాణాన్ని వెంటనే సాగించేలా రైతాంగం తీవ్ర కృషిచేయాలి.

ఎంతో మంచి పంటలు పండే ఈ ప్రాంతములో కూడా సం॥లో మూడు మాసాలు మినహా తక్కిన నెలలన్నీ తిండికి కటకటలాడుతున్నారు. అలాంటి స్థితిలో బ్యారేజీ నిర్మాణం సాగితే మరి రెండు లక్షల యకరాలలో దాళవా పంటను పెంచడానికివీలవుతుంది. అలాంటి బ్యారేజి నిర్మాణానికి రైతులు 250 కోట్ల రూపాయిలు ఇవ్వనేకవడతామని అంటూ శ్రీ బ్రహ్మానందరెడ్డి సమస్యను వెనక్కినెట్టే ప్రమాదాన్ని తెచ్చిపెట్టారు. ఇలాంటి ముఖ్య సమస్యపై ప్రభుత్వాన్ని లొంగదీసి ఎందుకు బ్యారేజి కట్టించుకోలేక పోతున్నాం?

దళారీల, దోపిడీదారుల సరసన ప్రభుత్వం

ధనియాలు మినుములు పెసలను రైతు వంద రూపాయలలోపు ధరలకే అమ్ముతున్నారు. బజారులో వాటి ధర రెండు వందల రూపాయల వరకూ పెరిగిపోతుంది. ఆహార ధాన్యాలను కుంచం అయిదు రూపాయలకు బజారులో కొనే ప్రజలు ఈధర రైతుకే ముడుతోందనుకొంటున్నారు రైతునినిందిస్తున్నారు. కాని ఈ హెచ్చుధర మధ్య దళారీలకు చేరుతోంది. పండించేవాడికి ధర గిట్టక, కొనే వాడికా చౌక ధరకు దొరకక మధ్య దళారీలు దోచుకుంటున్నా విషయం ప్రభుత్వానికి తెలియదా? ఈ ప్రభుత్వం ప్రజలు, కార్మికులు, రైతుల పక్షన గాక వ్యాపారస్తుల పక్షన దళారీల పక్షాన నిలబడి వుంది. దీనిని రైతు అదుపులో పెట్టాలి.

ఇలా వ్యాపారుల అండను ప్రభుత్వం ఎందుకు చేరుతోందనేది గ్రహించాలి. దీనిని అదుపులోనికి తీసుకురావడానికి ఒక్క మార్గం రైతులు సంఘటితం కావాలి.

తర్వాత జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ పేరపాటి వెంకటావు ప్రసంగిస్తూ ధరలు ప్రజలనెలా కలవర పెడుతున్నదీ వివరించారు.

దేశవ్యాపితంగా భారత్‌బంద్ జరిగబోతోందని దానికి ప్రభుత్వం కదలకపోతే సత్యాగ్రహాలు చేయడానికి కార్మికులు ఆలోచిస్తున్నారని గ్రామాంలోని రైతుల కళ్ల మూసుకొని వుండే సమస్యలు పరిష్కారం కావని హెచ్చరించారు.

అధ్యక్షులు శ్రీ పనసరామన్న సభలోనుండి వచ్చిన ప్రశ్నలకు జవాబు లిచ్చారు.

బహిరంగసభ అనంతరం శ్రీ జూనియర్ నాజర్‌దళం వారిచే బొబ్బిలియుద్ధం బుర్రకథ చెప్పబడింది. (వి. వి.)

ఆహారధాన్యాలలో కల్తీ, మోసాలపై తూర్పుగోదావరి జిల్లాకలెక్టరు నిశిత విమర్శ

గత్యంతరం లేక ప్రజలు సహిస్తున్నారని ఇలాచేయడం ప్రమాదకరమని హెచ్చరిక

రాజమండ్రి, ఫిబ్రవరి 3

"ఆహార పదార్థాలలో కల్తీ అంటే ప్రజల ప్రాణాలతో చెలగాట మాడటమే ఈ విధానమే కొనసాగితే ప్రజలు మూకుమ్మడిగా వ్యాపారస్తులపై తిరుగబడే రోజు అట్టే దూరంవుండదు" అని ఆహార ధాన్యాల వ్యాపారులపై తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ శ్రీ అసదుల్లా సయీద్ నిశితమైన విమర్శచేసి హెచ్చరించారు

రాజమండ్రి వాణిజ్యమండలివారు తమకు సమర్పించిన విజ్ఞప్తికి సమాధానమిస్తూ ఆయన పై విధంగా హెచ్చరించారు

సభకు వాణిజ్యమండలి ఉపాధ్యక్షుడు శ్రీ గంటా బాపయ్యచౌదరి అధ్యక్షత వహించారు.

కలెక్టర్ తమ ప్రసంగంలో ఇలా అన్నారు.

"నిర్మొహమాటంగా చెప్పాలంటే పెద్ద వ్యాపారస్తులూ చిన్న వ్యాపారస్తులూ కూడా తమ మీద ఆధారపడ్డ ఉత్పత్తిదారుణ్ణీ వినిమయదారుణ్ణీకూడా దగా చేయడానికే ప్రయత్నిస్తున్నారు. నేనిలా అన్నానంటే వ్యాపారస్తు లంతా దగాకోరులనీ ఉద్యోగస్తులంతా మంచివారనీ కాదు. ఉద్యోగస్తులలోకూడా సమాజంలోఅన్ని వర్గాలలో వలెనే చెడ్డవారూ వుంటారు. అయితే ఒక వ్యాపారస్తుడిమీద వారు తీవ్రంగా శోధన చేశారా అంటే అనేక పర్యాయాలు పన్నులు ఎగవేయటం తప్పుడులెక్కలు వ్రాయడం, ఆ వ్యాపారస్తుడు చేసివుంటాడు.

నమూనాకు ఒక సరుకునిచ్చి తీరా సరుకు సప్లయి చేసినపుడు అధ్వాన్నపు సరుకువిచ్చిన కేసులు అనేకం ఉన్నాయి మన వ్యాపారస్తుల లోని ఈ మనస్తత్వంవల్ల మన దేశానికి విదేశీ మార్కెట్లు పోయాయి మన జిల్లానుండి ఇతరరాష్ట్రాలకిఎగుమతైన బియ్యంలో దుమ్ము, రాళ్లు తప్ప ఎందుకూ పనికిరానివి ఎగుమతి అయ్యాయని ఇటీవల జరిగిన ఒక కలక్టర్ల సమావేశంలో వినూపించే సరికి నేను చాలా సిగ్గుపడవలసి వచ్చింది. చెక్కింగ్ పోస్టులు ఏర్పరచిన, లెవెల్ క్రాసింగులవద్ద బస్సుపైగాని లారీలపైగాని వెళ్ళే సరుకులో ఎంతోకొంత [illegible] ఉంటేనేకాని అక్కడ వున్నవారికి సంతృప్తి కలగటంలేదు ఆహార సరుకులలో కల్తీ అంటే ప్రజల ప్రాణాలతో చెలగాట మాడడమే. మనమిచ్చిన సరుకులెంత చెడ్డవైనా, మనం ఏ ధరకమ్మినా, ప్రజలు గత్యంతరంలేక సహిస్తున్నారుకదా అని ఆ విధానమే కొనసాగిస్తే ప్రజలు మూకుమ్మడిగా వ్యాపారస్తులపై తిరుగబడే రోజు అట్టేదూరం వుండదు సోషలిస్టు పద్ధతి సమాజస్థాపన మనదేశంయొక్క ధ్యేయమని వ్యాపారస్తులు గుర్తుంచుకొని వినిమయదార్లతో మసిలెలగాలి.

ముందుముందు ప్రతిచోటా బ్లాక్ మార్కెట్ చేసేవారల లిస్టులు తయారౌతాయి వ్యాపారస్తుడి పేరైనా ఒకమాటు ఆ జాబితాలో ఎక్కిందంటే ఆ వ్యాపారస్తుని వ్యాపారం దానితో ఆఖరైనట్లే."

అధ్యక్షుడు కలెక్టరుకు విజ్ఞప్తి సమర్పిస్తూ కొంతమంది సేల్సుటాక్సు ఉద్యోగులు అతి ఆరాధకంగా అక్రమంగా, దారుణంగా, అవమానకరంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు ఇటీవల శ్రీ పాదర్తి కృష్ణమూర్తిగారి కొట్టుమీద జరిగినదాడి సవివరంగా పేర్కొన్నారు. గోదావరి తీరంలో వార్ఫులేక ఎగుమతి దిగుమతులుచేస్తున్నందున వర్షాకాలంలో బాధి బందతోవుంటూ దనీఅ స్థలంపై పెత్తనం చెలాయించడానికి మునిసిపాలిటీ రైల్వే పి. డబ్ల్యు డి. హైవేస్ శాఖలు పోటీపడతాయే కాని దానిగురించి సమస్య వచ్చే ఉప్పటికి ఒక్కరూ పట్టించుకోరని విమర్శించారు. ఫిబ్రవరి ఒకటినుండి ఆనకట్టపై వాహనాలను వసులుచూ పెద్దపెద్ద ప్యాసింజర్ బస్సులూ స్టేటు ట్రాన్సుపోర్టు బస్సులను వదులుతూ మూడు టన్నులు మించినబరువుతో లారీలువెళ్ళడానికివీలులేదనీ ఆంక్షపెట్టడంవల్ల లారీట్రాన్సుపోర్టర్లకుచాలానష్టం వాటిల్లుతుందన్నారు రాజమండ్రిలో ఏకైక విశాలమార్గమైన శ్యామలా ఆ గుడిసీధిని లారీలను వెళ్ళనివ్వక పోవడం చాలా అక్రమ మన్నారు.

కార్యదర్శి శ్రీ శ్రీకాకోళపు సత్యానందం శ్రీయుతులు దానరి సుబ్బారావు కొవ్వూరి నాగిరెడ్డి, పుసులూరి కోదండరామయ్య దాట్ల బలరామరాజు (ఎం పి.) డాక్టర్ వాసిరెడ్డి ప్రభాకరరావు, అవాల వెంకటప్పారావుగార్లు, కూడా ప్రసంగించారు.

సత్యానందం వందన సమర్పణ చేశారు. (వి వి)

కేంద్ర ఉద్యోగుల కోర్కెల దినోత్సవం

18 వ తేదీన సభలు, ప్రదర్శనలు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 3

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులంతా ఈ నెల 18 వ తేదీన సభలూ, సమావేశాలూ, ప్రదర్శనలు జరిపి తమ కోర్కెలను ప్రభుత్వానికి తెలియజేయాలని నిర్ణయించారు

జనవరి 22 న ఢిల్లీలో కేంద్ర ఉద్యోగులకు సంబంధించిన 22 సంస్థలు కలిసి ఉమ్మడిగా యీ నిర్ణయం తీసుకున్నవి.

దాస్ కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ప్రకటించిన తాత్కాలిక భృతి గురించి యీ సమావేశం సంతృప్తి ప్రకటించింది. "అయితే వుద్యోగుల నిజవేతనాల స్థాయి పడిపోకుండా ప్రభుత్వం తక్షణం అనేకచర్యలు తీసుకోవలసి వుంది" అని తెలియజేసింది

ధరల పెరుగుదలను అరికట్టేటందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని యీ తీర్మానం కోరింది.

ప్రస్తుత కరువుభత్యం సూత్రం ఉద్యోగులకు బొత్తిగా న్యాయం చేకూర్చడంలేదని దాస్ కమిషన్ చేసిన నిర్ధారణను సమావేశం అభినందించింది ఉద్యోగుల సంఘాలతో సంప్రతించి ప్రభుత్వం సహేతుకమైన కరువు భత్యం సూత్రాన్ని రూపొందించాలని డిమాండు చేసింది

తక్కువ వేతనాలు తెచ్చుకునే వుద్యోగులకు మంజూరుచేసిన కరువుభత్యం పట్ల సమావేశం తీవ్ర ఆశాభంగాన్ని వెల్లడించి యీ క్రింది కోర్కెలను ప్రకటించింది:

1 క్రింది తరగతి వుద్యోగులకు పెరిగిన ధరలకు సరిపడా పూర్తి కరువుభత్యం ఇవ్వాలి.

2 185 పాయింట్లవరకు పూర్తి కరువు భత్యాన్ని లెక్కగట్టి 1964 సంవత్సరం ఫిబ్రవరి నుండి చెల్లించాలి

3. వినిమయ వస్తువుల ధరల సూచికలోని లోపాలను సరిదిద్దాలి రాష్ట్రాల స్థాయిలోగూడా యీ సర్దుబాటు జరగాలి

4. కరువు భత్యాన్ని వేతనంలోభాగంగానే పరిగణించాలి

15 వ లేబర్ కాన్ఫరెన్సు నిర్ధారణ చేసిన వేతన నిర్ణయ సూత్రాలను నిరాకరించి రెండవ పే కమిషన్ వుద్యోగులకు తీరని అన్యాయం చేసింది. ఈ పరిస్థితిని చక్కబరిచేటందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండు చేసింది.

జాయింట్ కన్సల్టేటివ్ యంత్రాంగాన్ని యేర్పరచడంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని ఆలిండియా ఆడిట్, ఎకౌంట్సు అసోసియేషన్‌ను గుర్తించడానికి ప్రభుత్వ నిరాకరణను విమర్శిస్తూ సమావేశం మరో తీర్మానం చేసింది.

1962 అక్టోబరు దరిమిలా పెంచిన పని గంటలను రద్దుచేయాలని కోరుతూ సమావేశం మరో తీర్మానం ఆమోదించింది.

ఆదాయాన్ని సమంగాపంచుకొనుటకు షైలర్ల నిర్ణయం

పెదకళ్లేపల్లి, ఫిబ్రవరి 3

పెదకళ్లేపల్లి గ్రామములో శ్రీ అల్లాడ సత్యనారాయణ అధ్యక్షతక్రింద గ్రామములో ఉన్న షైలర్లందరు సమావేశమై, సంఘీభావము నెలకొల్పవలెననే ఉద్దేశ్యముతో 20 మంది షైలర్లు ఒకసంఘముగా ఏర్పడి, ప్రతినెలవచ్చు ఆదాయమును సమానముగా పంచుకొనుటకు ఏర్పాటు చేసుకొన్నారు.

ఈ సంఘమునకు 1965 వ సంవత్సరానికి శ్రీ అల్లాడ సత్యనారాయణ అధ్యక్షులుగను, శ్రీ దారపురెడ్డి గజేంద్రరావు కార్యదర్శిగను ఎన్నుకోబడినారు.

మదనపల్లె

మదనపల్లెతాలూకా హోమియోపతివైద్యుల సంఘమును శ్రీ డాక్టర్లు కె కృష్ణారావు, ఆర్ బయ్యారెడ్డి, బి. కృష్ణమూర్తి, సి. వెంకటరమణ, టి సాంబమూర్తిగార్లతో అర్గనైజింగ్ కమిటీ ఎన్నికయింది.

శాసనసభ స్పీకర్, స్వపర భావనాదూరుడు కావాలి

ఆ పదవికవసరమైన దక్షత, బాధ్యతలపై నర్సాపురంలో స్పీకర్ శ్రీ సుబ్బారెడ్డి ప్రసంగం

నర్సాపురం, ఫిబ్రవరి 3

శాసనసభ స్పీకర్ సమయస్ఫూర్తి దక్షతలతోపాటు స్వ-పర భేద భావనాదూరుడుగా ఉండవలెనని ఆంధ్ర శాసనసభ స్పీకర్ శ్రీ బి. వి. సుబ్బారెడ్డిగారు నర్సాపురం కౌన్సిల్ వారొనగిన సన్మానానికి ప్రత్యుత్తరమిస్తూ తెలియచేశారు

శాసనసభ స్పీకర్ శ్రీ బి వి సుబ్బారెడ్డి గారికి పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురం మున్సిపాలిటీవారు జనవరి 29 న సన్మానం చేశారు

సభకు మున్సిపల్ చైర్మన్ శ్రీ కురిశేటి రామకృష్ణమూర్తిగారు అధ్యక్షత వహించారు. స్థానిక శాసనసభ్యులు శ్రీ పరకాల శేషావతారంగారు శ్రీ సుబ్బారెడ్డిగారిని పరిచయం చేశారు శ్రీ సుబ్బారెడ్డిగారు మాట్లాడుతూ స్పీకరుకు ఓర్పు, సమయస్ఫూర్తి. సభ్యుల మనస్తత్వాన్ని అర్థంచేసుకొనే దక్షత వుండాలని అన్నారు

సమయస్ఫూర్తి గురించి ఉదహరిస్తూ, ఆయన ఇలా అన్నారు: ఒకసారి కామన్సు సభను డిప్యూటీ స్పీకరు నడుపుతూ వుండగా. పెద్ద అరుపులు, కేకలతో అల్లరి చెలరేగింది డిప్యూటీ స్పీకరు కంట్రోలు చేయలేక ఉక్కిరిబిక్కిరి అయిపోతూవున్నారు ఇంతలో స్పీకరు వచ్చినంతనే సభ చల్లబడింది స్పీకరు సభ్యుల్ని ఏమీ అనలేదు క్రమశిక్షణను గురించి ప్రబోధం చేయలేదు ప్రశాంతంగా 'నన్ను క్షమించండి ఈ అల్లరికి కారణం నేను సభలో లేకపోవడమే' నని పూరుకొన్నారు. దీనితో సభ్యులు సిగ్గుపడిపోయారు

"ఒక్కొక్క సమయంలో ఆ మాత్రంమాట కూడా అనకుండా తీక్ష్ణ దృక్కులతో సభను చూస్తూ కంట్రోలు చేయవచ్చు ఏ సమయంలో ఏది అవసరమో అది మెలకువతో అమలు జరుపుతూ సభా కార్యక్రమాన్ని నడపాలి ఒక్కొక్కసారి కొందరిని బయటకు పంపవలసిన అవసరం వస్తుంది, స్వ-పర అనే భేదం లేకుండా మందలించవలసిన అవసరంవస్తుంది అన్నారు.

ఇంతవరకు తనకు ఏ ఒక్కసభ్యుణ్ణీ బయటకు పంపే అవసరం కలుగలేదని, ఇకముందు కూడా అటువంటి స్థితి కలుగదని ఆశిస్తున్నామని, ఈ విషయంలో ప్రతిపక్ష, ప్రభుత్వపక్ష సభ్యుల సహకారం తనకు ఎల్లప్పుడూ వుంటుందని కోరుకుంటున్నామని ఆయన అన్నారు

మున్సిపాల్టీ సన్మానం అనంతరం నర్సాపురంకాలేజీ సాంస్కృతిక ఉత్సవాలకు ప్రారంభోత్సవం చేశారు స్పోర్ట్సులో గెలిచినవారికి బహుమతులు పంచారు.

ఆచంటకమ్యూనిస్టుశాసనసభ్యులు శ్రీ వడాల శ్యామసుందరరావు, ఆయన భార్య అగ్నిప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెల్సుకొని వారిని పరామర్శించారు.

ఇబ్రహీంపట్నం ప్రాంత క్వారీ కార్మికుల కూలి పెంపుదల

విజయవాడ ఫిబ్రవరి 3

ఇబ్రహీంపట్నం ప్రాంత క్వారీ కార్మిక సంఘాధ్యక్షులు శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు యం. యల్. ఏ: క్వారీ కంట్రాక్టర్ల సంఘాధ్యక్షులు శ్రీ గోపాలదాసు వీరయ్యగారు సెంట్రల్ కన్సీలియేషన్ ఆఫీసరుతో కార్మికుల కూలి రేట్లు పెంపుదల విషయంలో ఒక అంగీకారం కుదుర్చుకొని సంతకాలు చేశారు.

వివిధ తరహా పనులకు 45వ పైసలు మొదలు 2 రూపాయల వరకు కూలీలు పెరిగాయి. పెరిగిన కూలీలు ఫిబ్రవరి 1 వ తేదీ నుండి అమలులోనికి వస్తాయి.

వైద్యం, ప్రసూతి అలవెన్సు ప్రమాద నష్ట పరిహారం, విశ్రాంతి గృహం ఏర్పాట్లు వగైరా సౌకర్యాలనుకూడా చట్టంప్రకారం అమలు జరుపుటకు కంట్రాక్టర్లు అంగీకరించారు. ఈ సంప్రతింపులలో కార్మికసంఘం తరఫున కార్మిక ప్రతినిధులు, కంట్రాక్టర్లంతా పాల్గొన్నారు

కొద్దికాలంక్రిందట ఇబ్రహీంపట్నం, కొండపల్లి, కొండూరు, చెముటూరు. జూపూడి కోతనకొండ, దొనబండ, మూలపాడు ప్రాంతాలలో పనిచేస్తున్న సుమారు 2000 మంది క్వారీకార్మికులు సమావేశమై యూనియన్‌కు శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు (యం. యల్. ఎ.) గారిని అధ్యక్షులుగాను, ఉపాధ్యక్షులుగా శ్రీ కుంచాల హనుమంతుగారిని, కార్యదర్శిగా శ్రీ దేవళ్ళ వెంకటయ్యగారిని, కోశాధికారిగా శ్రీ యూర్ల మహంకాళిగారిని వివిధ ప్రాంతాలనుండి మరొక 80 మందిని కార్యవర్గ సభ్యులుగాను ఎన్నుకొన్నారు. దరిమిలాయూనియన్ తరఫున రేట్లు పెంచాలని, వైద్య, ప్రసూతి, విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని తీర్మానాలుచేసి,కంట్రాక్టర్ల సంఘానికి పంపారు తర్వాత సంప్రదింపులు జరగటం చివరకు 29-1-65 న కేంద్ర కన్సీలియేషన్ ఆఫీసరు (విశాఖపట్నం) సమక్షన విజయవాడలో పై ఒప్పందం కుదిరింది.

గని కార్మికులకు రెండవ దఫా తాత్కాలిక భృతి

ధర పెంచితేతప్పవీల్లేదని యజమానుల పేచీ

న్యూఢిల్లీ ఫిబ్రవరి 1

కేంద్ర వేతనసంఘం యిటీవలనే గని కార్మికులకు రెండోదఫా తాత్కాలిక వేతనం హెచ్చింపు సిఫార్సుచేసింది ఈ సిఫార్సు ఫలితంగా వారికి రోజుకు 19 పైసల చొప్పున అదనంగా వేతనం లభిస్తుంది అయితే, బొగ్గుధర పెంచడానికి అనుమతించితేతప్ప తాము 'అదనపు భారా'న్ని నెత్తిన వేసుకోబోమనే ధోరణిలో యజమానులు మొరాయిస్తున్నట్లు తెలుస్తున్నది. యాతావాతా, కార్మికుల వేతనాల్లో యే కాస్తా కూస్తా పెంచవలసి వచ్చినా, ఆ భారాన్ని యావత్తూ వినిమయదారుల పైకి నెట్టివేయ జూస్తున్నారు.

వేజ్‌బోర్డు సిఫార్సును భారత ప్రభుత్వం ఆమోదించింది. అయితే యీ రెండవ దఫా యిచ్చే వేతనం హెచ్చింపును, ఖచ్చితంగా ఫలానా తేదీనుండి అమలు జరపాలని ఆదేశించకుండా సాధ్యమైనంత త్వరలో అమలు జరపాలని మాత్రమే చెప్పి వూరుకున్నది.

ఈ మధ్యకాలంలో ధరలు విపరీతంగా పెరిగిన దృష్ట్యానూ, 1964 అక్టోబరు 8 వ తేదీన తమకు ప్రభుత్వం నివేదించిన బోనస్ పథకం గురించి కూడా తాము దర్యాప్తు జరిపి తుది నివేదిక యివ్వడం మరికొంత ఆలస్యమయ్యే దృష్ట్యానూ, యీ తాత్కాలిక సిఫార్సు (రెండవ తాత్కాలిక భృతి) చేస్తున్నట్లు వేజ్ బోర్డు చెప్పింది.

వేజ్‌బోర్డు మొదటిసారిగా యిచ్చిన తాత్కాలిక భృతి (రోజుకు 37 పైసలు) 1963 మార్చినుండి అమల్లోకి వచ్చింది.

మొదటిదఫా తాత్కాలిక భృతిని ఖచ్చితంగా ఫలానా తేదీనుంచి అమలు జరపాల్సిందేనని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పారి అలాంటి కాలనిర్ణయం లేకపోవడం యజమానులకు అలుసైంది.

1958 లో బొగ్గుధరల పునఃపరిశీలన కమిటీ చేసిన నిర్ణయం ప్రకారం బొగ్గు, కోక్ ధర పెంచితేతప్ప వేతనాలు పెంచడం సాధ్యపడదని బోర్డులోని యజమానుల ప్రతినిధులు వాదిస్తున్నారు

పెరుగుచున్న ధరలకు అనుగుణంగాలేనిగ్రాంట్లు

పలుపాఠశాలల్లో మధ్యాహ్న భోజనాల బంద్?

కొత్తపేట, ఫిబ్రవరి 3

ప్రభుత్వంవారు ఇచ్చేగ్రాంట్లు కిట్టుబాటుకాక జిల్లాలోని వెల్ఫేరు పాఠశాలల్లో పలుచోట్ల మధ్యాహ్నభోజనాలు నిలిపివేయబడినట్లు తెలుస్తూంది. అది ఆంధ్రుల విద్యాభివృద్ధికై 1950 సంవత్సరము అక్టోబరునుండి వెల్ఫేరు పాఠశాలలలో మధ్యాహ్నభోజనాలు ఏర్పాటు అయినాయి. ధాన్యం బస్తా 1 కి రు 12.14లు వుండి అప్పటి ధరవరలను అనుసరించి విద్యార్థి ఒకంటికి 0-2-6 చొప్పున నిర్ణయించారు. బస్తా 1 కి రు 33 లు ఉన్న నేటికీకూడా ఆ 0-2-6 లో మార్పులేదు. ఇందువల్ల అనేక పాఠశాలల్లోమధ్యాహ్నభోజనాలుమానివేసారు.

వెల్ఫేరు పాఠశాలల పరిస్థితి నానాటికీ దిగజారుతూంది. సోషల్ వెల్ఫేరువారి అజమాయిషీలో ఉన్నంతకాలం గుడ్డిలో మెల్లగానైనా వుండేది వీటిస్థితి, పర్నిచర్, పాఠశాలభవనం వగైరాల గురించి కొంతపట్టించుకోవడం ఉండేది. ఇటీవల వీటిపై అజమాయిషీ సమితులకు సంక్రమించి నప్పటి నుండి ఉపాధ్యాయులకు జీతాలివ్వడం మినహా పాఠశాలకు కావలసిన పుస్తకములుగాని, పర్నిచర్‌గాని సమకూర్చబడుట లేదని తెలుస్తూంది, అనేక వెల్ఫేరు పాఠశాలలు సకాలంలో మరమ్మతులులేక భవనాలు శిథిలమైన కారణంగా గ్రామస్తుల అరుగులపై చదువులు సాగిస్తున్నట్లు వినికిడి (వి. వి.)

అమలాపురం పాలు, పెరుగు ఉత్పత్తి, వర్తక సంఘం

అమలాపురం, ఫిబ్రవరి 3

అమలాపురం పాలు, పెరుగు ఉత్పత్తి వర్తక సంఘ వార్షిక మహాసభ అమలాపురం శెట్టిబలిజ సంఘ గ్రంథాలయంలో శ్రీ దామ్మేటి నాగేశ్వరరావు (అడ్వకేట్) గారి అధ్యక్షతను జనవరి 25 న జరిగింది. సమావేశంలో ఇంత వరకు అధ్యక్షులుగావున్న శ్రీ కె. వీరరాఘవులు గారు గతంనుండి సంఘం సాగించిన కార్యకలాపాలు వివరించారు. పాల వ్యాపారులకున్న ఇబ్బందులుగూర్చి వారు ఐక్యంగా సంఘటిత శక్తితో వారి సమస్యల పట్ల కృషిచేస్తూ ఐకమత్యంతో ముందుకు సాగవలసిన అవసరాన్ని గూర్చి తాలూకా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ చింతపల్లి కృష్ణమూర్తి. అధ్యక్షత వహించిన శ్రీ దామ్మేటి నాగేశ్వరరావుగార్లు ఉపన్యసించారు.

అనంతరం ఈ క్రిందివారిని ఏకగ్రీవంగా కమిటీగా ఎన్నుకున్నారు అధ్యక్షులు శ్రీ నల్లా శ్రీరాములుగా (తాలూకా రైస్‌మిల్ అసోసియేషన్ కార్యదర్శి), ఉపాధ్యక్షులు శ్రీ మంతెన వెంకటపతిరాజు, కార్యదర్శి శ్రీ గుబ్బల నాగేశ్వరరావు సహాయ కార్యదర్శి శ్రీ లంకలపల్లి సూర్యనారాయణ, కోశాధికారి శ్రీ అప్పారి నారంశెట్టిగార్లు వారుగాక మరో పదిమంది కమిటీ సభ్యులు

ప్రభుత్వంవారు ఎటి విచారణలేకుండా పోటీ కమ్యూనిస్టుపార్టీవారిని అరెస్టుచేసి నిర్బంధించినందుకు ప్రభుత్వ చర్యకు నిరసన తెలియచేస్తూ సమావేశం తీర్మానించింది.

ఒంగోలులో శ్రీ త్యాగరాజోత్సవాలు

ఒంగోలు, ఫిబ్రవరి 3

ఒంగోలులో శ్రీ త్యాగరాజ భక్త సమాజం వారి అధ్వర్యమున ప్యాసీగూడ్సుమర్చెంటు అసోసియేషన్ బిల్డింగు ఆవరణలో జనవరి 19 తేదీ మొదలు 25 వ తేదీ వరకు శ్రీ త్యాగరాజోత్సవాలు వైభవంగా జరిగినవి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ గాయకులు, నాదస్వర విద్వాంసులు, వాయులీన విద్వాంసులు రేడియో గాయకులు హరిదాసులు పాల్గొన్నారు

నిరంకుశంగా నూజివీడు సమితి బడ్జెట్ ఆమోదం

నూజివీడు, ఫిబ్రవరి 1

కృష్ణాజిల్లా నూజివీడు పంచాయతీ సమితి అత్యవసర సమావేశం జనవరి 29 న జరిగినది సమావేశమునకు శ్రీ అక్కి అప్పారావు గారు అధ్యక్షత వహించారు.

సమావేశానికి ముందు సభ్యులకు అందజేసిన ఎజెండాలో 22 అంశాలు చర్చించుటకు ప్రతిపాదించబడినవి తర్వాత సమావేశంలో సప్లిమెంటరీ ఎజెండాను 10 అంశాలలో ప్రతిపాదించారు ఈ అంశములోనే 1964-65 సవరణ బడ్జెటు 1965-66 అంచనా బడ్జెటు 31 పేజీల అచ్చుప్రతివుంది 1966 67 నుండి 1970-71 సం॥లకు తయారుచేసిన చతుర్థ పంచవర్ష ప్రణాళికచిత్తు ముసాయిదా అచ్చు ప్రతి 28 పేజీలు కలది సమావేశం ప్రారంభమైన తర్వాత యిచ్చారు.

ఈ సమితి సమావేశానికి పూర్వం 15 రోజుల క్రితం పోతురెడ్డిపల్లి పంచాయతీ సర్పంచ్ వ్రాతమూలక జవాబులు కోరుతూ వ్రాసి పంపిన యీ క్రింది ప్రశ్నలకు వ్రాతమూలక జవాబులు యివ్వ నిరాకరించారు. ఆపీసు గుమాస్తా ద్వారా ప్రశ్నలకు జవాబులు ఓరల్‌గా చెప్పించుటకు ప్రయత్నించగా శ్రీ అక్కినేని సత్యనారాయణ దాన్ని వ్యతిరేకించి జవాబులు, బి డి ఓ. గాని అధ్యక్షులుగాని చెప్పాలనికోరారు.

పై ప్రశ్నలకు వ్రాతమూలక జవాబులు మా యిష్టం వచ్చినపుడు యిస్తాము గాని యిప్పుడే యివ్వాలని ఎక్కడా లేదని చెప్పి బి డి ఓ. నిరాకరించారు.

ఈ సమావేశంలోనే సమితిలో ఖాళీఅయిన ఒక స్త్రీ స్థానానికి ఎన్నిక రాబోవు సంవత్సరం బడ్జెటు4వ పంచవర్షప్రణాళికచిత్తుముసాయిదా సమితి పోగ్రాం యింకా ప్రభుత్వాన్ని కోరే తీర్మానాలు వీటన్నిటిని పూర్తిచేయుడం సాధ్యం కాదు గనుక రేపుకూడా సమితి సమావేశాన్ని పొడిగించి బడ్జెట్‌పై చర్చకు అవకాశం కల్పించాలని ప్రతిపక్షం తరపు శ్రీ అక్కినేని సత్యనారాయణ ప్రతిపాదించారు కాని ప్రెసిడెంటు పాలక పక్ష సభ్యులు కనీసం ఆలోచించకుండగనే త్రోసివేశారు. అన్ని ప్రతిపాదనలను త్రోసివేసి ఎజెండా నంతటనీ 6 గంటలకు ఆమోదింపచేసుకున్నారు. (వి వి.)

మరమగ్గాల ప్రవేశం: ప్రదేశ్ మాస్టర్ వీవర్సు అసోసియేషన్ హర్షం

మంగళగిరి ఫిబ్రవరి 1

ఆంధ్రప్రదేశ్‌లో మరమగ్గాల స్థాపనకు వర్తక వాణిజ్యవరాలను ప్రోత్సహించి తప్పక తోడ్పడగలమని స్థానికసంస్థల శాఖామంత్రి శ్రీ అల్లపాటి వెంకట్రామయ్యగారు జనవరి 28 వ తేదీనచీరాల సభలోయిచ్చినహామీ పట్ల ఆంధ్రప్రదేశ్ మాస్టర్ వీవర్సు అసోసియేషన్, మంగళగిరి మాస్టర్ వీవర్సు అసోసియేషనుల కార్యదర్శి శ్రీ జంజనం రామన్నగారు హర్షం వెలిబుచ్చారు. ఈ సదవకాశాన్ని రాష్ట్రంలోని మాస్టర్ వీవర్సుతారవిడువకుండా వినియోగించుకోవలసినదిగా ఆయన కోరారు (వి. వి.)


ప్రతి గుటకలో
దీని నిషాయొక్క ఆనందమే పొందండి
ఎల్లప్పుడు దీనినే త్రాగండి...
BEEHIVE
బీహైవ్ బ్రాండి
గత నూరు సంవత్సరముల నుండి ఫ్రాన్సులో ప్రజాదరణ పొందినది

ఆంధ్రబ్యాంక్ సమ్మె కొనసాగింపు

పోటీ గుమాస్తాలకోసం పత్రికా ప్రకటన చేసినందుకు ఉద్యోగులసంఘ కార్యదర్శి నిరసన

హైదరాబాదు ఫిబ్రవరి 3

ఆంధ్ర బ్యాంకు ఉద్యోగుల పని నిలుపుదల కొనసాగుతూంది ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ డి కె మూర్తి మేనేజిమెంటుకు నేడు ఒక లేఖ వ్రాస్తూ, పని నిలుపుదల చేసిన వారి స్థానంలో పోటీ గుమస్తాలను చేర్చుకొనేందుకు మేనేజిమెంటు పత్రికా ప్రకటనలు చేయడం ఆక్షేపణీయమని తెలియజేశారు.

బ్యాంక్ గుమస్తాలు సమ్మె చేయడంలేదు, మేనేజిమెంటు వారి యీ చర్యవల్ల సబార్డినేటు స్టాఫ్‌ను గుమస్తా స్థానాలకు ప్రమోట్ చేసే విషయం జరుగుతున్న సంప్రదింపులకు విఘాతం కలుగుతుంది,' అని ఆయన యీ లేఖలో చెప్పారు

మచిలీపట్నంలో

ఆంధ్రబ్యాంక్ మచిలీపట్నం రిజిస్టర్డ్ ఆఫీసు యిన్‌చార్జి ఆఫీసరుకూడా సమ్మెలో చేరినట్లు యిక్కడ తెలియవచ్చింది. (వి వి)

'ఆఫీసర్ల ట్రేడ్ యూనియన్ హక్కును ప్రశ్నించరాదు'

డాక్టర్ రాజ్ బహదూర్‌గౌడ్ స్పష్టీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 3

"ఆంధ్ర బ్యాంక్ మేనేజిమెంటువారు వక్రమైన న్యాయ సలహాలకు చెవిఒగ్గుతున్నట్లు కన్పిస్తున్నది. ఆఫీసర్లకు ట్రేడ్‌యూనియన్ చట్టం ప్రకారం తమ యూనియన్‌ను యేర్పాటు చేసుకునే హక్కు వుంది ఆ హక్కును సవాల్ చేయడానికి వీల్లేదు" అని, ఆంధ్ర బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ రాజ్ బహదూర్‌గౌడ్ నిన్న యిక్కడ ఒక బహిరంగ సభలో స్పష్టం చేశారు.

"మేనేజిమెంటు వివేకంతో వ్యవహరించి, ఆఫీసర్ల యూనియన్‌తో ప్రత్యక్ష సంప్రదింపులు ప్రారంభించాలి. వారి సహేతుకమైన కోర్కెలను మన్నించాలి సంప్రదింపులు ప్రారంభిస్తే మామూలు పరిస్థితి తిరిగి నెలకొంటుంది' అని ఆయన చెప్పారు.

ఆంధ్ర బ్యాంకు ఉద్యోగుల సమ్మె

విజయవాడ ఫిబ్రవరి 4

గత కొంది రోజులుగా తమ కోర్కెల సాధ[illegible] ఆందో[illegible] చేసున్న ఆంధ్ర బ్యాంకు ఉద్యోగులలో నేడు క్రొత్తగా శ్రీకాకుళం బ్రాంచి ఏజంటు, కాకినాడలో సూర్యారావుపేట బ్రాంచి ఏజంటు, వైజాగ్‌లోని మహారాణిపేట బ్రాంచి ఏజంటు చేరినట్లు వార్తలు వచ్చాయి నిరాహారదీక్ష సాగిస్తున్న ఆంధ్ర బ్యాంకు ఆఫీసర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ యల్ వి సత్యనారాయణ 15 పౌనుల బరువు తగారని యూనియన్ కార్యాలయం వారు ప్రకటించారు

రిక్షాలు నడుపుతున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వం పూర్తిజీతం యివ్వని ఫలితం

హైదరాబాద్, ఫిబ్రవరి 3

ఇక్కడ రెండువేల మందికిపైగా బేసిక్ శిక్షణపొందుతున్న ఉపాధ్యాయులకుపూర్తిజీతం యివ్వనందువల్ల వారిమీద ఆధారపడి వున్నవారుచాలా యిబ్బందులకు గురి అవుతున్నారనీ, ఉపాధ్యాయుల ప్రతినిధి ఒకరు పత్రికల వారితో మాట్లాడుతూ అన్నారు. కొన్నిమాసాల క్రితంప్రభుత్వం పూర్తిజీతం యిస్తుందని ప్రకటించిందనీ ఐతే యింతవరకు ఆ ప్రకటనను అసలు పర్చలేదనీ, అలా యిబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు బ్రతుకు తెరువు కోసం రిక్షాలు నడిపేవారుగా తయారుకావలసి వచ్చిందని యీ విషయం వెంటనే గమనించి తగినసహాయం చేయాలనీ కోరారు

విందు భోజనాలపై స్వచ్ఛంద పరిమితి

ఆంధ్రప్రభుత్వం విజ్ఞప్తి

హైదరాబాద్ ఫిబ్రవరి 3

మత సంబంధమైన వ్యవహారాలలోనూ పెండ్లిలవంటి సందర్భాల్లోనూ రాష్ట్రంలో యీనాడున్న ఆహార కొరత దృష్ట్యా ప్రజలే స్వచ్ఛందంగా కొంత నిగ్రహం చూపాలనీ అతిథులసంఖ్య పరిమితంగా వుండేలా చూచుకోవాలనీ, రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రజలకు విజ్ఞప్తి చేసింది

మనం అధికాహారోత్పత్తికోసం కృషి చేస్తున్నాం. ఇందుకుతోడు లోటుగావున్న ఆహారాన్ని పరిమితంగా వాడుకోవడమూ దుబారాను తగ్గించుకోవడం కూడా అవసరం. సాంఘిక సంస్థలూ, ప్రజాసంస్థలూ యీ విషయాన్ని ప్రజల్లో బహుళంగా ప్రచారంచేసి ప్రభుత్వానికి తోడ్పడాలని ఆ విజ్ఞప్తిలో చెప్పబడింది

నాజీ నరాంతకునికి 5 సంవత్సరాల కఠినశిక్ష

ఫ్రాంక్‌ఫర్టు, (ప జర్మనీ) ఫిబ్రవరి 3

మాజీయుద్ధ నేరస్తుడు లెఫ్టినెంటు కర్నల్ హెర్మన్ క్రుమీకి స్థానిక కోర్టులో 5 సంవత్సరాల కఠినశిక్ష పడింది.

క్రుమీ వయస్సు 59 సంవత్సరాలు ఇతను నాజీ నరాంతకుడుగా పేరుపొందిన ఐక్‌మన్‌కు కుడిభుజంలాంటివాడు.

హంగరీలో 8 లక్షలమంది యూదులను హతమార్చిన మహో నాజీ కెప్టెన్ ఆటో హంటన్‌ను కోర్టు నిర్దోషి అని విడిచిపెట్టింది.

సతీసమేతంగా నిరాహారదీక్ష

కాకినాడ ఫిబ్రవరి 3

ఆంధ్ర బ్యాంకు ఆఫీసర్ల సంఘ కార్యదర్శి శ్రీ ఎల్ వి. సత్యనారాయణ మేనేజిమెంటు నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఇక్కడ గత నాలుగురోజులుగా నిరాహారదీక్ష సాగిస్తున్నారు. నిన్న ఉదయంనుండి వారి సతీమణి కూడా బ్యాంకు మేనేజిమెంటు మొండి వైఖరికి నిరసనగా తమ భర్తతోపాటు నిరాహార దీక్ష ప్రారంభించారు.

కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు

117 మంది పేర్లతో తొలి జాబితా ప్రకటన

ఎర్నాకుళం, ఫిబ్రవరి 2

మార్చి 4 వ తేదీన జరుగనున్న కేరళరాష్ట్ర శాసనసభ ఎన్నికలలో కాంగ్రెసు తరపున పోటీ చేసే 117 మంది అభ్యర్థుల పేర్లుగల తొలి జాబితాను, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ టి మణియన్ నేడిక్కడ పత్రికలకు విడుదలచేశారు

మిగతా 16 స్థానాలకు కూడా ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థులపేర్లను ప్రకటిస్తామని ఆయన పత్రికా విలేకరులకు తెలిపారు.

ఈ 117 మంది అభ్యర్థులలో కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె సి అబ్రహాం మాజీ ముఖ్యమంత్రి ఆర్ శంకర్, రద్దుకాబడిన శాసనసభ స్పీకర్ అలెగ్జాండర్ పరాంబిథరా కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీమతి ఎమ్. కమలమ్మ మొదలగువారు వున్నారు.

రద్దుకాబడిన శాసన సభలో సభ్యులుగావున్న 31 మంది కాంగ్రెస్‌పార్టీ సభ్యులు తిరిగి ఈ ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. వీరిలో శంకర్ మంత్రివర్గంలోని మంత్రులు నలుగురు ఇ పి పౌలస్, కె టి అచ్యుతన్ కె కున్హంబు, ఎం పి. గోవిందన్ నాయర్లు వున్నారు

శంకర్ మంత్రివర్గంలో సభ్యులయిన కె ఎ. దామోదరమీనన్, పి పి. ఉమ్మెర్‌కోయా గత శాసనసభలో సభ్యులు. కేరళ కాంగ్రెసు పార్టీ ప్రధాన కార్యదర్శి ఐన టి. ఓ బావ ఇప్పుడు జరుగబోయే ఎన్నికల్లో పోటీ చేయటంలేదు.

కాంగ్రెసు పార్టీ ప్రధానకార్యదర్శి శ్రీ మణియన్ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, నేడు విడుదల చేసిన 117 మంది అభ్యర్థుల తొలి జాబితాకు కేంద్ర పార్లమెంటరీబోర్డు తన అంగీకారాన్ని తెలియచేసిందనీ, మిగిలిన 16 శాసన సభా స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజ్ తన అంగీకారాన్ని తెలిపిన వెంటనే, వాటిని విడుదలచేయడం జరుగుతుందని అన్నారు.

విలేకరులడిగిన ఒక ప్రశ్నకు శ్రీ మణియన్ సమాధానమిస్తూ, కేరళలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి కావలసిన శాతం మేరకు కాంగ్రెస్ పార్టీ స్థానాలను సంపాదించగలదని తాము ఆశిస్తున్నామని అన్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజ్ నేడిక్కడినుండి బయలుదేరి తిరువనంతపురం వెళ్లుతున్నారు

అలెప్పీ జిల్లాలో సైనిక ఓటర్ల బాహుళ్యం

అలెప్పి, ఫిబ్రవరి 3

మార్చి నాలుగో తేదీన జరిగే కేరళ మధ్యంతర ఎన్నికల్లో ఓటు హక్కువున్న సైనికుల సంఖ్య అలెప్పీజిల్లాలో చాలా హెచ్చుగావుంది ఈ జిల్లాలో ఓటర్ల సంఖ్య 9 10,180 కాగా వారిలో సైనికులు 3,928 మంది.

భారీఇంజనీరింగ్ వికేంద్రీకరణం

రాంచీ, దుర్గాపూర్‌లలో రెండు కార్పొరేషన్ల కార్యాలయాలు

కలకత్తా, జనవరి 31

భారీ ఇంజనీరింగ్ కార్పొరేషన్‌ను రెండు భాగాలుగా విభజించి ఒకటి రాంచీలోనూ, మరొకటి దుర్గాపూర్‌లోనూ ప్రధాన కార్యాలయాలను ఏర్పరుస్తారు

రాంచీలో భారీ ఇంజనీరింగు కార్పొరేషన్ వుంటుంది బొగ్గుగని యంత్రాలకార్పొరేషన్‌ను దుర్గాపూర్‌లో పెడతారు.

సోవియట్ సహాయంతో నిర్మించిన భారీ యంత్ర నిర్మాణ కర్మాగారమూ, జెకోస్లావేకియా సాయంతో నిర్మించిన భారీ యంత్ర పరికరాలకర్మాగారమూ ఫౌండ్రీఫోర్జికర్మాగారమూ, భారీ ఇంజనీరింగ్ కార్పొరేషను అధీనంలో వుంటాయి

బొగ్గుగని యంత్ర నిర్మాణం ప్రాజెక్టూ, దేశంలో వివిధ ప్రాంతాలలోవున్న తొమ్మిది బొగ్గు శుభ్రపరిచే కర్మాగారాలూ బొగుగని యంత్రాల కార్పొరేషను అధీనంలోవుంటాయి పోలెండ్ సహకారంతో నిర్మించడానికై ఆలోచనల దశలోనేవున్న మరొక కర్మాగారం కూడా ఈ కార్పొరేషను చేతిలోనే వుంటుంది.

పెద్ద పెద్ద కార్పొరేషన్లను విభజించాలనే ప్రభుత్వ ఆలోచనల కనుగుణంగా ఇది జరుగుతూంది. ఇటీవలనే హిందుస్థాన్ స్టీల్ ప్రాజెక్టును ప్రభుత్వం వికేంద్రీకరించడానికి నిశ్చయించింది. దానిప్రకారం రూర్కెలా, దుర్గాపూర్, భిలాయ్ కర్మాగారాలు దేనికది ఇకముందు స్వతంత్రంగానే వ్యవహరిస్తాయి వానిమీద హిందుస్థాన్ స్టీల్ ఒక విధమయిన పరిశీలన సాగిస్తూ వుంటుంది. ఈ కర్మాగారాల జనరల్ మేనేజర్లకు ఒకటిన్నర కోట్ల రూపాయల పరిమితివరకూ కంట్రాక్టులను ఇచ్చే అధికారం ఇవ్వబడుతుంది.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో హిందీభాష ప్రస్తుతానికివాయిదా

ఢిల్లీ పత్రికావిలేకరుల గోష్ఠిలో ప్రధాని శాస్త్రి వివరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2

కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలలో ప్రత్యామ్నాయ భాషగా హిందీని ప్రవేశపెట్టే విషయం ప్రస్తుతానికి నిలిపి ఉంచి, క్రమానుగతంగాను నెమ్మదిగాను ప్రవేశపెట్టేందుకు ఒక పథకం తయారుచేసి, ఆ తరువాత ఒక నిర్ణయానికి వస్తామని ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి నేడిక్కడ పాలం విమానాశ్రయంలో పత్రికా విలేకరు లడిగిన ప్రశ్నలకు సమాధానం యిస్తూ అన్నారు.

మూడురోజులు కేరళలో పర్యటించివచ్చిన తరువాత ప్రధానిశాస్త్రి ఇక్కడ మాట్లాడుతూ, తాను కేరళలో ఒకసభలో హిందీసమస్యపై చెప్పిన విషయాన్ని విపులీకరించారు "హిందీ భాష మాట్లాడే ప్రాంతాలలో హిందీని ప్రభుత్వ భాషగా చేయడానికి శీఘ్రచర్యలు తీసుకోవచ్చునని నేను సూచించాను ఈ రాష్ట్రాలు ఈ విషయంలో ముందుకుపోతే అది వారికేకాక హిందీభాషాభివృద్ధికికూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది హిందీయేతర రాష్ట్రాల విషయంలో ఇటువంటి విధంగా నిర్బంధం కూడదు పనికిరాదు.'

"హిందీలో ఉత్తరాలువస్తే చించి అవతల పారవేయండి" అని శ్రీ కామరాజ్ దక్షిణ ప్రాంతాలవారికి హితవు చెప్పినట్లు వెలువడిన వార్తల గురించి బెంగుళూరులో శ్రీ కామరాజ్ శ్రీ అతుల్యఘోష్ శ్రీ సంజీవరెడ్డిగార్లు హిందీ విషయంలో తొందరపాటు తగదని చెప్పిన విషయంగురించీ విలేకరులు అడిగిన ప్రశ్నలకు శ్రీ శాస్త్రి ఈ విధంగా సమాధానం యిచ్చారు.

"శ్రీ కామరాజ్ ఆ విధంగా చెప్పిన విషయం నాకు తెలియదు మిగిలిన నాయకులు కోరేది హిందీని అధికారభాషగా ప్రవేశపెట్టే విషయంలో యిప్పుడే ఈ విధంగా నిర్ణయం తీసుకోకూడదనీ ఆ విషయంలో కొంత నెమ్మదిగా నడవాలనీను వీరిసలహా చాలా ముఖ్యమైనదనే నేను అనుకుంటున్నాను పరిస్థితులను ఇంకా క్లిష్టంచేసే చర్యలేవీ తీసుకోరాదన నా అభిప్రాయం.

ఈ విషయాన్ని చర్చించడానికి ముఖ్యమంత్రుల సమావేశం జరుపుతారా? అని విలేకరులు అడిగారు. కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలలో హిందీని ప్రత్యామ్నాయ భాషగా ప్రవేశపెడితే కేంద్ర ప్రభుత్వోద్యోగాలు తమకు ఏవీ దక్కవనే దృష్టితోనే మద్రాసు విద్యార్థులు హిందీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. అందు చేత 1965 సెప్టెంబరునుండి కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హిందీని ప్రత్యామ్నాయ భాషగా ప్రవేశపెట్టాలని ఇప్పటికీ ప్రభుత్వం దృఢంగా అభిప్రాయపడుతుందా? అనికూడా అడిగారు.

అధికారభాషా విషయమై ముఖ్యమంత్రుల సమావేశం జరిపే ఉద్దేశ్యం లేదని శ్రీ శాస్త్రి సమాధానం చెప్పారు. కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు ప్రత్యామ్నాయ భాషగా హిందీని ప్రవేశపెట్టడం వెన్వెంటనే జరగదనీ, నెమ్మదిమీద హిందీని ప్రవేశపెట్టేందుకు ఒక పథకాన్ని తయారు చేసిన మీదటే ఆ విధంగా ప్రవేశపెట్టే విషయమై ఒక నిర్ణయం తీసుకుంటామనీ, ప్రధాన మంత్రి చెప్పారు. ఈ పథకానికి తుది రూపం యిచ్చే విషయంలో హిందీ యేతర ప్రాంతాల ముఖ్య మంత్రులను సంప్రదిస్తామని శ్రీ శాస్త్రి అన్నారు.

కేరళ ఎన్నికలలో కాంగ్రెసుకుగల అవకాశాలగురించి అడిగిన ప్రశ్నకు శ్రీ శాస్త్రి సమాధానంయిస్తూ ప్రస్తుతం ఆ రాష్ట్రంలో కనబడుతున్న ఉత్సాహాన్ని ఒక సూచనగా భావించవలసివస్తే కాంగ్రెసుకు మంచి తోడ్పాటే లభించగలదని ఆయన అన్నారు. మునుపటికంటే కాంగ్రెసుకుఇప్పుడు మంచి అవకాశాలు ఏర్పడినట్లు కేరళలో కలుసుకున్న అందరూ చెప్పారని అన్నారు. అయితే ముస్లింలీగ్, కమ్యూనిస్టులు, తిరుగుబాటు కాంగ్రెస్ మున్నగు పార్టీలతో కాంగ్రెస్ తీవ్రంగా పోటీ పడవలసి వుంటుంది అన్నారు.

ఎన్నికలు జరిగే లోగా తిరిగి తాను కేరళ వెళ్లే ప్రతిపాదన లేదని శ్రీ శాస్త్రి అన్నారు

ఒరిస్సా వ్యవహారాల గురించి చెబుతూ అక్కడ శాసనసభ పార్టీ కొత్తనాయకుని గురించి చేసే సూచనలకోసం తాము ఎదురు చూస్తున్నామనీ, ఈ సూచన అందిన తరువాత కేంద్ర పార్లమెంటరీ బోర్డు శ్రీ బిరేన్‌మిత్రా స్థానంలో ఎవరిని నియమించాలో నిర్ణయిస్తుందనీ అన్నారు.

మలేషియాకు ఆస్ట్రేలియా సైనికులు

బోర్నియోకు పంపుతారట!

కాన్‌బెర్రా, ఫిబ్రవరి 3

ఇండోనేసియాకు వ్యతిరేకంగా మలేషియా, బ్రిటన్ సైనికులతోబాటు బోర్నియోలో పోరాడేటందుకు తమ సైన్యాలనుకూడా పంప నిశ్చయించిందామని ఆస్ట్రేలియా తాత్కాలిక ప్రధాని జాన్‌మెక్వెన్ యీరోజు రాత్రి ఇక్కడ ప్రకటించారు

మలేషియా రక్షణకంటూ, అవసరమైన సైనిక చర్యలు తీసుకునేందుకు తమ విమాన దళాన్ని కూడా పంపడానికి ఆయన తమ సంసిద్ధతను ప్రకటించారు.

న్యూజీలాండ్ సేనలు కూడా

వెలింగ్టన్ ఫిబ్రవరి 3

మలేషియాకు అదనపు సైనిక సహాయం అందజేసేందుకు తమ ప్రభుత్వం కూడా నిశ్చయించుకున్నదని న్యూజీలాండ్ తాత్కాలిక ప్రధాని జాన్ మార్షల్ నేడు ప్రకటించారు.

చైనా ఆరోపణలకు భారత్ నిరాకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3

భారత చైనాసరిహద్దు వివాదాన్ని పురస్కరించుకొని ఉద్రిక్తతలనూ ఘర్షణలను పెంచే తన విధానాన్ని చైనా విసర్జించాలని సంప్రదింపుల ద్వారా వివాద పరిష్కారానికి ముందుకు రావాలనీ భారత ప్రభుత్వం చైనాకు ఒక లేఖ రాసింది.

సిక్కిం సరిహద్దుల్లో భారత సైనికులు సీమోల్లంఘన గావించారంటూ చైనాప్రభుత్వం యిటీవలచేసిన ఆరోపణను యీ లేఖ తిరస్కరించింది. కొలంబో ప్రతిపాదనం ఆధారంగా సంప్రదింపులు ప్రారంభించడానికి భారత ప్రభుత్వం సంసిద్ధతను యీ లేఖ మరోసారి వ్యక్తం చేసింది.

ఈ లేఖను భారత ప్రభుత్వం నిన్న ఢిల్లీలో చైనా రాయబార కార్యాలయానికి అందజేసింది.

భారత సైనికులు చైనా సిక్కిం సరిహద్దుల్లో తమ ప్రాంతంలోకి చొచ్చుకు వచ్చారంటూ చైనా ప్రభుత్వం యీ నెల 3 వ తేదీన రాసిన లేఖకు సమాధానంగానే సమాధానం పంపడం జరిగింది

1964 నవంబర్ నాటికి యీ సరిహద్దు వెంట, తమ (చైనా) భూభాగంలో భారతీయ పక్షంవారు జెలప్‌లా దోల్కాప్రాంతాల్లో 27 సైనిక నిర్మాణాలను గావించారనీ చైనా ప్రభుత్వం ఆరోపణ చేసింది.

పోటీపార్టీ నాయకుని అరెస్టు

తిరువనంతపురం, ఫిబ్రవరి 3

తిరువనంతపురం తాలూకా పోటీ పార్టీ కార్యదర్శి శ్రీ ఎ. సదాశివన్‌ను యీ రోజు పోలీసులు దేశరక్షణచట్టంక్రింద అరెస్టుచేశారు.

ఆయన యీరోజే స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తన నామినేషన్ దాఖలు చేశారు.

త్రిచూర్ జిల్లాలో 7 గురి నామినేషన్లు

త్రిచూర్ ఫిబ్రవరి 3

త్రిచూర్‌జిల్లాలోని వివిధ నియోజక వర్గాలకు యీ రోజున 7 గురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖల్ చేశారు

ఫిబ్రవరి 6 వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది.

ఎన్నికల ఉద్యోగి కేరళ పర్యటన

15 వ తేదీ మొదలు

4 రోజులపాటు

తిరువనంతపురం ఫిబ్రవరి 2

కేరళ రాష్ట్రంలో జరిగే మధ్యంతర ఎన్నికల యేర్పాట్లను పరిశీలించేటందుకు చీఫ్‌ఎలక్షన్ కమిషనర్ శ్రీ కె వి. కె. సుందరం యీ నెల 15 వ తేదీ నుండి నాలుగు రోజులపాటు యీ రాష్ట్రంలో పర్యటించ బోతున్నారు.

'పరస్పర సహకారమే మానవాళికి శరణ్యం'

అంతర్జాతీయ సహకార సంవత్సర సందర్భంలో యుథాంట్ సందేశం

ఐ రా స, ఫిబ్రవరి 3

ఐ రా స సభ్య రాజ్యాల, ప్రజల మధ్య పరస్పర సహకారంపైనే మానవజాతి మనుగడ ఆధారపడి వుందని అంతర్జాతీయ సహకార సంవత్సర సందర్భంగా సమితి ప్రధాన కార్యదర్శి యుథాంట్ నిన్న ప్రపంచ దేశాలన్నింటిపేర ఒక సందేశం విడుదల చేశారు.

ఆయన యీ సందేశాన్ని ప్రపంచమంతటా రేడియో, టెలివిజన్‌ల ద్వారా ప్రచారం చేయడానికి యేర్పాటు చేశారు.

"వివిధ జాతుల ప్రజలు విభిన్ననాగరికతలు గల్గినదేశాలు నిర్విరామంగా, ఓర్మితో[illegible] కలిసికట్టుగా కృషిచేయాలి' అని ఆయన యీ సందేశంలో చెప్పారు

తిరుపతిలో విద్యార్థి సమ్మె విస్తరణ

హిందీ వ్యతిరేక ఆందోళన

తిరుపతి ఫిబ్రవరి 3

అధికార భాషగా హిందీని ప్రవేశపెట్టడాన్ని ప్రతిఘటిస్తూ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన సమ్మె నేడు నగరంలోని మరికొన్ని కళాశాలలకు విస్తరించింది.

స్థానిక యింజనీరింగ్ ఆంధ్ర వెటర్నరీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలల విద్యార్థులు కూడా నేడు సమ్మె చేశారు.

సాయంత్రం వారు నల్లబ్యాడ్జీలు ధరించి నగర వీధుల్లో ఊరేగింపు జరిపారు

అమెరికా రాజ్యాలసంస్థ విదేశాంగమంత్రుల సభ

వాషింగ్టన్ ఫిబ్రవరి 4

అమెరికారాజ్యాల సంస్థ విదేశాంగమంత్రుల సమావేశం బ్రెజిల్‌లో మే 20 న జరపాలని నిర్ణయించారు.

బిరేన్ మిత్రా రాజీనామాకు గవర్నర్ ఆమోదం

భువనేశ్వర్ ఫిబ్రవరి 3

ఒరిస్సా ముఖ్యమంత్రి శ్రీ బిరేన్ మిత్రా సమర్పించిన రాజీనామాను రాష్ట్ర గవర్నర్ ఆమోదించినట్లు నేడిక్కడ అధికార ప్రకటన వెలువడింది.

'శ్రీ మిత్రా, ఆయన మంత్రివర్గ సహచరులు సమర్పించిన రాజీనామాను అత్యంత విచారంతో ఆమోదించాము వారు రాష్ట్రానికి అమూల్యమైన సేవ చేశారు." అని గవర్నర్ ప్రకటనలో వుంది.

ఒరిస్సాశాసనసభా కాంగ్రెస్‌పార్టీ సమావేశం

ఈ నెల 19 న అని ప్రకటన

తిరువనంతపురం ఫిబ్రవరి 4

శ్రీ బిరేన్‌మిత్ర స్థానంలో కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకోడానికి ఒరిస్సా రాష్ట్ర శాసనసభ కాంగ్రెసుపార్టీ, యింతకుముందు ప్రకటించినట్లు ఈనెల 18 వ తేదీని కాకుండా 19 వ తేదీని సమావేశమవుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌నాడార్ నేడు తిరువనంతపురంలో పత్రికావిలేకరులకు తెలిపారు

పి.సి.సి. తరపున ఆ సమావేశానికి పరిశీలకునిగా ఎవరిని పంపాలన్న విషయం తానింకా నిర్ణయించుకోలేదన్నారు. తామే వెళ్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఇకా ఏదీ నిర్ణయంకాలేదని జవాబు చెప్పారు ఇవన్నీ ఆలోచించేందుకు ఇంకా కావలసినంత వ్యవధి ఉందన్నారు.

ముఖ్యమంత్రికై అన్వేషణ

భువనేశ్వర్ ఫిబ్రవరి 3

ఒరిస్సా కాంగ్రెసు శాసనసభాపార్టీ నాయకుని ఎన్నిక ఈ నెల 17 వ తేదీన జరుగుతుంది.

రాష్ట్ర రెవిన్యూమంత్రి శ్రీ సదాశివ త్రిపాఠీ ఎనిమిదిరోజులపాటు స్వస్థలమైన కోరాపుట్టి వెళ్లి నేడే తిరిగివచ్చారు.

ఆయనరాగానే రాజీనామాపెట్టిన ముఖ్యమంత్రి బిరేన్‌మిత్ర, ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ విజయకుమార్‌పాణి మాజీ ముఖ్యమంత్రి శ్రీ నవకృష్ణచౌదరిగార్లు ఆయనను ఆయన ఇంటికి వెళ్ళి కలుసుకొని రెండు గంటలసేపు మాట్లాడారు.

ఈ లోపున కాంగ్రెసు లెజిస్లేచరు పార్టీకి చెందిన తిరుగుబాటుదారుల నాయకులు మాజీ ముఖ్యమంత్రి శ్రీ హరేకృష్ణమెహతాబ్‌ను నిన్న కలుసుకొన్నారు.

రెండు గ్రూపులవారూ తాము నాయకుడుగా ఎన్నుకొనదలచిన పేరును అతిగుప్తంగా వుంచుతున్నారు కాని, ఈ చర్చలన్నీ అతిప్రాథమిక రూపంలోనే వున్నాయనీ, వచ్చేవారంలో శ్రీ బిజూ పట్నాయక్ ఢిల్లీనుంచి రాగానే నిర్ణయాలు తీసుకోబడవచ్చుననీ అభిజ్ఞులు తెలుపుతున్నారు.

లేబర్ ప్రభుత్వంపై విశ్వాస ప్రకటన

లండన్ ఫిబ్రవరి 3

వందరోజులుగా అధికారంలోవున్న బ్రిటిష్ లేబర్ ప్రభుత్వం నిన్న రాత్రి తొలిసారి తన పట్ల పార్లమెంటు విశ్వాసాన్ని తెలియజేసే ఒక తీర్మానాన్ని ఆమోదింప చేసుకుంది.

ఈతీర్మానం 17 ఓట్లు మెజారిటీతో నెగ్గింది

ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో లేబర్ మంత్రి ఒకరు ఓడిపోయిన దృష్ట్యా, లేబర్ మంత్రివర్గం కొంతమనోనిబ్బరం పుంజుకోగలిగేటందుకు యీ తీర్మానం అవసరమైందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఛాయాచిత్రాల ప్రదర్శన

రెవెన్యూ మంత్రి ప్రారంభోత్సవం

హైదరాబాద్, ఫిబ్రవరి 3

రాష్ట్ర రివెన్యూమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి యీ రోజు యిక్కడ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనలో ఛాయా చిత్రాల విభాగాన్ని ప్రారంభించారు

ఈ విభాగంలో బ్లాక్ అండ్ వైట్, కలర్, ప్రింట్ రకాల చిత్రాలు 500 సుమారు ప్రదర్శించ బడుతున్నవి.

ఈ ప్రదర్శనను ఆంధ్ర ప్రదేశ్ ఫోటోగ్రాఫిక్ అసోసియేషన్ వారు యేర్పాటు చేశారు

జీపు ప్రమాదంలో ఒకరిమృతి

అనంతపురం, ఫిబ్రవరి 4

అనంతపురం జిల్లా ఉరవకొండ సబ్ తాలూకా వజ్రకరూరు గ్రామంలో జీపు ఢీకొన్నందువల్ల శ్రీ నరసోజీరావు అనే వ్యక్తి ఉరవకొండ ఆసుపత్రిలో మరణించాడు.

ఓరియంటల్ ఇన్సూరెన్సు కంపెనీ ఉద్యోగుల కరువు భత్యం హెచ్చింపు

బొంబాయి, ఫిబ్రవరి 3

ఓరియంటల్ ఫైర్ అండ్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్‌కు చెందిన అన్ని బ్రాంచీలలోని ఉద్యోగులకు కరువుభత్యం సూత్రాన్ననుసరించి పెంచుతున్న కరువు భత్యంతోపాటు, అదనంగా 6 శాతం నుండి 8 శాతం వరకు కరువు భత్యాన్ని పెంచటానికి కంపెనీ మేనేజిమెంటు అంగీకరించింది ఈ అంగీకార పత్రంపై నేడు అఖిల భారత భీమా ఉద్యోగుల సంఘ ప్రతినిధి, మేనేజిమెంటు ప్రతినిధి సంతకాలు చేశారు.

ఈ ఓరియంటల్ ఇన్సూరెన్సు కంపెనీ జీవితభీమా కార్పొరేషన్‌కు అనుబంధసంస్థ. జీవితభీమా కార్పొరేషన్ సంస్థతో ఉద్యోగుల సంఘం చేసుకొన్న ఒప్పందపు పద్ధతుల్లోనే, నేడు ఓరియంటల్ ఇన్సూరెన్సు కంపెనీకి, ఉద్యోగుల సంఘానికు మధ్య ఒప్పందం జరిగింది ఈ ఒప్పందం ఫలితంగా ఉద్యోగులకు ప్రతిసంవత్సరం వైద్యసహాయంక్రింద డబ్బు రూపంలో రు 50 చెల్లించబడుతుంది మూడు సంవత్సరాలవరకూ ఈ డబ్బును కూడబెట్టుకుంటూ వుండవచ్చు. చిన్నతరహా ఉద్యోగులకు రు 7 లను, ఉద్యోగులకు రు 11 లను ఇంటిఅద్దె అలవెన్సుక్రింద చెల్లించటానికి కంపెనీ మేనేజిమెంటు అంగీకరించింది ప్రస్తుతము ఎనిమిది కేంద్రాలలో మాత్రమే ఈ ఇంటి అద్దె అలవెన్సుచెల్లింప బడుతున్నది ఈ సదుపాయాన్ని దేశవ్యాపితంగా, అన్ని కేంద్రాలలోని ఉద్యోగులకు చెల్లించటానికి కంపెనీ అంగీకరించింది.

చిన్నతరహా ఉద్యోగులకు 6 శాతం కరువు భత్యం, ఉద్యోగులకు 8 శాతం కరువుభత్యం పెంచబడుతుందని ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షులు శ్రీ మదన్‌మోహన్ నేడిక్కడ తెల్పారు

ఈ ఒప్పందంవలన కరువుభత్యంరూపంలో కంపెనీ ఉద్యోగులు ప్రతిఏటా అదనంగా 2 లక్షల 40 వేల రూపాయలు, ఇంటిఅద్దె అలవెన్సు రూపంలో 35 వేల రూపాయలు పొందుతారని, కరువుభత్యం పెంపుదల 64 ఆగస్టు 1 నుండి లెక్కగట్టి ఇవ్వబడుతుందని మిగతా సౌకర్యాలు ఈ సంవత్సరం జనవరి నుండి ఇవ్వబడతాయని ఆయన చెప్పారు.

మహారాష్ట్రలో గోవా ప్రాంతాన్ని విలీనం చేయాలంటూ గోవా శాసనసభ చేసిన తీర్మానం చెల్లదని [illegible] శాసనసభ్యుడొకరు వ్యాఖ్యానించారు.

సోషలిస్టు దేశాలసాయంతో నిర్మించిన భారీవిద్యుత్ పరికరాల ఫ్యాక్టరీలు

ఈసంవత్సరమే పనిప్రారంభిస్తాయని వెల్లడి

న్యూఢిల్లీ ఫిబ్రవరి 3

తిరుచిరపల్లి, హైదరాబాద్, హరిద్వార్‌లలో జెకోస్లొవేకియా, సోవియట్ దేశాల సహాయంతో నిర్మింపబడుతున్న భారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీలు ఈ సంవత్సరమే ఉత్పత్తి ప్రారంభిస్తాయని ఈ ఫ్యాక్టరీల చైర్మన్ శ్రీ కె. బి. మాథుర్ నేడిక్కడ పత్రికా విలేకరులకు తెలియజేశారు

తిరుచిరపల్లిలో జెకోస్లొవేకియా సహాయంతో నిర్మింపబడుతున్న బాయిలర్ ఫ్యాక్టరీకి ఏప్రిల్ నెలలో ప్రధాని శాస్త్రి ప్రారంభోత్సవం జరుపవచ్చునని ఆయన తెలియజేశారు ఈ ఫ్యాక్టరీ యిప్పటికప్పుడే 60 మెగావాట్ల బాయిలర్లను రెండింటిని తయారుచేసిందనీ, ఈ రెండింటిని మద్రాసు సమీపంలోని ఎన్నూర్‌లో నెలకొల్పుతారనీ అన్నారు.

హైదరాబాద్‌లోని భారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీని కూడా జెకోస్లొవేకియా సహకారంతోనే నిర్మించుతున్నారనీ, దానిని ఈ యేడు ఆగస్టులో ప్రారంభించుతారనీ అన్నారు

హరిద్వారలో సోవియట్ సహాయంతో నిర్మించుతున్న ఫ్యాక్టరీకి డిసెంబరులో ప్రారంభోత్సవం జరుగుతుందని శ్రీ మాథుర్ తెలియజేశారు.

సిద్దిపేట చేనేత సహకార సంఘం

కమ్యూనిస్టు కార్యకర్తల ఏకగ్రీవ ఎన్నిక

సిద్దిపేట, ఫిబ్రవరి 3

సిద్దిపేట తాలూకా చేనేతసహకార సంఘానికిస్థానిక కమ్యూనిస్టు కమిటీ కార్యవర్గ సభ్యులు శ్రీ యాదిక్ కార్యదర్శిగానూ, శ్రీ శ్రీ కోళాలు ఉపాధ్యక్షులుగానూ, శ్రీ బి. రామచంద్ అధ్యక్షులుగాను ఎన్నికైనారు వీరందరి ఎన్నిక యేకగ్రీవంగానే జరిగింది. (వి. వి.)

ప్రధానితో భేటీకి అబ్దుల్లా యోచన

శ్రీనగర్, ఫిబ్రవరి 3

ఈనెల రెండోవారంలో మక్కా యాత్రకు బయలుదేరేముందు షేక్ అబ్దుల్లా ప్రధాని శ్రీ శాస్త్రిని కలుసుకోవాలనుకుంటున్నట్లు యిక్కడ తెలియవచ్చింది.

యాత్రకువెళ్ళేముందు ఆయన ఢిల్లీలో 8 రోజుల పాటు వుంటారు.

అబ్దుల్లా వెంట మక్కా యాత్రకు వెళుతున్నవారిలో ఆయన సతీమణి, ప్లెబిసైట్ ఫ్రంట్ నాయకుడు అఫ్జల్‌బేగ్ కూడా వున్నారు.

పెరోల్‌పై ముగ్గురు కాశ్మీర్ శాసన సభ్యుల విడుదల

శ్రీనగర్ ఫిబ్రవరి 3

దేశరక్షణ చట్టం క్రింద సెప్టెంబరు 22 న మాజీ కాశ్మీర్ ప్రధాని బక్షీ గులాం మహమ్మదుతోపాటు అరెస్టు చేయబడిన ముగ్గురు శాసన సభ్యులను 15 రోజుల పెరోల్‌మీద నేడు శ్రీనగర్ సెంట్రల్ జైలు నుండి విడుదల చేశారు.

రేపు జరగబోయే 'ఈద్' పండుగదృష్ట్యా పై ముగురినీ గాక ఆ సందర్భంగానే అరెస్టయిన మరి ఇద్దరినికూడ విడుదల చేశారు

సూర్య మండలం విశేషాల పరిశోధన

అమెరికాచే రాకెట్ ప్రయోగం

వాషింగ్‌టన్, ఫిబ్రవరి 3

సూర్యమండలంలోని విశేషాలను పరిశోధించే నిమిత్తం అమెరికా నేడు అంతరిక్షంలోనికి ఒక థార్ - డెల్టా రాకెట్‌ను ప్రయోగించింది. ఈ రాకెట్‌కు ఒక అంతరిక్ష ప్రయోగశాల'ను అమర్చారు.

తిరుచ్చివద్ద యుద్ధ పరికరాల ఫ్యాక్టరీ నిర్మాణానికి సన్నాహాలు

తిరుచిరాపల్లి, ఫిబ్రవరి 3

తిరుచ్చికి తూర్పుగా 10 మైళ్ళదూరంలో 12 కోట్ల రూపాయిల వ్యయంతో ఆయుధ పరికరాల ఫ్యాక్టరీని నిర్మించటానికి పనులు త్వరితంగా జరుగుతున్నాయి ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి 2 వేల యకరాలు కావలసి వుంటుంది

భూమిని సంపాదించే కార్యకలాపాలు పూర్తి అవుతున్నాయి

బాయిలర్ల కర్మాగారంవరకు వేయబడిన బ్రాడ్‌గేజి లైను మరో మూడు మైళ్ల పొడిగించి ఆయుధ పరికరాల ఫ్యాక్టరీదాకా వేస్తారని తెలుస్తున్నది. దాని ప్రక్కనే మరో రోడ్డుముకూడా సరకుల రవాణా నిమిత్తం నిర్మిస్తారని తెలుస్తున్నది

విదేశీ పెట్టుబడులు

(1 వ పేజీ తరువాయి)

భారత ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని శ్రీ టి. టి. కె. వివరించారు.

'పెట్టుబడి' దిగుమతిపై మీనన్ విమర్శ

విదేశ పెట్టుబడులను దేశంలోకి దిగుమతి చేయటం కొరివితో తలగోక్కున్నట్టే కాగలదని మాజీ రక్షణ మంత్రి శ్రీ కృష్ణమీనన్ ఢిల్లీ పౌరుల సౌహార్ద సంఘ సమావేశంలో ప్రసంగిస్తూ హెచ్చరించారు.

ఆర్థిక సామ్రాజ్యవాదానికి మించిన వినాశకరశక్తి మరొకటి లేదని ఆయన స్పష్టం చేశారు.

దేశానికి నాయకత్వం వహిస్తున్నవారిలో గత కొన్ని నెలలబట్టి భారతదేశ పారిశ్రామిక విధానాన్ని తిరగతోడే ధోరణిప్రబలుతున్నదని, సోషలిస్టు అర్థిక విధానానికి మారుగా పెట్టుబడిదారీ అర్థికవిధానాన్ని వారు దేశంలో పెంపొందింపజూస్తున్నారని శ్రీమీనన్ నిశితంగా విమర్శించారు.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం పేరుతో విదేశీ గుత్తపెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. మనదేశంలోని గుత్తపెట్టుబడులను ఎదుర్కోలేక మనంఇప్పుడు సతమతమై పోతున్నాము. ఇలాంటప్పుడు విదేశీ గుత్తపెట్టుబడులుకూడా దేశంలోకి వస్తే వాటిని ఎదిరించడం మరింత కష్టం కాగలద'ని శ్రీ మీనన్ హెచ్చరించారు

భారతదేశంలోని ప్లానింగ్‌పై వస్తున్న విమర్శలు సహేతుకమైనవి కావని ఆయన అన్నారు. పారిశ్రామికీకరణ కార్యక్రమానికి మితిమీరిన ప్రాధాన్యమిచ్చి, వ్యవసాయ రంగాన్ని అలక్ష్యం చేశామనడం నిజంకాదు దేశంలో ఆహారోత్పత్తి పెరిగింది అయినా దేశంలో కృతకమైన ఆహార కొరతను దోపిడీ వర్గాలు సృష్టిస్తున్నవని ఆయన విశదంచేశారు.

1955 – 61 మధ్య కాలంలో మన దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడులు రు 211 కోట్లు అని అధికార లెక్కలను బట్టి తేలుతున్నది దేశంలోని విదేశీ పెట్టుబడులపై వచ్చిన లాభాలను తిరిగి పెట్టుబడిగా పెట్టిన మొత్తం దీనిలో 83 కోట్లు వుంది మిగతా 130 కోట్లలో చాలా భాగం ఏదో ఒకరూపంలో విదేశాలకు వెళ్ళిపోయింది. కాబట్టి సాలీనా రు 10 కోట్లు విదేశీ పెట్టుబడులు మనదేశంలోకివచ్చి వుంటాయని ఆయన అన్నారు.

ఈ సమావేశానికి కేంద్ర పెట్రోలియమ్ శాఖ మాజీమంత్రి శ్రీ కె డి. మాలవ్యా అధ్యక్షత వహించారు.

సోషలిజం పేరుచెప్పి, పెట్టుబడిదారీ సమాజాన్ని సృష్టిస్తున్న శక్తులకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేయాలని శ్రీ మాళవీయ ఉద్బోధించారు.

కేంద్ర మంత్రుల సమావేశం

న్యూఢిల్లీ ఫిబ్రవరి 3

కేంద్ర గనుల, రసాయనాల శాఖామంత్రి హుమయూన్ కబీర్ నివాసగృహంలో నేడు కేంద్ర మంత్రుల సమావేశం జరిగింది. కేరళలో 3 రోజుల ఎన్నికల పర్యటనను ముగించుకొని ప్రధాని శాస్త్రి రాజధానికి చేరగానే ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది. ప్రధాని శాస్త్రి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.

అంతర్జాతీయ వాణిజ్య పరిషత్తులో 20 వ మహాసభ ఫిబ్రవరి 8 వ తేదీన ఢిల్లీలో ప్రారంభమవుతున్నది.

అవినీతికి పాల్పడిన అధికారులమీద చర్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1

బెంగుళూరులోని హిందూస్థాన్ విమాన నిర్మాణ సంస్థలో సూపర్‌వైజర్‌గా వున్న శ్రీ ఎస్. నరసింహన్‌మీద డిపార్టుమెంటుద్వారా చర్యలు తీసుకొని బర్తరఫ్ చేశారు. దేశీయాంగ మంత్రిత్వశాఖ తాలూకు కేంద్ర నేర పరిశోధనా సంస్థ చేసిన సిఫార్సును ఆధారం చేసుకొని అతని మీద ఈ చర్య తీసుకోడం జరిగింది. అన్యాయంగాను, మోసంగాను ఆ ధనాలను స్థానిక వర్తకులకు విక్రయించి అతడు తనకూ యితరులకూ లాభం చేకూర్చుకున్నాడని అతనిమీద నిందమోపబడింది

అక్రమ ప్రవర్తన, అవినీతిగాను డిపార్టుమెంటుద్వారా చర్యలు తీసుకోడానికై క్రిందటి నవంబరు నెలలో, 20 మంది గెజిటెడ్ ఆఫీసర్లూ, 142 మంది ప్రభుత్వోద్యోగులతో సంబంధించి, సుమారు 123 కేసులను ఆ యా డిపార్టుమెంటులకు తెలియజేయడం జరిగింది. ఆ నెలలో యిద్దరు గెజిటెడ్ ఆఫీసర్లను నిర్బంధంగా సర్వీసునుంచి రిటైరు చేశారు. ఒకరికి రెండు యింక్రిమెంట్లు జీతం తగ్గించి రెండేండ్లు ప్రమోషన్ ఆపుదల చేశారు. 18 మంది నాన్ గెజిటెడ్ ఆఫీసర్లను బలవంతంగా రిటైరు చేయటంగానీ, వారికి హోదాను లేదా జీతాన్ని తగ్గించడంగానీ, లేదా ఇంక్రిమెంట్లను ఆపుచేయడంగానీ జరిగింది.

వస్తువుల ధరవరలు
1964 డిశంబరు
నెలకు సమీక్ష

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1

అధికార టోకు ధరల సూచిక, 1954 మార్చితో పూర్తయిన యేడాదికి 100 గా తీసుకుంటే, 1964 డిశంబరులో నూటికి 156 పెరిగి 157 9కి అందుకుందని, భారత ప్రభుత్వ ఆర్థిక సలహాదారు కార్యాలయంవారు ఒక పత్రికా ప్రకటన జారీచేశారు, 1964 నవంబరు నెలలో ఈ సూచిక 155.4 వున్నది.

ప్రస్తుతం పరిశీలింపబడుతున్న నెలలో ఆహార 'వస్తువుల'కు సంబంధించిన సూచిక నూటికి 1.5 పెరిగి 106 9 కు చేరుకుంది అదేవిధంగా ఈ సూచిక 'పొగాకు' విషయంలో నూటికి 0.5 పెరిగి 183 2 కు ఇంధనం (విద్యుచ్ఛక్తి కందెనతైలాలు) మొదలైనవాటి విషయంలో నూటికి 0 3 పెరిగి 145.8 కు, పారిశ్రామిక ముడిపదార్థాల' విషయంతో నూటికి 3 9 పెరిగి 171.2 కు తయారీ వస్తువుల విషయంలో నూటికి 0.6 పెరిగి 139 8కు అందుకుంది.

హైద్రాబాద్ సుల్తాన్‌బజార్ వై.ఎం.బి.ఎస్. హాలులో భారతీయ కళాసమితి ఆధ్వర్యాన శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు జరిగాయి.

"Account Test - Executive officers, Part I, II, P W D & Zilla Parishad tests - Postal Tuition offered - prospectus Free-Apply Account Test Institute, Madras-8."

ప్రకటన

నర్సారావుపేట సబ్‌కోర్టులో -

DHR బొట్లా రామసుబ్బమ్మ
OS 19/54 GP 211/63
JD బొట్లా నారాయణమ్మ వగయిరాలు.

యీ క్రింది షెడ్యూలు ఆస్తి 22.2.65 తేదీన పై కోర్టు వారి ఎదుట బహిరంగవేలం జరుగును.

8 నెం 745/B గుత్త రు. 19-0-0 సిస్తుగల య 14-62 సెంట్లలో య 7-31 సెంట్లు

(Sd) యనమండ్ర పాండురంగారావు
DHR అడ్వకేట్.

టెండరు నోటీసు

గుంటూరు జిల్లా పరిషత్ ఆధ్వర్యమున మాచెర్ల, పెదపూడి యందు నడుపబడుచున్న ఇండస్ట్రియల్ స్కూల్సుకు 1964 - 65 వ సంవత్సరమునకు కావలసిన టేకు కలప, మెషినరీ వగయిరాల సరఫరాలకు సీలు వేసిన టెండర్లు గుంటూరు జిల్లా పరిషత్ కార్యదర్శి లేక డిప్యూటీ సెక్రటరీ గారిచే ది 16-2-65 వ పగలు గం 3-30 ల వరకు తీసుకొనబడును.

టెండరు షెడ్యూల్సు వరతుల వగైరా రు 10-20 లు చెల్లించినవారికి ది15-2-65 వ తేదీ వరకు జిల్లా పరిషత్ కార్యాలయమందు యివ్వబడును.

—(సం.) డి. రామదాసు,
కార్యదర్శి.
జిల్లా పరిషత్ కార్యాలయము,
గుంటూరు, 31-1-65.

బారాబతి రాఫిల్, (కటక్.)
ముగింపు: 12-2-65 • డ్రా. 21-2-65
1 టిక్కెట్టు రు. 1-15; 6 టిక్కెట్లు రు. 5-15; 18 టిక్కెట్ల పుస్తకం రు. 12 లు
కె. సి. ఛారిటీస్ ఫండ్, (బరంపురం.)
ముగింపు: 12-3-65 • డ్రా: 30-4-65
1 టిక్కెట్టు రు. 1-15; 6 టిక్కెట్లు రు. 5-15; 14 టిక్కెట్ల పుస్తకం రు. 10 లు
టిక్కెట్ల ఖరీదు పూర్తిగా మనియార్డరు ద్వారా ఈ క్రింది అడ్రసుకు పంపండి.
ది మోడరన్ న్యూస్ ఏజన్సీ,
గవర్నరుపేట :: విజయవాడ-2.

మందులధరలస్థిరీకరణకు ప్రభుత్వ చర్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1

దేశంలో తయారు చేసినట్టిగానీ లేదా దేశంలోకి దిగుమతి చేసుకున్నట్టిగానీ మందులు ఓషధులను 1963 ఏప్రిల్ 1 వ తేదీనాటికి ఉపయోగకరమైనవిగా పేర్కొనడం జరిగినట్లయితే, అటువంటి మందులు, ఓషధుల చిల్లరధరలను, ముందుగా ప్రభుత్వం అనుమతి పొందనిదే పెంచగూడదు అవసరవస్తువుల ధర స్థిరీకరణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలలో యిదొకటిగా, పెట్రోలియం రసాయనిక పదార్థాల మంత్రిత్వశాఖ జారీచేసిన ప్రకటనలో వెలువబడింది.

మందుల ధరలను పవరించి, వీలైనచోట టోకు ధరను తగ్గించి వినియోగదారులకు గూడా ప్రయోజనం కలిగేట్లుగా చేయవలసిందని యిటీవల పెట్రోలియం. రసాయనిక పదార్థాల మంత్రిత్వశాఖ, మందులను తయారు చేసేవారిలో ప్రముఖులను కోరింది అంతేగాక చిల్లరవర్తకులు మందుల ధరల పట్టికను ప్రకటించి, మందులను అంతకుమించి ఎక్కువ ధరకు విక్రయించకుండా చూడాలనికూడా వారిని కోరింది. ముడివస్తువులధరలు ప్యాకింగ్ ఖర్చులు మొదలయినవి పెరిగినప్పటికి, మందుల చిల్లరధరలు 1963 ఏప్రిల్ స్థాయిలోనే వున్నాయని యింతవరకు అందిన సమాధానాలనుబట్టి తెలుస్తున్నది

కొంతమంది టోకు ధరలను, చిల్లర ధరలను తగ్గించారు అయితే కొంతమందిమాత్రమే ముఖ్యంగా కొద్దిస్థాయిలో మందులు తయారు చేసేవారు, చిల్లర ధరలను పెంచాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలగురించి ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

మందులనూ రసాయన పదార్థాలనూ తయారు చేసేవారూ, వీటిని దిగుమతి చేసేవారూ, ఈ అత్యవసర వస్తువుల ధరలను యధాతథంగా వుంచాలనీ, మందులు, రసాయనిక పదార్థాలు యితర అవసర వస్తువుల ధరలను పెంచరాదనీ ప్రభుత్వం కోరుతున్నది.

హైద్రాబాద్ రేడియో సలహాదారుగా శ్రీ తిమ్మారెడ్డి

హైదరాబాదు ఫిబ్రవరి 1

శాసనసభ్యుడు శ్రీ పి. తిమ్మారెడ్డి ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రం తాలూకు కార్యక్రమాల సలహా సంఘం సభ్యుడుగా నియమింపబడ్డారు వీరి సభ్యత్వం గడువు రెండేళ్లు.

మదనపల్లికి చెందిన శ్రీమతి టి. యస్. అనసూయారెడ్డి ఆకాశవాణి విజయవాడ కేంద్రం తాలూకు కార్యక్రమాల సలహాసంఘం సభ్యులుగా నియమింపబడ్డారు. ఆమె రెండేళ్ళపాటు ఆ పదవిలో వుంటారు.

ఆల్బేనియా వింత కోర్కెలు
వార్సాసంధి రాజ్యాలలో చేరడానికి షరతులు

వియన్నా ఫిబ్రవరి 3

వార్సాసంధి రాజ్యాల సమావేశంలో తాను పాల్గొనాలంటే, సోవియట్ యూనియన్ వెంటనే తూర్పు జర్మనీతో శాంతిసంధి కుదుర్చుకోవటం, మాస్కో అణ్వస్త్ర పరీక్షల ఒప్పందాన్ని త్రోసిపుచ్చటం, భారత, యుగోస్లావియా దేశాలకు ఆయుధ సరఫరాను నిలుపు చేయుడం, వార్సాసంధి రాజ్యాలకు అణ్వస్త్రాలను అందజేయడానికి అంగీకరించడం అవసరమని ఆల్బేనియా షరతులు విధించింది.

ఇటీవల వార్సాలో జరిగిన వార్సా సంధి రాజ్యాల సమాలోచనల సమావేశానికి హాజరు కావలసిందన్న ఆహ్వానాన్ని తిరస్కరిస్తూ, ఆల్బేనియా పంపిన సమాధానాన్ని ఆల్బేనియా వార్తాసంస్థ ఇక్కడ పత్రికలకు విడుదల చేసింది.

సోవియట్ మాజీప్రధాని క్రుశ్చేవ్ చేసిన "ఘోర తప్పిదాలను" సోవియట్ కొత్త నాయకత్వం సరిదిద్దు కొన్న తరువాతమాత్రమే ఆల్బేనియా వార్సా సంధి రాజ్యాల సమావేశాలలో పాల్గొంటుందని ఆ సమాధానంలో పేర్కొన్నారు.

సోవియట్ ప్రభుత్వం 'లూటీ' చేసిన ఆల్బేనియా ఆయుధ సంపదను తిరిగి యిచ్చివేయాలని, సోవియట్ సహాయాన్ని అర్థాంతరంగా నిలుపు చేసినందుకు పరిహారం ఇచ్చుకోవాలని, అది జరిగిన పిమ్మట మాత్రమే తాము వార్సాసంధి రాజ్యాల సమావేశాలకు హాజరవుతామని కూడా వారు తమ సమాధానంలో పేర్కొన్నారు.

ఉగాండా పాత్రికేయుల భారత సందర్శన

బెంగుళూరు, ఫిబ్రవరి 3

భారత ప్రభుత్వ ఆహ్వానంపై మన దేశాన్ని సందర్శించవచ్చిన నలుగురు ఉగాండా పాత్రికేయులు 6 వ తేదీన మద్రాసునుండి యిక్కడకు వస్తారు.

వారు హిందూస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థనూ, టెలిఫోన్ పరిశ్రమనూ చూస్తారు.

మహాదీక్షతో అవినీతి నిర్మూలన సాగాలి

హోం మంత్రి శ్రీ నందా హెచ్చరిక

బొంబాయి, ఫిబ్రవరి 3

స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించినంత పట్టుదలా, ఉత్సాహముతో అవినీతినీ, దేశాన్ని ఎదుర్కొంటున్న ఇతర సమస్యలనూ ఎదుర్కోవలసి వున్నదని నేడు హోం శాఖామంత్రి శ్రీ జి. ఎల్. నందా హెచ్చరించారు

అనువ్రత సమితిచే ఏర్పరచబడిన వ్యాపారస్తుల సభలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రారంభించిన వుద్యమం ఫలితంగా దేశంలో అవినీతికివ్యతిరేకంగా నూతన చైతన్యం కలిగినందుకు సంతోషిస్తున్నానన్నారు ఇంతవరకు జరిగిన పని ఆ సమస్యలో కొద్దిపాటికూడా కాదన్నారు.

"ఈ విషయమై జరుగుతున్న ప్రచారాన్ని కొందరు విమర్శిస్తున్నారు. దీనివలన విదేశాలలో అప్రతిష్ఠ కలుగుతుందని వారి విమర్శ. నా సమాధానం ఒక్కటే. శరీరంలో ఒక రుగ్మత వున్నప్పుడు దానిని తొలగించేదానికి పూనుకోవాలిగాని దాచిపెట్టరాదు,

అవినీతికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం వలన విదేశాలలో మన ప్రతిష్ఠ పెరుగుతుంది.

'భారతదేశం బీదదేశం, అభివృద్ధికి ఆటంకరాలుగా వుండే అవినీతీ, తదితర బాధలనూ భరించలేదు.

'[illegible] కర్తికూడ ఒక విధమైన అవినీతే."

అంతర్జాతీయ వాణిజ్య మండలి 20వ మహాసభ
ప్రేక్షకులుగా సోవియటు ప్రతినిధుల రాక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3

సోవియటు వాణిజ్యమండలి ప్రతినిధివర్గం మిహైల్ నెస్టెరోవ్ అధ్యక్షతన నేడు న్యూఢిల్లీ బయలుదేరింది అంతర్జాతీయవాణిజ్య మండలి 20వ మహాసభలో వారు ప్రేక్షకులుగా పాల్గొంటారు.

ఇంజనీరింగ్ శిక్షణ కేంద్రం
వరంగల్లులో స్థాపనకు ఐరాసతో ఒప్పందం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4

కేంద్ర ప్రభుత్వానికి ఐరాస ప్రత్యేకనిధి సంస్థకు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం వరంగల్లులోని ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజీలో అధ్యాపకులకు శిక్షణ కేంద్రాన్ని కోటి డాలర్ల ఖర్చుతో నెలకొల్పుతారు.

ఇందుకు ఐరాస ప్రత్యేకనిధి నుంచి 17 74,300 డాలర్లు మంజూరు చేశారు. కేంద్ర ప్రభుత్వం తన వాటా క్రింద 85,38 72 లు డాలర్లు కేటాయిస్తున్నది.

ఐరాస ప్రత్యేక నిధినుంచి మంజూరు చేసిన మొత్తంలో 3 60,000 డాలర్లు ఉపకారవేతనాలకు, 4,00,000 డాలర్లు పరికరాల దిగుమతికి వ్యయపరుస్తారు.

మంగుళూరు దుర్గాపూర్, నాగపూర్, భోపాల్, జెమ్‌షెడ్‌పూర్, శ్రీనగర్, అల్లాహాబాద్‌లలోని ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజీలలో అధ్యాపకులకు కూడా ఈ కేంద్రంలోనే శిక్షణ గరుపుతారు.

"ఎక్‌స్టెన్షన్ ఆఫీసర్లు రైతుల విశ్వాసం పొందడంలేదు"
కేంద్రమంత్రి సుబ్రహ్మణ్యం విమర్శ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2

గ్రామాలలో వ్యవసాయాభివృద్ధి పథకానికి తోడ్పడుటకు నియమింపబడిన ఆఫీసర్లు సరిగా పనిచేయనందువల్ల రైతులకు వీరంటేఅజీకారభావం యేర్పడిందనీ యీ పరిస్థితులలో వ్యవసాయదారులవిశ్వాసాన్ని పొందలేకపోతున్నారని ఇక్కడ ఇటీవల యేర్పడిన జాతీయ అభివృద్ధి శిక్షణాసంఘమూ వ్యవసాయ పథకాల్లో ప్రభుత్వానికి సహాయపడే మేధావులూ పాల్గొన్న సంయుక్త సమావేశానికిప్రారంభోత్సవం చేస్తూ కేంద్ర ఆహారవ్యవసాయమంత్రి సి. సుబ్రహ్మణ్యం అన్నారు ఆహార పదార్థాల దిగుమతిమీద ఆధారపడటం ఎంత ప్రమాదమో యిటీవల అమెరికాలో రేవు కార్మికుల సమ్మె ద్వారా తెలుసుకోవచ్చునని ఆయన అన్నారు.

ప్రతి రాష్ట్రమూ తగినంత ఆహారోత్పత్తి చేయగలడం లేదనీ, అందువల్ల దిగుమతిమీద ఆధారపడవలసి వుంటున్నదనీ దానివల్ల దేశంలో ఆహార పరిస్థితి క్లిష్టంగా వుంటున్నదనీ ప్రత్యేకంగా గత సంవత్సరం ఆహారోత్పత్తి అభివృద్ధి అవసరాన్ని బట్టి జాతిమొత్తం తెలుసుకొన్నదని ఆయన చెప్పారు.

రష్యా జలాంతర్గామిశక్తి

రోమ్, ఫిబ్రవరి 4

సోవియట్ యూనియన్‌కు 400 జలాంతర్గాములు కలవనీ వాటిలో 30 అణుశక్తి జలాంతరాములని ఇటలీ నౌకావ్యవహారాల నిపుణుడు అంచనావేస్తున్నారు

సోవియట్ జలాంతరాములలో 300 వరకు పశ్చిమ సముద్రాలలోనే తిరుగుతున్నవని ఆయన వివరించారు.

అమెరికా అణుశక్తి జలాంతరాముల సంఖ్య 32 అని ఆ నిపుణుడు అంచనా వేస్తున్నారు.

హిందీ వ్యతిరేక ఆందోళన

పుదుచ్చేరిలో విద్యార్థులపై లాఠీచార్జి

పుదుచ్చేరి, ఫిబ్రవరి 3

హిందీ వ్యతిరేక నినాదాలిస్తూ ఊరేగింపు జరుపుతున్న విద్యార్థులను చెదరగొట్టేందుకు నేడు పుదుచ్చేరిలో పోలీసులు లాఠీచార్జిచేశారు.

ఇద్దరు విద్యార్థులకు తలలపైన బలమైన గాయాలు తగిలాయి మరో 20 మంది విద్యార్థులుకూడా స్వల్పగాయాలకు గురయ్యారు.

మహాత్మా గాంధీరోడ్‌లోని ఒక ఇంటిపైగల కాంగ్రెసు జెండాను దింపివేసి నల్లజెండాను ఎత్తటానికి విద్యార్థులు ప్రయత్నించటంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు విద్యార్థులచర్యలను ఇంటిలోని వారు గట్టిగా ప్రతిఘటించటంతో ఇరువరాల మధ్య ఘర్షణ ప్రారంభమైంది. పోలీసులు వచ్చి విద్యార్థులపై లాఠీచార్జి జరిపి, గుంపును చెదరగొట్టారు తర్వాత ఊరేగింపు సాగిపోయింది. ఎట్టిఘటనలు జరగలేదు.

తర్వాత గిరిడీసలై మైదాన్‌లో విద్యార్థి ప్రదర్శకులు బహిరంగసభ జరిపారు. సమ్మె నిరవధికంగా జరపాలని విద్యార్థులు సభలో తీర్మానించారు.

నగరంలోని పోస్టాఫీసులలోని రైల్వే స్టేషన్‌లోని, తదితర ప్రాంతాలలోని హిందీ బోర్డులపై విద్యార్థులు తారు పూసివున్నట్లు తెలుస్తున్నది.

హిందీని, అధికార భాషగా చేయటాన్ని నిరసిస్తూ తీర్మానాలు చేయవలసినదిగా పుదుచ్చేరి మంత్రులకు, శాసన సభ్యులకు విద్యార్థులు విజ్ఞప్తిచేస్తూ తీర్మానించారు. హిందీని తమపై అధికారభాషగా రుద్దటం కొనసాగించిన పక్షంలో లోక్‌సభ, రాజ్యసభలలోని పుదుచ్చేరి ప్రతినిధులు తమ పదవులకు రాజీనామా ఇవ్వాలని విద్యార్థి ప్రదర్శకులు బహిరంగ సభలో అభ్యర్థిస్తూ తీర్మానాలు చేశారు.

మద్రాసు, చిదంబరం, మదురై, తిరునల్వేలిలో విద్యార్థులపై, ఉపాధ్యాయులపై పోలీసులు దౌర్జన్య చర్యలకు తలపడటాన్ని ఖండిస్తూ బహిరంగసభలో విద్యార్థులు తీర్మానించారు. చిదంబరంలో జరిగిన పోలీసు కాల్పుల్లో మరణించిన విద్యార్థి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ తీర్మానించారు.

బెంగుళూరులో విద్యార్థుల ప్రదర్శన

బెంగుళూరులో నేడు సెయింట్ జోసెఫ్ కళాశాలకు, లా కాలేజికి చెందిన విద్యార్థులు క్లాసులకు హాజరు కాకుండా, హిందీ వ్యతిరేక నినాదాలిస్తూ ఊరేగింపు జరిపారు.

నగరంలోని కొన్ని కళాశాలల సమీపంలో ఊరేగింపులో పాల్గొన్న విద్యార్థులు ప్రదర్శనలు జరిపారు అయితే పని చేస్తున్న కళాశాలలలోని విద్యార్థులను తమతో ఊరేగింపులో కలవవలసిందిగా విద్యార్థి ప్రదర్శకులు ఒత్తిడి చేయలేదని పోలీసులు చెప్తున్నారు.

హిందీని అధికారభాషగా చేయటాన్ని ఖండిస్తూ విద్యార్థులు శాసనసభ సమీపంలోని కబ్బన్‌పార్కులో బహిరంగసభ జరిపి తీర్మానం చేశారు.

తమిళనాడ్ విద్యార్థుల పత్రికా ప్రకటన

హిందీ వ్యతిరేక తమిళనాడ్ విద్యార్థుల సంఘంనేడొక పత్రికా ప్రకటనచేస్తూ హిందీని బలవంతంగా తమపై రుద్దటాన్ని విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారని ఇక్కడగాని భవిష్యత్తులోగాని హిందీని అధికారభాష రూపంలోగాని, రాష్ట్రాలమధ్య వ్యవహారిక భాషగాగాని ప్రవేశపెట్టటాన్ని వ్యతిరేకిస్తున్నారని అన్నారు

ఏదో ఒకరోజున హిందీని నిర్బంధంగా ప్రవేశపెట్టటం ద్వారా హిందీయేతర ప్రజలను 'బానిసలు'గా చేసేందుకు రాజ్యాంగపట్టంలోని 17 వ అధ్యాయం అవకాశాన్ని కల్పిస్తుందని కనుక రాజ్యాంగ పట్టంలోనుండి 17 వ అధ్యాయాన్ని పూర్తిగా తొలగించాలని విద్యార్థులు తమ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు

17 వ అధ్యాయంలోని ప్రతివాక్యం, ప్రతిమాటా హిందీ భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాన్నే బలపరుస్తున్నదని వారు పేర్కొన్నారు.

అన్నామలై విశ్వవిద్యాలయానికి చెందిన ప్రతినిధులతో సహా రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన ప్రతినిధులతో ఈ విద్యార్థి సంఘం నిన్న ఈ నగరంలో ఏర్పాటు చేయబడింది

భాషా సమస్యపై 'విధాన ప్రకటన' ను వెలువరించాలని విద్యార్థిసంఘం తీర్మానించింది.

హిందీ వ్యతిరేక ఉద్యమ కార్యక్రమాన్ని రూపొందించేందుకు ఈ సంఘం మరల సమావేశం కాగలదని పత్రికా ప్రకటన తెలియచేస్తున్నది

విద్యార్థుల లక్ష్యం సాధించబడేవరకు విద్యార్థుల కోసం ఉద్యమం కొనసాగించబడుతుందని పత్రికా ప్రకటనద్వారా విద్యార్థి సంఘం తెలియజేసింది

విద్యార్థులలో చెలరేగుతున్న అసంతృప్తిని గురించి తమకేమీ తెలియనట్లు ప్రధానమంత్రి, ఇతర కేంద్ర రాష్ట్రమంత్రులు కల్లబొల్లికబుర్లు చెబుతున్నారని విద్యార్థిసంఘం విమర్శించింది.

కేంద్ర, రాష్ట్రాల మంత్రులు ఇస్తున్న హామీలు, వాగ్దానాలు, మినహాయింపులు 'హిందీ పెత్తనాన్ని' వ్యాపింపజేయటానికి ఉద్దేశించినవని, అదర్శాలు వివరణలు తప్పితే ఇతరత్రా ఏమీకావని విద్యార్థులు తమ పత్రికా ప్రకటనలో విమర్శించారు. 'హిందీ వ్యతిరేక ఉద్యమ ఆశయాలను, భావనలను పూర్తిగా అర్థం చేసుకోకుండా, నామమాత్రమైన సానుభూతిని నాయకులు చూపుతున్నారని. విద్యార్థులు కోరుతున్నది. వట్టి వాగ్దానాలను హామీలనుకాదని, రాజ్యాంగ పట్టంనుండి 17 వ అధ్యాయాన్ని పూర్తిగా తొలగించటంద్వారా హిందీ సామ్రాజ్యవాద తత్వాన్నుండి' రక్షణను కోరుతున్నారని విద్యార్థి సంఘం ప్రకటించింది.

సేలంలో 3500 విద్యార్థుల ప్రదర్శన

హిందీ వ్యతిరేక నినాదాలిస్తూ 3500 మంది హైస్కూలు విద్యార్థులు నేడు సేలం పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు జరిపారు. హిందీ దిష్టిబొమ్మనుచేసి ఊరేగింపు జరిపి తర్వాత దానికి దహన క్రియలు జరిపారు

ఊరేగింపువెంట పోలీసు కావలా ఏర్పాటు చేయబడింది. గతరాత్రినుండి పట్టణంలో సెక్షన్ 30 (2) క్రింద నిషేధాజ్ఞలు జారీచేయబడ్డాయి అయితే ఊరేగింపు జరిపేందుకు పోలీసు అధికారులనుండి విద్యార్థులు అనుమతి సంపాదించారు

వేలూరులో

రాయవేలూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీకి చెందిన 250 మంది విద్యార్థులు, నర్సింగ్ స్కూలుకు చెందిన 91 మంది విద్యార్థినులు నేడు నల్లబ్యాడ్జీలను ధరించి పట్టణ ప్రధాన వీధులగుండా మౌనంగా ఊరేగింపు జరుపుతూ ఉత్తర ఆర్కాట్ జిల్లా కలెక్టరు కార్యాలయానికి వెళ్లారు.

పోలీసు దౌర్జన్య చర్యలను, చిదంబరంలో పోలీసు కాల్పులను ఖండిస్తూ నినాదాలు వ్రాసిన ప్లేకార్డులను ధరించి వీరు ప్రదర్శన జరిపారు.

కోయంబత్తూరు న్యాయవాదుల ఖండన

విద్యార్థులపై, అధ్యాపకులపై పోలీసులు జరిపిన దౌర్జన్య హింసాచర్యలను ఖండిస్తూ కోయంబత్తూరు న్యాయవాదుల సంఘం నేడు తీర్మానించింది.

పోలీసుల హింసా చర్యలకు గురైకేసులు పెట్టే విద్యార్థులు, ఉపాధ్యాయుల తరఫున ఖర్చులు లేకుండా వాదించటానికి యీ సంఘం తీర్మానించింది.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో జరిగిన పోలీసు దౌర్జన్యాలపై న్యాయ విచారణ జరిపేందుకు హైకోర్టు జడ్జీ నొకరిని నియమించాలని న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

పోలీసు చర్యల ఫలితంగా గాయపడిన విద్యార్థుల కుటుంబాలకు తగినంతగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదుల సంఘం తీర్మానించింది.

మద్రాసు విద్యార్థి సంఘ ప్రకటన

మద్రాసు, ఫిబ్రవరి 2

తమ భవిష్యత్తుకు ప్రమోదాలతో, అడుకం కలిగించేదిగా హిందీ తయారు గావడంతో యీ హిందీ వ్యతిరేకోద్యమం జరుపవలసివస్తుందని మద్రాసు విద్యార్థి సంఘం ఒక ప్రకటన చేసింది.

అఖిలభారత సర్వీస్ పరీక్షలు హిందీలో జరపడానికి నిర్ణయించుకున్నదృష్ట్యా హిందీలో పరీక్షలువ్రాసే ఉత్తరాది వారితో పోటీపడటం చాలా కష్టమనీ యిదివరలో దక్షిణాదివారు పరీక్షలలో విజయవంతంగా నెగ్గుతూ యిప్పుడు విజయవంతం కాకపోవడానికి హిందీ ఒక కారణమని ఆ ప్రకటనలో తెలియజేశారు.

బ్రతుకుతెరువుకోసం దక్షిణ దేశీయులు ఇతర రాష్ట్రాలమీద ఆధారపడి వుండడం సర్వవిదితమేనని, అలాటి బ్రతుకుతెరువు యికనుండి పీడించబడనే సందేహం పొడచూపు తున్నందువల్ల యీ హిందీ వ్యతిరేకోద్యమం కొనసాగిస్తున్నామని తెలియజేశారు.

దేశ జనాభాలో ఆంధ్రులది ద్వితీయ స్థానం

తిరువనంతపురం, ఫిబ్రవరి 4

1961 సంవత్సరం లెక్కల ననుసరించి భారతదేశంలో హిందీభాష మాతృభాషగాకలిగినవారు 13 కోట్ల 34 లక్షలమంది ఉన్నట్లు వెల్లడైంది.

హిందీ మాట్లాడేప్రజలు (బీహారీ, ఛటీస్‌ఘర్‌లను కలుపుకొని) 18 కోట్ల 51 లక్షల మంది ఉంటారు.

మరో 93 లక్షలమందికి హిందీ అనుబంధ భాషగా ఉన్నది.

దేశంలో వివిధ భాషలను మాట్లాడే ప్రజల సంఖ్యా వివరాలను నేడిక్కడ రిజిష్ట్రార్ జనరల్ శ్రీ అశోక్‌మిత్రా నేడు పత్రికా విలేకరులకు వెల్లడించారు

దేశంలోని వివిధ భాషలు మాట్లాడే ప్రజల సంఖ్యా వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయని జనరల్ రిజిష్ట్రారు వెల్లడించారు.

హిందీ 13 కోట్ల 34 లక్షలు, తెలుగు 3 కోట్ల 76 లక్షలు, బెంగాలీ 3 కోట్ల 39 లక్షలు, మరాటి 3 కోట్ల 33 లక్షలు, తమిళం 3 కోట్ల 5 లక్షలు.

రిజిష్ట్రార్ జనరల్ వెలువరించిన వివరాలలో ఉర్దూ గుజరాతీ, కన్నడం, మలయాళం, ఒరియా, పంజాబీ, అస్సామీ, కాశ్మీరీ, సంస్కృతభాషలు మాట్లాడేప్రజల సంఖ్యకూడా ఇవ్వబడింది

బీహారు ఆర్థికమంత్రి రాజీనామా డిమాండు
బడ్జెట్ విషయాలు బయట పొక్కినందుకుగాను

పాట్నా, ఫిబ్రవరి 2

బీహారు ప్రభుత్వపు బడ్జెటులోని అంశాలు కొన్ని బయటకి పొక్కినాయనీ దానికి బాధ్యత వహించవలసిన ఆర్థికమంత్రి రాజీనామానివ్వాలనీ నేడు బీహారు శాసనసభలో ప్రతిపక్ష సభ్యులు రామేశ్వర ప్రసాద్‌సింగ్ (ఇండిపెండెంట్), శ్రీ భోలా ప్రసాద్ (ఎస్ ఎస్ పి.) గార్లు డిమాండు చేశారు

ఆర్థికమంత్రి శ్రీ అంబికాశరణ్‌సింగ్ శాసనసభలో తమ బడ్జెటు ఉపన్యాసాన్ని ఇచ్చి ముగించిన వెనుక వారీ సమస్యను తెచ్చారు.

బడ్జెటు ఉపన్యాసంలోని కొన్ని అంశాలు జనవరి 19 నే స్థానిక దినపత్రికలో ప్రచురించబడినాయని చెప్పారు

సీటిపోరుదలరేట్ల పెంపక గనులలో దళారిల రద్దు, బడ్జెట్‌లో 6 కోట్ల రూపాయలు లోటు మొదలయిన అంశాలు ఆ పత్రికలో వచ్చినవే నన్నారు

కాలవరేట్ల పెంపులను పత్రికలు కేవలం ఊహాగానంమీద ప్రకటించగలిగేవని కావ[illegible] కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ ఇంద్రదీప్‌సిన్హా అన్నారు.

బొంబాయికి శ్రీ నందా రాక
మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులతోసంభాషణ

బొంబాయి ఫిబ్రవరి 3

కేంద్ర హోంమంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా నేడిక్కడకు వచ్చారు. ఆయన రెండు రోజులపాటు యిక్కడ వుంటారు.

ఈరోజు మధ్యాహ్నం ఆయన రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ నాయక్‌తో సంభాషించారు. ఈ సందర్భంలో గోవా ముఖ్యమంత్రి శ్రీ దయానంద బందోద్కర్‌గూడా అక్కడ వున్నారు. మహారాష్ట్రలో గోవావిలీకరణ గురించేవారు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తున్నది.

ఐ.యన్.టి.యు.సి. జనరల్ సెక్రటరీ ప్రకటన

మద్రాసు, ఫిబ్రవరి 2

ఐ. యన్. టి. యు. సి జనరల్ సెక్రటరీ శ్రీ జి. రామానుజం ఒక ప్రకటన చేస్తూ, ఐ. యన్. టి. యు. సి కార్మికులు కాంగ్రెసులో జరిగే ఎన్నికలలో పాల్గొనరాదని, ఐ. యన్. టి.యు.సి కేంద్ర కార్యవర్గం ప్రకటించిందన్నవార్త వాస్తవంగాదని ఖండించారు.

కడుపునొప్పి, పులిత్రేపులు
అజీర్ణము మరియు గ్యాస్ట్రిక్ వ్యాధులకు
జాండు
అభయాసవ్
వీక్ళ
పెద్ద మందుల వ్యాపారులందరివద్ద
లభించును.

10 వ వారం
రిపబ్లిక్ ప్రొడక్షన్స్
బొబ్బిలియుద్ధం
నిర్మాత దర్శకుడు: సీతారామ్


6 వ వారం
వీనస్ పిక్చర్స్ సమర్పించు అశోక్ మూవీస్
సుమంగళి
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు ◆ నిర్మాత గోవిందరాజన
రచన ఆత్రేయ ◆ సంగీతం మహాదేవన్
స్టుడియో శ్రీసారథి (హైదరాబాద్) ◆ నవయుగ విడుదల
డిస్ట్రిబ్యూటర్స్: అశోక్ ప్రొడక్షన్స్ ఎంటర్‌ప్రైజెస్

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు స్వతంత్ర అచ్చు ప్రింటర్స్ విజయవాడ 4 - ప్రధాన సంపాదకుడు: ఏటుకూరు బలరామమూర్తి